అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

బుధవారం 22-3-2023

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 09 | సంచిక : 80 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | www.navatelangana.com | 12 పేజీలు | వెల : 6.50





10 గంటలు

15 ప్రశ్నలు

మూడోసారి కవితను విచారించిన ఈడీ

న్యూఢిల్లీ : మద్యం కుంభకోణంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను దాదాపు పది గంటలకు పైగా సుదీర్ఘంగా ఈడీ అధికారులు విచారించారు. మంగళవారం ఉదయం తుగ్లక్ రోడ్డులోని సీఎం కేసీఆర్ నివాసం నుంచి కవిత బయలుదేరుతూ పది ఫోన్లను, వాటికి సంబంధించిన ఐఎంఈఐ నెంబర్లను మీడియాకు చూపించారు. అక్కడ నుంచి కవిత ఈడీ కార్యాలయానికి చేరుకున్నారు. ఈడీ కార్యాలయంలోని మూడో అంతస్తులో ఆమెను ఐదుగురు ఈడీ అధికారుల బృందం విచారించింది. కవిత విచారణ నేపథ్యంలో ఈడీ కార్యాలయం పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ విధించారు. పోలీస్ బలగాలు మోహరించాయి.

ఉదయం 11.30 గంటల నుంచి రాత్రి 9.30 గంటల వరకు ఈడీ అధికారులు సుదీర్ఘంగా విచారించారు. మొత్తం పది గంటలకు పైగా కవితను అధికారులు ప్రశ్నించారు. కవితపై రెండోరోజు 20 ప్రశ్నలు సంధించగా.. మంగళవారం 15 ప్రశ్నలు అడిగినట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం. కవిత వాడిన ఫోన్లను అధికారులకు అందజేయాలని కవితను సోమవారం నాడు ఈడీ అధికారులు ఆదేశించారు. దీంతో కవిత ఆ పది ఫోన్లను ఈడీకి సమర్పించారు. ఆ ఫోన్లు స్వాధీనం చేసుకున్నాక.. అధికారులు అడిగిన ఫోన్లు ఇవేనా కాదా..? కవిత అవే ఫోన్లు తీసుకొచ్చారా..? లేదా అనేదానిపై మంగళవారం మొత్తం సెల్ ఫోన్ల గురించే విచారణ జరిగినట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం.

సెప్టెంబర్ 2021 నుంచి ఆగస్టు 2022 వరకు కవిత 10 ఫోన్లు వాడి, ధ్వంసం కూడా చేసినట్టు ఈడీ అభియోగం ఉంది. ఈ కేసులో మొత్తం 36 మంది 170 ఫోన్లు మార్చారని ఈడీ అభియోగాలు ఉన్నాయి. స్పెషల్ కోర్టుకు దాఖలు చేసిన ప్రాసిక్యూషన్ కంప్లైంట్‌లో కవిత 10 ఫోన్లు వాడినట్టు ఈడీ స్పష్టంగా తెలిపింది. అందుకే ఈడీ అభియోగం మేరకు కవిత 10 ఫోన్లను ఇవాళ అధికారులుకు ఇచ్చేశారు. రాత్రి 8 గంటల సమయంలో ...2లో

లక్ష్మణరేఖ దాటుతున్నదెవరు?

- భారత వ్యతిరేక ముఠా..అంటూ కిరణ్ రిజిజు తీవ్రవ్యాఖ్యలు
- లక్ష్మణరేఖ దాటుతోందని బెదిరింపు..
- సీఈసీ నియామకాలపై సుప్రీం తీర్పుతో రగడ మొదలు..
- రిటైర్డ్ జడ్జీలపైనా వివాదాస్పద వ్యాఖ్యలు

భారత అత్యున్నత న్యాయ స్థానం సుప్రీంకోర్టుతో మోడీ సర్కార్ బాహాబాహీకి దిగుతోంది. సందర్భం దొరికితే చాలు... న్యాయ వ్యవస్థపై నిందలు వేస్తోంది. కార్యనిర్వాహక వ్యవస్థలో జోక్యం చేసుకుంటోందని సుప్రీంకోర్టుపై మాటల దాడి పెంచింది. కేంద్ర న్యాయశాఖ మంత్రి కిరణ్ రిజిజు ఎక్కడికి వెళ్లినా.. సుప్రీంకోర్టుపై విమర్శలు ఎక్కుపెట్టడమే పనిగా వ్యవహరిస్తున్నారు. సీఈసీ (చీఫ్ ఎలక్షన్ కమిషనర్), ఇతర సభ్యుల నియామకంపై సుప్రీంకోర్టు తీర్పు వెలువడ్డాక, తన మాటల దాడిని కిరణ్ రిజిజు మరింత పెంచారు. పలు మార్లు 'సుప్రీంకోర్టు'ను టార్గెట్ చేస్తూ సంచలన వ్యాఖ్యలు చేస్తున్నారు.





న్యూఢిల్లీ : ఈనెల మార్చి 18న న్యాయవ్యవస్థపై కేంద్ర న్యాయశాఖ మంత్రి కిరణ్ రిజిజు చేసిన వ్యాఖ్యలు గర్హనీయం. రిటైర్డ్ జడ్జీలంతా భారత వ్యతిరేక ముఠాగా తయారయ్యారని, వారిని వదిలిపెట్టమంటూ బెదిరింపులకు దిగారు. "కార్యనిర్వాహక వ్యవస్థలో న్యాయమూర్తులు తలదూర్చితే, నియా మకాలు చేపడితే..న్యాయ వ్యవస్థ పని ఎవరు చూస్తారు?" అని కిరణ్ రిజిజు ప్రశ్నించారు. సుప్రీంకోర్టు లక్ష్మణరేఖ దాటుతుందని అన్నారు. ఒక కేంద్ర మంత్రి..న్యాయవ్యవస్థపై ఈ విధంగా మాటల దాడికి దిగిన సందర్భం గతంలో ఎన్న డూ లేదు. తాజాగా ఆయన చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాం శమైంది.

ఈసీ విశ్వసనీయత పెంచాలనటం తప్పా?

కేంద్ర ఎన్నికల సంఘం మోడీ ...5లో

> ట్రిబ్యునల్స్ విషయంలో సుప్రీంకోర్టు విజయవంతమైన తీర్పులు వెలువరించింది. వీటిని కేంద్రం గాలికి వదిలేసింది. ట్రిబ్యునల్స్ ఏర్పాటు, సభ్యుల ఎంపిక, వాటి పాలనపై జాతీయ ట్రిబ్యునల్ కమిషన్ ఏర్పాటు చేయాలని సుప్రీం మూడు తీర్పులు వెలువరించినా, కేంద్రంలో చలనం లేదు.

న్యాయవ్యవస్థ స్వాతంత్ర్యాన్ని దెబ్బతీసేలా

ట్రిబ్యునల్స్, న్యాయపరమైన విధులను నిర్వర్తించే విషయంలో సంస్కరణలపై సుప్రీం ఆరు తీర్పులను వెలువరించింది. అయితే కేంద్రం ఆ తీర్పులను అమలుజేసేందుకు సుముఖంగా లేదు. న్యాయవ్యవస్థ స్వతంత్రతను దెబ్బతీసే నిబంధనల్ని కొట్టేసిన ప్రతిసారీ, సుప్రీం తీర్పులను కేంద్రం అపహాస్యం చేస్తోంది. 'కొలీజియం' కాకుండా జాతీయ న్యాయ నియామకాల కమిషన్‌ను 2015లో కేంద్రం తీసుకొచ్చింది. ఇందుకోసం భారత రాజ్యాంగ చట్టాలను సవరించింది. అయితే ఈ కమిషన్ ఏర్పాటు చెల్లుబాటు కాదని సుప్రీంకోర్టు తీర్పు వెలువడింది. సుప్రీం కొలీజియం జాబితాపై రాష్ట్రపతి ఆమోదముద్ర వేయటం ద్వారా న్యాయ నియామకాలు జరుగుతాయని తెలిపింది. ఈ తీర్పును కేంద్రం గౌరవించటం లేదు. కొలీజియం సిఫారసులను పదే పదే తిరస్కరిస్తోంది. లేదంటే పెండింగ్‌లో పెడుతోంది.

వుయ్ వాంట్ జేపీసీ.. 5లో..
అదానీ వ్యవహారంపై ప్రతిపక్షాల ఆందోళన

దళితులపై దాడులు, నేరాలు.. 5లో..
2018 నుంచి 189000 కేసులు : కేంద్రం

ప్రగతిశీల ముఖ్యమంత్రుల వేదిక ! 2లో..
గ్రూప్ 8 ఏర్పాటుకు కేజ్రీవాల్ ప్రతిపాదన

కనీస మద్దతు ధర లేకపోతే దేశ ఆహార భద్రతకు ముప్పు
ప్రముఖ ఆర్థిక వేత్త ప్రొఫెసర్ ప్రభాత్ పట్నాయక్ 5లో..



బీసీ జనగణన చెయ్యరేం?

జనచైతన్య యాత్రలో కేంద్రానికి తమ్మినేని ప్రశ్న

- చాయ్ అమ్మిన బీసీ ప్రధాని ఆ జాతికోసం ఏం చేశారు?
- మనువాద, మతోన్మాద బీజేపీని తిరస్కరించండి
- మనుస్మృతి దగ్ధం చేస్తాం... పాల్గొనే ధైర్యం ఉందా?
- బీజేపీ నేతలకు సవాల్
- యాత్రకు అడుగడుగునా ఘన స్వాగతం
- సంఘీభావం తెలిపిన సీపీఐ, టీఆర్ఎస్, కాంగ్రెస్‌పార్టీలు

వివరాలు 2లో..

పేపర్ లీకేజీ కేసులో సిట్ దూకుడు



ఏకకాలంలో మూడు చోట్ల సోదాలు

నవతెలంగాణ-సిటీబ్యూరో

టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ కేసులో సిట్ దూకుడు పెంచింది. అధికారులు మూడు ప్రత్యేక బృందాలుగా విడిపోయి విచారణ కొనసాగించారు. హైదరాబాద్ హిమాయత్‌నగర్ సిట్ కార్యాలయం ముందు మంగళవారం హడావిడి నెలకొంది. బడంగ్‌పేట్‌లో ప్రవీణ్, మణికొండలో రాజశేఖర్, రేణుక ఇండ్లల్లో సిట్ ...5లో

రైతుల పట్ల బ్యాంకులు ఉదారంగా వ్యవహరించాలి

ఎస్ఎల్‌బీసీ సమావేశంలో మంత్రి నిరంజన్‌రెడ్డి

వివరాలు 5లో..

దిగజారుతున్న సీసీఐ ప్రతిష్ట!

వ్యవసాయాన్ని నిరీర్యం చేసి కార్పొరేట్లకు కట్టబెట్టే కుట్ర

- పత్తి ధరలు పడిపోతున్నా మద్దతు ధర పెంచక చోద్యం
- జనవరి నాటికి అమ్మాల్సింది.. ఏప్రిల్ వస్తున్నా ఇండ్లలోనే సగం పత్తి
- కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై కొనసాగుతున్న సీపీఐ(ఎం) జన చైతన్యయాత్రలు



వివరాలు 2లో..

దిగజారుతున్న సీసీఐ ప్రతిష్ట!



నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి (కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి)

కేంద్రం తీరుతో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ)కి స్పాట్ పెట్టినట్టుంది. సంస్థ ఆధ్వర్యంలో ఏటేటా పత్తి కొనుగోళ్లు పడిపోతున్నాయి. రెండేండ్ల నుంచి కొన్ని జిల్లాల్లో అస్సలు కొనుగోళ్లే చేయలేదు. ఈ ఏడాది అన్‌సీజన్‌లో ధర తగ్గడంతో సగానికి పైగా నిల్వలు ఇండ్లలోనే ఉన్నాయి. భారత పత్తి సంస్థ (సీసీఐ) రాష్ట్రవ్యాప్తంగా 121 మార్కెట్‌యార్డుల్లో కొనుగోళ్లకు ఏర్పాట్లు చేయాల్సిందిగా వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి గతేడాది అక్టోబర్ 9వ తేదీన ఆదేశాలు జారీ చేశారు. 313 జిన్నింగ్ మిల్లులనూ నోటిఫై చేస్తూ కలెక్టర్‌లకు ఆదేశాలిచ్చారు. కొనుగోళ్లను పరిశీలించేందుకు రాష్ట్ర, జిల్లాస్థాయిలో కమిటీలను ఏర్పాటు చేయాలని కూడా మంత్రి సెలవిచ్చారు. అయితే, రాష్ట్రవ్యాప్తంగా

ఏ ఒక్కచోటా సీసీఐ కొనుగోళ్లు ప్రారంభించలేదు. గతేడాది ఖరీఫ్‌లో రాష్ట్రవ్యాప్తంగా 50 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేశారు. సెప్టెంబర్ నుంచే పంట దిగుబడి ప్రారంభమైంది. క్వింటాకు రూ.6,380 మద్దతు ధరగా కేంద్రం నిర్ణయించింది. కానీ సీజన్ ఆరంభంలో బహిరంగ మార్కెట్లో క్వింటాల్ రూ. 8,500 పైగా ధర పలకడంతో సీసీఐ కన్నా ప్రయివేటు ట్రేడర్లు అధిక రేటు చెల్లిస్తుండటాన్ని సాకుగా చూపి కార్పొరేషన్ కొనుగోళ్లు చేపట్టలేదు. సీజన్‌లోనే ధర ఆశాజనకంగా ఉండటంతో అన్‌సీజన్‌లో ధర ఇంకా పెరుగుతుందనే ఆలోచనతో రైతులు కూడా సరుకు నిల్వ చేసుకున్నారు. కానీ దీనికి భిన్న పరిస్థితి నెలకొన్నా కేంద్రం మాత్రం సీసీఐని రంగంలోకి దించి రైతులను ఆదుకోవ డం లేదు. మద్దతు ధరను సవరించి క్వింటాల్‌కు ఓ రూ.2000 పెంచాలనే ఆలోచన కూడా చేయ ట్లేదు. కార్పొ రేట్ల కోసం ఎన్నో సానుకూల నిర్ణయా లు తీసుకున్నప్పుడు...రైతుల కోసం చిన్న వెసులుబాటు కల్పించాలనే ధోరణి మోడీ ప్రభుత్వానికి లేదని రైతులు, రైతుసంఘాలు విమర్శిస్తున్నాయి.

తూకం తగ్గుతుంది.. ధర లేదు..


మొత్తం ఐదు ఎకరాల్లో పత్తి వేసిన. మొదట్లో కొన్నిరోజులు ధర బాగుంది. ఇంకా పెరుగుద్దని అనడంతో అప్పుడు అమ్మలే. ఐదునెలల నుంచి అమ్ముదామని చూస్తున్నా. ధర పెరగట్లేదు. రోజురోజుకు పత్తి తూకం తగ్గుతోంది. బేరగాళ్లు వచ్చి అమ్మమంటున్నరు కానీ రూ.6వేల లోపే అడుగుతున్నరు. సీసీఐ నన్న దింపి కొంటరంటే అదీ వచ్చేటట్టు లేదు.

- కొండమీది ఏసు, పమ్మి, ముదిగొండ మండలం

కేంద్రానికి రైతు శ్రేయస్సుకన్నా.. కార్పొరేట్లే మిన్న

మద్దతు ధరల నిర్ణయాధికారం కేంద్ర ప్రభుత్వం చేతిలోనే ఉంటుంది. భారత పత్తి సంస్థ కూడా కేంద్ర ప్రభుత్వరంగ సంస్థే. ఏటేటా పత్తి విస్తీర్ణం పెరుగు తున్నా.. దిగుబడులు పడిపోతున్నాయి. పెట్టుబడులు పెరుగుతు న్నాయి. ధరలు కూడా క్షీణిస్తున్నాయి. ఎకరానికి 4 నుంచి 8 క్వింటాళ్లలోపే దిగుబడి వస్తోంది. కేంద్రం అధీనంలోనే ఉండే ఎరువులు, క్రిమిసంహారక మందుల ధరలు 10 నుంచి 60శాతం వరకూ పెంచిన దృష్ట్యా పత్తికి మరింత ధర లభించేలా ఎందుకు చర్యలు తీసుకోదూ అనే ప్రశ్నలు ఉత్పన్న మవుతోంది. గతంలో పత్తికి ఎకరానికి రూ.15 నుంచి రూ.20 వేల పెట్టుబడి అయితే ఇప్పుడది రూ.25 వేల నుంచి రూ.30వేలకు చేరింది. ఎకరానికి నాలుగు క్విం టాళ్ల దిగుబడి వచ్చి రూ. 10 వేల ధర పలికినా రైతుకు పత్తి మీద మిగిలేది కేవలం రూ.10వేలే. మరో క్వింటా దిగుబడి తగ్గితే ఆ కొంచెం కూడా లాభం లేకపోగా నష్టపోవాల్సి ఉంటుందని రైతులు వాపోతున్నారు. ఖమ్మం జిల్లాలో పత్తి కొనుగోళ్లలో సీసీఐ భాగస్వామ్యం రెండేండ్లుగా అస్సలు లేదు. సీసీఐ అందుబాటులో ఉన్న 2019-20, 2020-21లో రైతులు సద్వినియోగం చేసుకున్నారు. 2019లో ప్రయివేటుకు 9.22 లక్షల క్వింటాళ్లు అమ్మితే సీసీఐకి 10.07 లక్షలు, 2020లో 2 లక్షలు ప్రయివేటు, 8.07 లక్షలు సీసీఐకి అమ్మారు. ఇప్పుడు గ్రామాల్లోకి వెళ్తే పత్తి పండించే ప్రతి మూడిండ్లకు ఓ ఇంట్లో నిల్వలున్నాయి. ప్రతియేటా జనవరి నాటికి పత్తి లేకుండా అమ్ముకునే రైతులు ఈఏడాది మాత్రం ఏప్రిల్ వస్తున్నా పిడికెడు కూడా అమ్మని వారున్నారు. 2022-23లో సోమవారం వరకు 6,53,595 క్వింటాళ్లు మాత్రమే విక్రయించారు. రోజుల తరబడి నిల్వ ఉంచడంతో తూకం తగ్గు తుందని రైతులు వాపోతున్నా రు. ప్రస్తుత మార్కెట్లో గరిష్ఠ ధర రూ.7వేల వరకు లభిస్తోంది. ప్రయివేటు వ్యాపారులు నాణ్యత పేరుతో రూ.5 నుంచి రూ.6వేల లోపే ధర పెడుతున్నారు. ఈ పరిస్థితుల్లోనైనా రైతులను ఆదుకోవాలనే ఆలోచన కేంద్రం చేయట్లేదు.

వ్యవసాయాన్ని కార్పొరేట్లకు కట్టబెట్టే కుట్ర



ప్రయివేటు ట్రేడర్లకు దీటుగా పత్తి సంస్థ మార్కెట్లో ఉంటే రైతులకు మేలు జరుగుతుంది. వ్యవసాయాన్ని కార్పొరేట్లకు కట్టబెట్టాలనే కుట్రలో భాగంగానే కేంద్రం ఇలా వ్యవహరిస్తోంది. వ్యవసాయ చట్టాలను తెచ్చి ఆ కాంక్ష నెరవేర్చుకోవాలనుకుంది. కానీ రైతుల పోరాట ఫలితంగా అది నెరవేరక పోవడంతో వ్యవసాయానికి ఊతం ఇచ్చే సంస్థలు, పథకాలను కేంద్రం నిర్వీర్యం చేసి రైతులను లోబర్చుకోవాలని చూస్తోంది. కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై సీపీఐ(ఎం) జనచైతన్య యాత్రలు నిర్వహిస్తోంది.

- పోతినేని సుదర్శన్, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు

బీసీ జనగణన చెయ్యరేం?

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

దేశంలోని బలహీనవర్గాల స్థితిగతుల అధ్యయనం కోసం బీసీ జనగణనను కేంద్రంలోని నరేంద్రమోడీ ప్రభుత్వం ఎందుకు చేయట్లేదని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ప్రశ్నించారు. బీసీ జనగణన చేయాలని పార్లమెంటులో అన్ని ప్రతిపక్షపార్టీలు డిమాండ్ చేస్తుంటే, అలాంటి పని తాము చెయ్యబోమని బీజేపీ నేతలు తేల్చిచెప్తున్నారనీ, దీన్నిబట్టే దేశంలోని బలహీనవర్గాల పట్ల ఆపార్టీ వైఖరి స్పష్టమవుతున్నదని అన్నారు. సీపీఐ(ఎం) జనచైతన్యయాత్రలో భాగరా మంగళవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పాల్వంచ, కొత్తగూడెం, సుజాతనగర్, జూలూరు పాడులో జరిగిన బహిరంగసభల్లో మాట్లాడారు. అక్కడ నుంచి ఖమ్మంజిల్లా ఏన్కూరు, తల్లాడ మండల కేంద్రాలకు యాత్ర చేరుకుంది. అక్కడ జరిగిన బహిరంగసభల్లో కూడా తమ్మినేని మాట్లాడారు. బీసీ కులంలో పుట్టి, చాయ్ అమ్మి ప్రధానమంత్రి అయ్యాననీ, హిందువులకు ప్రతినిధి అని చెప్పుకుంటున్న నరేంద్రమోడీ, అదే హిందువుల్లో మెజారిటీ ప్రజలుగా ఉన్న బీసీల కోసం ఏం చేశారో చెప్పాలని నిలదీశారు. బీసీ జనగణన జరిగితే జనాభా దామాషా ప్రకారం తమకు రావల్సిన ప్రయోజనాల కోసం ఎక్కడ నిలదీస్తారో అనే భయం బీజేపీని వెంటాడుతుందని అన్నారు. ఉపాధిహామీ పథకాన్ని పట్టణాలకు విస్తరించాలని తాము డిమాండ్ చేస్తుంటే, గ్రామీణంలో ఈ పథకానికి నిధుల్లో కోత విధించారని తెలిపారు. మనువాద, బ్రాహ్మణవాద, మతోన్మాద బీజేపీని ప్రజలు తిరస్కరించాలనీ, మరోసారి ఆపార్టీ కేంద్రంలో అధికారంలోకి వస్తే దేశం ఛిన్నాభిన్నం అవుతుందని హెచ్చరించారు. ఎల్ఐసీ, రైల్వే వంటి ప్రభుత్వరంగ సంస్థల్ని అమ్మేస్తున్నారన్నారు. భూపోరాటంలో గుడిసెలు వేసుకున్న పేదలకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణం ఇండ్ల పట్టాలు ఇవ్వాలనీ, ఇండ్ల నిర్మాణం కోసం ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద కేంద్రం వారికి రూ.10 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆర్థిక నేరగాడు గౌతం అదానీ వ్యవహారంపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ వేయడానికి కేంద్రానికి ఉన్న ఇబ్బందులు ఏంటని అడిగారు. ఉత్తరాదిలో బీజేపీ బలహీనపడుతున్న విషయం గ్రహించి, ఇప్పుడు దక్షిణాదిపై ఆపార్టీ దృష్టి పెట్టిందనీ, దానికోసం ప్రజల్ని కులమతాల పేరుతో విభజించి, పాలించేలా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నదని చెప్పారు. బీజేపీని నడిపిస్తున్న ఆర్ఎస్ఎస్ పేరులో సేవ ఉందేతప్ప, ఏనాడూ ఆ సంస్థ ప్రజలకు చేసిందేమీలేదన్నారు. స్వాతంత్ర్యోద్యమంలో బ్రిటీష్‌వారి తొత్తులుగా వారు పనిచేశారంటూ పలు ఉదాహరణలు చెప్పారు. బీజేపీ ఒకే దేశం...ఒకే కులం అని ఎందుకు అనట్లేదని నిలదీశారు. మనుధర్మ శాస్త్రాన్ని తాము అమలు చేయబోమని ఆపార్టీ నేతలు ధైర్యంగా చెప్తే, తల్లాడలో తెల్లారే మనుధర్మశాస్త్ర ప్రతులను దహనం చేసే కార్యక్రమం నిర్వహిస్తామనీ, బీజేపీ నేతలకు దానిలో పాల్గొనే ధైర్యం ఉందా...అని సవాలు విసిరారు. అలాంటి పని బీజేపీ నేతలు చేస్తే, ఆర్ఎస్ఎస్ వారిని అణచివేస్తుందనీ, దాని మూలాలు అక్కడే ఉన్నాయని స్పష్టం చేశారు.

పరిహారం ఇవ్వండి

అకాలవర్షాలతో పంటలు నష్టపోయిన రైతాంగానికి రాష్ట్ర ప్రభుత్వం ఎకరాకు రూ. 20 వేలు నష్టపరిహారం ఇవ్వాలని తమ్మినేని డిమాండ్ చేశారు. వడగళ్ల వానతో రాష్ట్రంలో పంటలకు తీవ్రంగా నష్టం జరిగిందనీ, 'చర్ల'లో మిర్చిరైతులు అధికంగా నష్టపోయారన్నారు. పంటనష్టం అంచనా వేయాలనీ, కేంద్ర ప్రభుత్వం కూడా నిధులు ఇవ్వాలని కోరారు.

విచారణ జరపండి

టీఎస్‌పీఎస్సీ ప్రశ్నాపత్రాల లీకేజీపై సక్రమంగా సమగ్ర విచారణ జరపాలని తమ్మినేని వీరభద్రం డిమాండ్ చేశారు. విచారణలో దోషులు ఎవరో తేలితే ఆ విషయం ప్రజలకు వెల్లడించాలని చెప్పారు.

సంఘీభావం

సీపీఐ(ఎం) జనచైతన్యయాత్రకు అడుగడుగునా ప్రజల నుంచి స్వాగతం లభించింది. పాల్వంచలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు తోపాటు ఆపార్టీ నేతలు యాత్ర బృందాన్ని కలిసి సంఘీభావం తెలిపారు. తమ్మినేని వీరభద్రంతో కూనంనేని మాట్లాడారు. అలాగే పలు ప్రాంతాల్లో కాంగ్రెస్, టీఆర్ఎస్ స్థానిక నాయకులు యాత్రకు సంఘీభావం తెలిపారు. తల్లాడలో జరిగిన బహిరంగ సభలో స్థానిక శాసనసభ్యుడు సండ్ర వెంకట వీరయ్య ,సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ రావు, పాలడుగు భాస్కర్ పాల్గొని మాట్లాడారు.

పది గంటలు..15 ప్రశ్నలు

(మొదటిపేజీ తరువాయి)

ఎమ్మెల్సీ కవిత విజ్ఞప్తితో బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి సోమా భరత్‌ను ఈడీ కార్యాలయానికి అధికారాలు పిలిపించారు. ఆయన ఆథరైజేషన్ కోసం సంతకాలు తీసుకున్నారు. అనంతరం ఈడీ కార్యాలయం నుంచి బయటకు వచ్చిన కవిత అందరికీ అభివాదం చేస్తూ నేరుగా సీఎం కేసీఆర్ నివాసానికి వెళ్లారు.

ఈడీ స్వార్థపూరిత రాజకీయ ప్రయోజనాలకు అనుగుణంగా వ్యవహరించడం దురదృష్టకరం

ఈడీ స్వార్థపూరిత రాజకీయ ప్రయోజనాలకనుగుణంగా వ్యవహరించడం దురదష్టకరమని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. ఈ మేరకు ఈడీ అసిస్టెంట్ డైరెక్టర్ జోగేంద్రకు కవిత లేఖ రాశారు. "దర్యాప్తు సంస్థ చర్యలు దుర్వినియోగంగా ఉన్నప్పటికీ తదుపరి విచారణల్లో సహకరించడానికి మీరు కోరిన విధంగా గతంలో వినియోగించిన ఫోన్లు అన్నీ అందిస్తున్నాను. నా హక్కులకు భంగం కలిగిస్తున్నా ఎలాంటి పక్షపాతం లేకుండా అందజేస్తున్నా. అయితే మహిళ ఫోను స్వాధీనం చేసుకోవడం గోప్యత హక్కుకు భంగం కలిగించినట్లు కాదా?. 2022 నవంబరులో పలువురు నిందితుల విచారణలో ఫోన్లు ధ్వంసం అయ్యాయని స్టేట్‌మెంట్ ఇచ్చారని, దీన్ని నాకు కూడా ఆపాదిస్తూ చేసిన అసంబద్ధ ఆరోపణలు ప్రశ్నలించాలనుకుంటున్నా. నాకు సమన్లు జారీ చేయకుండా, నన్ను ప్రశ్నించకుండా దర్యాప్తు సంస్థ ఈ విధమైన ఆరోపణలు ఎలా చేస్తుంది? తొలిసారిగా 2022 మార్చిలో విచారణ నిమిత్తం నాకు సమన్లు జారీ చేశారు. గతేడాది నవంబరులోనే ఫోన్లు ధ్వంసం చేశానని ఆరోపించడం దురుద్దేశపూర్వకంగా తప్పుడు ఆరోపణలు చేయడం కాదా? అంతేకాకుండా ఉద్దేశపూర్వకంగా వాస్తవాలకు విరుద్ధంగా లీకులు ఇవ్వడం వల్ల రాజకీయ ప్రత్యర్థులు నన్ను నిందిస్తున్నారు. తద్వారా నా ప్రతిష్టకు తీవ్ర భంగం కలగడంతోపాటు నా పరువు, పార్టీ ప్రతిష్టను ప్రజల్లో తగ్గించే యత్నం జరిగింది. నిష్పక్షపాతంగా దర్యాప్తు చేయాలన్న విధిని తొక్కిపెట్టి ఈడి వంటి ఉన్నతమైన దర్యాప్తు సంస్థ స్వార్థపూరిత రాజకీయ ప్రయోజనాలకు అనుగుణంగా వ్యవహరించడం దురదృష్టకరం. దీంతో నాపై వ్యతిరేక అభిప్రాయాలు సృష్టించడానికి దర్యాప్తు సంస్థ చేస్తున్న యత్నాలు తిప్పికొట్టడానికి ఫోన్లు అన్నీ ఇస్తున్నా" అని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత లేఖలో పేర్కొన్నారు.

సిసోడియా బెయిల్‌పై విచారణ 24కి వాయిదా

ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ కుంభకోణం కేసులో ఆప్ సీనియర్ నేత, ఢిల్లీ మాజీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియాకు మరోసారి నిరాశ ఎదురైంది. బెయిలుపై వాదనలు విన్న ప్రత్యేక కోర్టు సీబీఐని లిఖితపూర్వక సమాధానం ఇవ్వాలని ఆదేశిస్తూ తదుపరి విచారణను మార్చి 24కి వాయిదా వేసింది. సిసోడియా కస్టడీని ఇప్పటికే రెండుసార్లు సీబీఐ కోర్టు పొడిగించింది. సిసోడియా బెయిలు అభ్యర్థనపై ఢిల్లీ కోర్టు మంగళవారంనాడు విచారణ చేపట్టింది. మద్యం కేసులో సీబీఐ విచారణకు సిసోడియా సహకరిస్తున్నారని, సీబీఐ సోదాల్లో ఆయనకు వ్యతిరేకంగా ఎలాంటి ఆధారాలు సీబీఐకి లభ్యం కాలేదని సిసోడియా తరపు న్యాయవాది కోర్టుకు విన్నవించారు. ఆయన కస్టోడియల్ ఇంటరేగేషన్‌కు ఇంకా పొడిగింపు అవసరం లేదనీ, విచారణ నుంచి ఆయన ఎక్కడకీ తప్పించుకుపోవడం లేదని వాదించారు.

ప్రగతిశీల ముఖ్యమంత్రుల వేదిక !

న్యూఢిల్లీ : ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్), తృణమూల్ కాంగ్రెస్, భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) కలిసి బీజేపీయేతర, కాంగ్రెస్సేతర కూటమిని ఏర్పాటు చేసే దిశగా ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నాయి. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. బీజేపీయేతర, కాంగ్రెస్సేతర పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాల ముఖ్యమంత్రులతో భారత ప్రగతిశీల ముఖ్యమంత్రుల వేదిక (గ్రూప్ 8) ఏర్పాటుకు ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ ప్రయత్నిస్తున్నారు. ఈ మేరకు పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, తెలంగాణ (కె చంద్రశేఖరరావు), తమిళనాడు (ఎంకె స్టాలిన్), కేరళ (పినరయి విజయన్), జార్ఖండ్ (హేమంత్ సోరేన్), పంజాబ్ (భగవంత్ సింగ్ మన్) తదితరులకు ఆయన ఇటీవల ఒక లేఖ కూడా రాసినట్టు తెలిసింది. 'మనమంతా కలిసి ప్రగతిశీల ముఖ్యమంత్రుల వేదిక (గ్రూప్ 8)గా కూటమి కడదాం' అని ఆయన లేఖలో ప్రతిపాదించినట్టు సమాచారం. అయితే ఇదే అంశంపై చర్చలు జరిపేందుకు ఢిల్లీలో విందుకు రావాల్సిందిగా ఇదివరకే కేజ్రీవాల్ పలువురు ముఖ్యమంత్రులను ఆహ్వానించారు. అయితే ఆ కార్యక్రమం కార్యరూపం దాల్చలేదు. ఇప్పుడు మళ్లీ గ్రూప్ 8 వేదికను ఆయన తెరపైకి తీసుకురావడం విశేషం. కాగా సీబీఐ, ఈడీ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలను కేంద్ర ప్రభుత్వం దుర్వినియోగం చేస్తున్న తీరుపై గ్రూప్ 8 తొలి చర్యగా ఒక ఉమ్మడి పిటిషన్ దాఖలు చేయాలని కూడా కేజ్రీవాల్ తాజా లేఖలో ప్రతిపాదించినట్టు సమాచారం. అయితే కేజ్రీవాల్ తాజా ప్రతిపాదనలకు సంబంధిత పక్షాలన్నీ అంగీకరించాయా లేదా అన్నది స్పష్టత లేదు. కేంద్ర దర్యాప్తు సంస్థల దుర్వినియోగంపై ఉమ్మడి ఫిర్యాదు ఇవ్వడానికి టీఎంసీ, బీఆర్ఎస్, ఆప్ ఇప్పటికే నిర్ణయానికి వచ్చినట్టు సమాచారం. సుప్రీంకోర్టు లేదా ఢిల్లీ హైకోర్టులో ఈ ఉమ్మడి పిటిషన్ దాఖలు చేసే వీలుందని ఆప్ సీనియర్ నేత ఒకరు తెలిపారు.

పట్టణ ప్రగతితో పురపాలికల్లో మౌలిక వసతులు

ఇప్పటిదాకా రూ.4304 కోట్లు విడుదల

- అందులో రూ.3936 కోట్లు వినియోగం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

దేశంలో అత్యంత వేగంగా పట్టణీకరణ జరుగుతున్న రాష్ట్రాల్లో తెలంగాణ ముందు వరుసలో ఉంది. పట్టణాల్లో మౌలిక వసతుల కల్పన, నిర్దేశిత లక్ష్యాల సాధన కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. మూడేండ్ల కాలంలో 142 పురపాలికలకు రూ.4304 కోట్లను విడుదల చేసింది. అందులో రూ.3936 కోట్లను(దాదాపు 92 శాతం) పురపాలికలు వినియోగించుకున్నవి. జీహెచ్ఎంసీకి రూ.2276 కోట్లు, మిగిలిన 141 పురపాలికలకు రూ.2028 కోట్ల నిధులు అందాయి. ప్రతినెలా జీహెచ్ఎంసీకి రూ.61 కోట్లు, ఇతర మున్సిపాల్టీలకు రూ.55 కోట్లు విడుదలవుతున్నాయి. వినూత్న ఒరవడితో రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు నేతృత్వంలో చేపట్టిన పట్టణప్రగతితో దేశంలో ప్రామాణిక నగరాలు, పట్టణాలున్న రాష్ట్రంగా ప్రతి యేటా తెలంగాణకు జాతీయ అవార్డులు అందుతున్నాయి.

మున్సిపాల్టీలు ఎక్కువగా పర్యావరణ పరిరక్షణ, శానిటేషన్‌పైన దృష్టిసారించి ముందుకెళ్తున్నాయి. 141 పురపాలక సంస్థల్లో ప్రతిరోజూ 4,356 టన్నుల చెత్తను సేకరిస్తున్నాయి. దాని కోసం కొత్తగా 2165 పారిశుద్య వాహనాలను కొనుగోలు చేశారు. దీంతో చెత్త సేకరణ వాహనాలు సంఖ్య



4713కి పెరిగింది. చెత్త ప్రాసెసింగ్ కోసం 141 పురపాలక సంస్థల్లో 1233 ఎకరాల విస్తీర్ణంలో డంపింగ్ యార్డులను ఏర్పాటు చేశారు. తడి, పొడి చెత్తలను వేరు చేసేందుకు 206 డ్రై సోర్స్ కలెక్షన్ సెంటర్లను సిద్ధం చేశారు. సేంద్రీయ ఎరువులుగా మార్చేందుకు 229 కంపోస్ట్ బెడ్‌లను నెలకొల్పారు. రూ.428 కోట్లతో రోజుకు 2035 కిలో లీటర్ల సామర్థ్యం కలిగిన 139 మల వ్యర్థాల శుద్ధి ప్లాంట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. వాటిలో 20 పూర్తికాగా..14 తుది దశలో ఉన్నాయి. పచ్చదనాన్ని పెంపొందించేందుకు గ్రీన్ యాక్షన్ ప్లాన్‌ను పురపాలక సంస్థల్లో ప్రభుత్వం పటిష్టంగా అమలు చేస్తున్నది. 141 పురపాలక సంస్థల్లోని 3468 వార్డుల్లో పట్టణ ప్రకృతి వనాల కింద ట్రీ పార్క్‌లను అభివృద్ధి చేస్తున్నారు. 2021 నుంచి ఇప్పటి వరకూ 34.59 లక్షల మొక్కలను నాటారు. మల్టీ లేయర్ అవెన్యూ ప్లాంటేషన్‌లో భాగంగా 141 పురపాలికల్లో 796 స్ట్రెచ్‌లలో 1208 కిలోమీటర్లకు పొడవున పలు రకాల మొక్కలు నాటారు. పచ్చదనం పెంపు కోసం రూ.779 కోట్ల నిధులను గ్రీన్ బడ్జెట్ కింద కేటాయించారు. హరిత నిధి కింద ట్రేడ్ లైసెన్స్ దారుల నుంచి రూ 128.97 లక్షలు, ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులు నుంచి రూ.14.28 లక్షలు కలిపి మొత్తం రూ. 1.43 కోట్లు జమయ్యాయి. 141 పురపాలక సంస్థలకు 453 శ్మశాన వాటికలు మంజూరు కాగా.. అందులో 297 పూర్తయ్యాయి.



రికార్డు స్థాయిలో రూ.9.62 కోట్లు జరిమానా

- దక్షిణ మధ్య రైల్వే

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దక్షిణ మధ్య రైల్వేకు చెందిన తొమ్మిది మంది టిక్కెట్ తనిఖీ సిబ్బంది రికార్డు స్థాయిలో రూ. 9.62 కోట్లు జరిమానా వసూలు చేసినట్టు ఒక ప్రకటనలో తెలిపింది. 2022-23లో ఈ తొమ్మిది మంది వన్ క్రోర్ క్లబ్‌లో స్థానం సంపాదించారు. దక్షిణ మధ్య రైల్వే చరిత్రలో ఇదే తొలిసారంటూ జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ అభినందించారు.

సామాజిక చైతన్యానికి లఘు చిత్రాలు అవసరం

ప్రముఖ దర్శకుడు వి.ఎన్.ఆదిత్య



నవతెలంగాణ-కల్చరల్

పెద్ద సినిమాలు ఎక్కువగా లాభ నష్టాలు.. వ్యాపారాత్మక కోణం ప్రాధాన్యతగా ఉంటాయని, ఈ సమయంలో సామాజిక చైతన్యానికి లఘు చిత్రాల అవసరం ఎంతో ఉందని ప్రముఖ దర్శకుడు వి.ఎన్.ఆదిత్య అన్నారు. భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా ఆయన స్మరణలో రవీంద్రభారతిలోని పైడి జయరాజ్ ప్రీవ్యూ థియేటర్‌లో భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నిర్వహణలో మంగళవారం లఘు చిత్ర పండుగ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సినిమా మాధ్యమం సమాజాన్ని ప్రభావితం చేస్తుందన్నారు. భగత్ సింగ్ త్యాగ నిరతి దేశభక్తిని నేటి తరానికి స్ఫూర్తి కలిగించేందుకు చిన్న బడ్జెట్‌లో లఘు చిత్రాలు తీయాలని సూచించారు. డైరెక్టర్ ప్రేమ్‌రాజ్ మాట్లాడుతూ.. చిన్న చిత్రాల ద్వారా గొప్ప సందేశం అందించాలని, నేటి లఘు చిత్ర దర్శకులు, నటులే రేపటి పెద్ద చిత్రాలకు ఎదుగుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి, నటుడు బి.డి.ఎల్.సత్యనారాయణ, డివైఎఫ్ఐ హైదరాబాద్ కార్యదర్శి జావేద్, ఎస్ఎఫ్ఐ అధ్యక్ష కార్యదర్శులు అశోక్ రెడ్డి లెనిన్, నాయకులు స్టాలిన్, సాయి, విజయ కుమార్, శ్రీనివాస్, జె కె. శ్రీనివాస్ అజయ్ బాబు కిరణ్, వీరయ్య జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

కొలువుల బిల్లులపై వెంటనే సంతకం చేయాలి

- గవర్నర్‌కు మంత్రి సత్యవతి రాథోడ్ లేఖ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

నిరుద్యోగ యువతకు సంబంధించిన కొలువుల బిల్లులపై వెంటనే సంతకం చేయాలని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ గవర్నర్ తమిళిసైకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం గవర్నర్‌కు మంత్రి లేఖ రాశారు. సోమవారం రాజ్ భవన్‌లో జరిపిన ఉగాది ఉత్సవాల్లో రాష్ట్ర యువతకు దక్కాల్సిన అవకాశాల గురించి ప్రస్తావిస్తూ కొన్ని వ్యాఖ్యలను చేశారని గుర్తుచేశారు. తెలంగాణ యువత కేంద్ర ప్రభుత్వ వైఖరి, వివక్ష వల్లనే తమకు అనేక సమస్యలు ఎదురవుతున్నాయని బలంగా నమ్ముతున్నారని తెలిపారు. గవర్నర్ హోదాలో తెలంగాణ యువకుల ఉపాధి అవకాశాలను అడ్డుకునేలా బిల్లులను తొక్కి పెడుతున్న విషయాన్ని యువత గుర్తుపెట్టుకున్నదని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి చేస్తున్న అనేక అన్యాయాల గుర్తుంచుకుంటున్నారని పేర్కొన్నారు.

రేవంత్ దీక్షను అడ్డుకుంటాం

- జీవీవీ నేత శ్రీను నాయక్ హెచ్చరిక

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి ఈనెల 24,25 తేదీల్లో ఉస్మానియా యూనివర్సిటీలో తలపెట్టిన దీక్షను అడ్డుకుంటామని గిరిజన విద్యార్థి విభాగం నేత శ్రీను నాయక్ ఒక ప్రకటనలో హెచ్చరించారు.ఆయన నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతూ వారిని ప్రభుత్వం మీదకు ఉసిగొల్పుతున్నారని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పేపర్ లీకుల అంశాన్ని రేవంత్ రాజకీయం చేస్తున్నారని విమర్శించారు.

రేవంత్ అవకాశవాది : ఎల్చల దత్తాత్రేయ

నిరుద్యోగులను వాడుకుని రాజకీయం చేస్తామనుకుంటే సహించేది లేదని ఎంబీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎల్చల దత్తాత్రేయ ఒక ప్రకటనలో హెచ్చరించారు. రేవంత్‌రెడ్డి అవకాశవాద రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. ఓటుకు నోటు కేసులో చంద్రబాబు బినామీగా రెడ్‌హ్యాండెడ్‌గా దొరికిన రేవంత్...ఏ మొహం పెట్టుకుని ఓయూకు వస్తున్నారని ప్రశ్నించారు.

సంపాదకీయం

అ'న్యాయం'!

తమకు అనుకూలమైన తీర్పులిచ్చే న్యాయమూర్తులకు మాత్రం రాజ్యసభ సభ్యత్వం, గవర్నరు పదవి ఇచ్చి మోడీ ప్రభుత్వం పునరావాసం కల్పిస్తోంది. ఈ సంప్రదాయం వీరి హయాంలోనే వచ్చింది కాకపోవచ్చు కానీ, నేడు మునుపెన్నడూ లేనంతగా పెచ్చరిల్లిపోయింది. అక్కడితో ఆగకుండా సుప్రీంకోర్టు న్యాయమూర్తులనే హెచ్చరించే స్థాయికి మోడీ సర్కారు చేరుకుంది. ఈ విమర్శల్లో ఆంతర్యం న్యాయవ్యవస్థను లొంగదీసుకోవడమే. సుప్రీంకోర్టు తమకు అనుకూలంగా వ్యవహరించకపోతే సహించబోమని చెప్పడమే.



కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఎవరు మాట్లాడినా... వారంత దేశద్రోహులు, జాతి వ్యతిరేకులు. ప్రస్తుతం బీజేపీ పాలనలో ఇదొక అప్రకటిత శాసనంగా మారిపోయింది. పలువురు రాజకీయ నాయకులు, హక్కుల, సామాజిక కార్యకర్తలు తదితరులపై దేశద్రోహులు అంటూ ముద్ర వేస్తున్న కమలనాథులు, ఆఖరుకు న్యాయమూర్తులను కూడా వదలడం లేదు. వారు కూడా దేశ వ్యతిరేకులేనంటూ, 'యాంటి ఇండియా గ్యాంగ్' అంటూ సాక్షాత్తు కేంద్ర న్యాయశాఖ మంత్రి, బీజేపీ నేత కిరణ్ రిజిజు వ్యాఖ్యానించారు. శనివారం ఓ జాతీయ మీడియా సంస్థ నిర్వహించిన సదస్సులో పాల్గొన్న మంత్రి 'సామాజిక కార్యకర్తలుగా చెప్పుకొనే యాంటి ఇండియా గ్యాంగ్‌లో భాగమైన కొంతమంది జడ్జీలు న్యాయవ్యవస్థను ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రతిపక్ష పాత్ర పోషించేలా మార్చేందుకు ప్రయత్నిస్తున్నారు' అంటూ తీవ్రవ్యాఖ్యలే చేశారు. అంతే కాదు ప్రభుత్వానికి వ్యతిరేకంగా కోర్టును ఆశ్రయించడాన్ని కూడా తప్పుపట్టారు.

మొదట సుప్రీంకోర్టు రాజ్యాంగాన్ని దారి మళ్లించిందన్నారు. ఆ తరవాత న్యాయమూర్తులు ఎన్నికలలో గెలవాల్సిన అవసరం లేదు కదా! అన్నారు. ఇప్పుడు పదవీ విరమణ చేసిన తర్వాత న్యాయమూర్తులు క్రియాశీల సామాజిక కార్యకర్తలుగా వ్యవహరిస్తే వారి విషయంలో చట్టం తనపని తాను చేసుకుపోతుంది అంటూ బెదిరింపులకు దిగుతున్నారు. ప్రభుత్వ లోపాలను ఎత్తిచూపితే ప్రతిపక్ష నాయకుల మీద ప్రయోగించినట్టే సీబీఐ, ఈడీలను మాజీ న్యాయమూర్తులపై కూడా ప్రయోగించక తప్పదని చెప్పకనే చెపుతున్నారు. ఇది ప్రస్తుతం బాధ్యతలలో ఉన్న న్యాయమూర్తులకు కూడా ఓ హెచ్చరికలాంటిదే. ఈ హెచ్చరిక జారీ చేసింది న్యాయవ్యవస్థతో నిరంతరం జగడం పెట్టుకుంటున్న కేంద్ర న్యాయశాఖమంత్రి కిరణ్ రిజిజునే కావడం గమనార్హం.

ఇప్పటికే స్వతంత్ర వ్యవస్థలన్నింటినీ కబళించిన మోడీ సర్కార్, న్యాయవ్యవస్థను కూడా తమ స్వాధీనంలోకి తెచ్చుకోవాలని కృతనిశ్చయంతో ఉంది. అందుకనే న్యాయవ్యవస్థ మీద పదే పదే కిరణ్ రిజిజు ప్రతికూల వ్యాఖ్యలు చేస్తున్నారు. కొలీజియం వ్యవస్థను తప్పుపట్టిన ఆయన న్యాయమూర్తులను న్యాయమూర్తులే నియమించుకోవడం ఏమిటి అని ప్రశ్నించారు. న్యాయమూర్తులే న్యాయమూర్తులను నియమించే కొలీజియం వ్యవస్థలో ఏలిన వారి అనుయాయులు న్యాయమూర్తులయ్యే అవకాశం లేకపోవడం ప్రభుత్వాన్ని కలవర పరుస్తోంది. అధికారపార్టీ తమకు అనుకూలమైన న్యాయమూర్తులను నియమించడం అంటే న్యాయ వ్యవస్థ స్వయం ప్రతిపత్తిని, నిష్పాక్షికతను దెబ్బ తీయడమే.

ప్రభుత్వం మీద విమర్శను మోడీ పై విమర్శగా, మోడీ మీద విమర్శను దేశం మీద విమర్శగా పరిగణిస్తున్నతీరు స్పష్టంగా కనిపిస్తూనే ఉంది. భారత న్యాయవ్యవస్థ హైజాక్‌కు గురవుతున్నదని, ప్రజాస్వామ్యం ఖూనీ అయిందని రాహుల్ గాంధీ లేదా ఏ ఇతరులు చెప్పినా.. అది దేశ న్యాయవ్యవస్థను అణచివేసే ప్రయత్నంలో భాగమేనని రిజిజు వెల్లడించారు. అయితే, కొలీజియం, న్యాయవ్యవస్థ, జడ్జిలపై రిజిజు చేసిన వ్యాఖ్యలను ఏవిధంగా చూడాలి?

తమకు అనుకూలమైన తీర్పులిచ్చే న్యాయమూర్తులకు మాత్రం రాజ్యసభ సభ్యత్వం, గవర్నరు పదవి ఇచ్చి మోడీ ప్రభుత్వం పునరావాసం కల్పిస్తోంది. ఈ సంప్రదాయం వీరి హయాంలోనే వచ్చింది కాకపోవచ్చు కానీ, నేడు మునుపెన్నడూ లేనంతగా పెచ్చరిల్లిపోయింది. అక్కడితో ఆగకుండా సుప్రీంకోర్టు న్యాయమూర్తులనే హెచ్చరించే స్థాయికి మోడీ సర్కారు చేరుకుంది. ఈ విమర్శల్లో ఆంతర్యం న్యాయవ్యవస్థను లొంగదీసుకోవడమే. సుప్రీంకోర్టు తమకు అనుకూలంగా వ్యవహరించకపోతే సహించబోమని చెప్పడమే. అరుణ్ జైట్లీ, రవిశంకర్ ప్రసాద్ న్యాయశాఖమంత్రులుగా ఉన్నప్పుడు కూడా ఇంత బాహాటంగా దాడి జరగలేదు. ప్రభుత్వాధినేత దన్ను, ప్రోద్బలం లేకుండా కిరణ్ రిజిజు ఇలాంటి సాహసం చేయగలరా? కాస్త ఎక్కువకాలం ప్రధాన న్యాయమూర్తులుగా ఉండే అవకాశం వచ్చినవారు ప్రభుత్వానికి అడుగులకు మడుగులొత్తడం లేదు. ఇది ప్రభుత్వానికి సంకటంగా మారుతోంది. సకల రాజ్యాంగ వ్యవస్థలను ధ్వంసంచేస్తున్న మోడీ సర్కారుకు సుప్రీంకోర్టు రాజ్యాంగానికి అనుగుణంగా వ్యవహరించడం మింగుడు పడటం లేదు. ఆ అసహనమే ఇలాంటి వ్యాఖ్యలకు కారణం.

ఒకప్పుడు మధ్యాహ్నం పారిశ్రామిక ప్రాంతాలు రోడ్లనిండా కార్మికులతో కళకళలాడేవి. మొదటి షిఫ్టు అయిపోయి బయటకు వచ్చేవారు కొందరైతే... రెండవ షిఫ్టు డ్యూటీలో చేరేవారు మరికొందరు. కానీ ఇప్పడా ప్రాంతాలు మధ్యాహ్నం నిర్మానుష్యంగా, ఎడారులను తలపిస్తున్నాయి. కంపెనీలలో బందీలై కార్మికులు పనిచేస్తూనే ఉంటారు. కానీ బయటకు ఎత్తైన గోడలు, మూసివేసిన గేట్లు తప్ప ఏమీ కనిపించవు. లోపల ఏమిజరిగినా దిక్కులేదు. కార్మికశాఖ అధికారులకూ, పాలకులకూ ఇవేవీ పట్టవు.

పొట్టచేత పట్టుకుని రాష్ట్రాల సరిహద్దులు దాటి వచ్చి పనిచేస్తున్న వలస కార్మికులు తీవ్ర అభద్రతా భావంలో ఉన్నారు. ఒకవైపు యాజమాన్యాల నిర్బంధం, శ్రమదోపిడీ... మరోవైపు వీరిని తెచ్చిన ఏజెంట్లూ, స్థానిక నాయకులూ, వీరికి తోడు పోలీసుల దాడులు నిత్యకృత్యమైనాయి. రాత్రులు రోడ్ల మీద కనిపించిన వలస కార్మికులను ఐడెంటిటీ కార్డులు చూపించాలంటున్నారు. వారి దగ్గర ఏముంటుంది? అంతే... వారిని దొంగలుగా, సంఘ వ్యతిరేక శక్తులుగా అనుమానిస్తున్నారు. వేధిస్తున్నారు. వలస కార్మికుల పరిస్థితులు, బ్రోకర్ల మాయలో పడి, అరబ్బు దేశాలలో బానిస చాకిరీ చేస్తూ చితికిపోతున్న కార్మికుల పరిస్థితులను పోలి ఉన్నాయి.

నూతన పద్ధతుల్లోనే కార్మికోద్యమ నిర్మాణం సాధ్యం

పారిశ్రామిక కార్మికుల సమస్యల మీద ఫిబ్రవరి 10 నుంచి మార్చి 5వరకు సీఐటీయూ విస్తృతమైన కాంపెయిన్ నిర్వహించింది. మార్చి 6న లేబర్ కమిషనర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించింది. రానున్న కాలంలో ఐక్య కార్మికోద్యమానికి ఇది ఆరంభం మాత్రమే! కనీస వేతనాలు, రోజుకు 7 గంటలు, వారానికి 5రోజుల పని డిమాండ్లు కేంద్ర బిందువుగా ఈ కృషి జరిగింది. కార్మికులలో మంచి ప్రభావం చూపింది. పారిశ్రామిక కార్మికులు సీఐటీయూను ఒక ఆశాజ్యోతిగా చూస్తున్నారు. ఎర్రజెండా వెలుగులో తమ భవిష్యత్తు నిర్మించుకోవచ్చునన్న ఆశలు వారిలో చిగురిస్తున్నాయి. ఇందుకు కారణం వారు అనుభవిస్తున్న సమస్యలే!



ఎస్. వీరయ్య

ఒకవైపు సీఐటీయూ ఈ కృషి చేస్తుంటే, మరోవైపు యాజమాన్యాల కొమ్ముకాస్తున్న బీజేపీ ఏజెంట్లు కొందరు తప్పుడు ఆరోపణలతో ప్రచారం ప్రారంభించారు. ప్రభుత్వం కనీస వేతనం రూ.18వేలుగా నిర్ణయించిందనీ, సీఐటీయూ మాత్రం దానిని అడ్డుకున్నదనీ, 26వేలు ఇవ్వాలనే పేరుతో 18వేలు అమలు కాకుండా చేసిందనీ దుష్ప్రచారం చేశారు. దీనిని కార్మికులు నమ్మలేదు. నిజానికి జరిగిందేమిటి? 73 షెడ్యూలు రంగాలుండగా ఐదు రంగాలకు మాత్రమే రూ.18వేలు కనీస వేతనం రాష్ట్ర ప్రభుత్వం యాజమాన్యాల ఒత్తిడితో అవికూడా గెజిట్ చేయకుండా ఆపింది. తక్షణం ఆ ఐదు జీఓలు అమలు చేయాలని సీఐటీయూ, ఇతర కార్మిక సంఘాలు కూడా కోరాయి. అదే సమయంలో కనీస వేతనం 24వేలు డిమాండు న్యాయబద్ధతను వివరించాయి. బీఎంఎస్ మినహా మిగిలిన సంఘాలన్నీ కలిసి ఐక్య పోరాటం కూడా చేసాయి. (ఫ్లోర్ లెవెల్ మినిమమ్ వేజ్) కనీస వేతనం కేవలం రూ.4,628గా నిర్ణయించిన కేంద్ర బీజేపీ పాలకులకు ఇది మింగుడు పడలేదు.

ప్రయివేటు కంపెనీలే కాదు, ప్రతిష్టాత్మకమైన సింగరేణి బొగ్గు గనులలోనూ ఇదే పరిస్థితి. ఆదర్శ యజమానిగా ఉండవల్సిన సింగరేణిలో కూడా వలస కార్మికుల శ్రమదోపిడీ యధేచ్ఛగా సాగుతున్నది. ఎనిమిది వేల మంది వలస కార్మికులు, ఓపెన్ కాస్ట్ గనులలో పని చేస్తూ కంపెనీ ఆవరణలోనే బందీలై ఉన్నారు. వారి దగ్గరికి యూనియన్ల కార్యకర్తలకు ప్రవేశం లేదు. ఎన్ని రోజులు సింగరేణి కార్మికులు సమ్మె చేసినా ఉత్పత్తి సాగేలా ఈ వలస కార్మికుల చేత చేయిస్తున్నారు.

కార్యకర్తలు, నాయకులు నిర్వహించిన సర్వేలో అనేక సమస్యలు వెలుగులోకి వచ్చాయి. కార్మికుల హృదయవిదారక పరిస్థితులు కనిపించాయి. మార్క్స్ కాలం నాటి ఇంగ్లండులో కార్మికుల స్థితిగతులను స్ఫురిస్తున్నాయి. ప్రపంచీకరణ మాయలో కార్మికుల జీవిత స్థితిగతుల కాలచక్రం 150ఏండ్లు వెనక్కి పోయినట్టు అనిపిస్తున్నది. పని పరిస్థితులు గానీ, కుటుంబ జీవితంగానీ, నివాస పరిస్థితులుగానీ చూస్తే పెట్టుబడిదారుల లాభతృష్ణ, అమానవీయ దోపిడీ స్పష్టమవుతుంది. నరేంద్రమోడీ ప్రభుత్వం కార్మిక చట్టాలు రద్దుచేసింది. కానీ, ఈ అధికారిక ప్రక్రియకు ముందే, కార్మికులకు, చట్టపరమైన హక్కులు అందనంత దూరం వెళ్ళిపోయాయి. వాటిని చట్టబద్ధం చేసింది కేంద్ర ప్రభుత్వం. మానవ జాతి చరిత్రలో జరిగినవన్నీ ఇంతే గదా! అమలులోకి వచ్చిన తర్వాత చట్టబద్ధమవుతాయి. ఇక్కడ కూడా అదే జరిగింది. సరళీకృత ఆర్థిక విధానాల ఫలితమిది.


ఒకప్పుడు మధ్యాహ్నం పారిశ్రామిక ప్రాంతాలు రోడ్లనిండా కార్మికులతో కళకళలాడేవి. మొదటి షిఫ్టు అయిపోయి బయటకు వచ్చేవారు కొందరైతే... రెండవ షిఫ్టు డ్యూటీలో చేరేవారు మరికొందరు. కానీ ఇప్పుడా ప్రాంతాలు మధ్యాహ్నం నిర్మానుష్యంగా, ఎడారులను తలపిస్తున్నాయి. కంపెనీలలో బందీలై కార్మికులు పనిచేస్తూనే ఉంటారు. కానీ బయటకు ఎత్తైన గోడలు, మూసివేసిన గేట్లు తప్ప ఏమీ కనిపించవు. లోపల ఏమిజరిగినా దిక్కులేదు. కార్మికశాఖ అధికారులకూ, పాలకులకూ ఇవేవీ పట్టవు. ఒక కంపెనీ సెక్యూరిటీ గార్డు పటాన్‌చెరు పారిశ్రామిక ప్రాంతంలో 8గంటల పనిదినం ఉన్న కొలువు కోసం పదిరోజులు తిరిగాడు. కాళ్ళు అరిగాయే తప్ప అలాంటి ఉద్యోగం దొరకలేదు. ఇది ఆయన ఒక్కడి పరిస్థితి కాదు. అన్ని కార్మికవాడలలో, మెజారిటీ కార్మికుల పరిస్థితి ఇదే. సూర్యోదయంతో కంపెనీలో అడుగుపెడితే సూర్యాస్తమయం తర్వాతనే బయటకు వచ్చేది. లోపలికి పోయేదైనా, బయటకు వచ్చేదైనా మసక చీకటిలోనే. కారవాన్ పారిశ్రామిక ప్రాంతంలో ఒక మహిళ రెండు నెలలు పనిచేసింది ఒక కంపెనీలో. ఉత్త చేతులతో బయటకు గెంటారు. చేసిన పనికి జీతం అడిగితే "నీవెప్పుడూ మా కంపెనీలో పనిచేయలేదు పొమ్మ"న్నారు. పని చేసినట్టు ఆధారం లేదు. అపాయింట్‌మెంట్ లెటర్ కాదు... కనీసం రిజిస్టరులో ఆరోజు పని చేసినట్టు పేరు కూడా లేదు. ఈ పరిస్థితి ఆ ఒక్క మహిళకే కాదు, వేలాది కాంట్రాక్టు, వలస కార్మికుల దుస్థితి ఇది. రెగ్యులర్ కార్మికులకుతోడు కొంతమంది తాత్కాలిక కార్మికులు పనిచేసేది ఒకప్పుడు. ఇప్పుడది తిరగబడింది. తాత్కాలిక కార్మికులకు తోడు కొద్దిమందిని మాత్రం పర్మినెంట్ కార్మికులుగా నియమిస్తున్నారు. వనపర్తి జిల్లాలో ఒక కంపెనీ యాజమాన్యం శ్రామిక మహిళలకు తాగునీరు కూడా ఇవ్వటం లేదు. నీళ్ళు తాగితే ఎక్కువ సార్లు మూత్ర విసర్జన కోసం బాత్‌రూమ్‌కు పోతారట. ఆ మేరకు ఉత్పత్తి సమయం వృధా అవుతుందట! లాభం తగ్గుతుందట! మరో పారిశ్రామిక యజమాని మహిళల బాత్‌రూమ్ ముందు సూపర్వైజర్‌తో పర్యవేక్షణ చేయిస్తాడట! బాత్‌రూమ్‌లో ఎక్కువసేపు ఉన్నారని తలుపు కొడతాడట. లాభం కోసం పని చేయించే పెట్టుబడిదారీ ప్రపంచంలో ఒక మానవీయ విలువలకు తావెక్కడిది? రక్తం రుచిమరిగిన క్రూర మృగానికీ, లాభం రుచిమరిగిన పెట్టుబడిదారుకూ తేడా ఏమున్నది? రోబోల యుగంలో ఉన్నామంటూనే పురుషులకు రూ.415, రోజు కూలీ ఇస్తూ, మహిళలకు రూ.350 మాత్రమే ఇస్తున్నారు. సమాన పనికి సమాన చట్టం ఇక్కడ కనిపించదు. ఆధునిక పెట్టుబడిదారు లాభార్జనకు ఫ్యూడల్ పురుషాధిక్యత తోడైంది. ఏండ్ల తరబడి అప్రంటీసులుగా, ట్రెయినీలుగా పని చేయిస్తున్నారు. కరీంనగర్ గ్రానైట్ కార్మికులకు నెలకు ఒక్కరోజు, అమావాస్య రోజు మాత్రమే సెలవు ఉంటుంది. మల విసర్జనకు టాయిలెట్ సౌకర్యం లేదు. అనేక ప్రాంతాలలో సగానికి మించి వలస కార్మికులున్నారు. కానీ, వలస కార్మికుల రక్షణ చట్టమే ఈ దేశం గురించి వలసపోయినట్టున్నది. ఇదే కాదు... ఏ కార్మిక చట్టమూ అమలు కావటం లేదు.

వలస కార్మికులకు వసతి సౌకర్యం యాజమాన్యమే కల్పిస్తున్నది. పోచంపల్లి ప్రాంతంలో ఆ గదులలో నిద్రించలేక, వేసవిలో రోడ్డు పక్కన పడుకుంటున్నారు. పాములు, తేళ్ళ బారిన పడిన కార్మికులకు దిక్కులేదు. గదిలో పందికొక్కులు తవ్విన మట్టి కుప్పల మధ్య కూర్చొని అన్నంతింటున్న కార్మికులు వీరు. సంగారెడ్డి ప్రాంతంలో చిన్న చిన్న రేకుల షెడ్లలో ఒక్కొక్క గదిలో 6నుంచి 20 మందిని కుక్కుతున్నారు. అనేక కంపెనీలలో గేటులో పలనే కార్మికుల నివాసాలు. ఎవరూ వారిని కలిసే వీలులేదు. ఉత్తర భారత రాష్ట్రాల నుంచి, ఏజెంట్ల ద్వారా ఈ కార్మికులను సరఫరా చేస్తున్నారు. 3 లేదా 6 నెలలకో బ్యాచి మారుతుంది. ఎవరినీ ఏడాది పొడవునా పనిచేయనీయరు. మరోవైపు స్థానిక ప్రజాప్రతినిధులు, బూర్జువా పార్టీలనాయకులూ యాజమాన్యాల చంకలో చేరారు. ఎవరి భాగం వారికి యాజమాన్యాలు ముట్టజెబుతున్నాయి. స్థానికుల నుంచి ఈ కార్మికులకు అండదొరకకుండా, యూనియన్లు ఆ ఛాయలకు రాకుండా చేసే బాధ్యత వీరిది.

ఇప్పుడు పారిశ్రామిక కార్మికులను సంఘటిత పరచటం ట్రేడ్ యూనియన్ నాయకులకు సవాలుగా మారింది. వారి నివాస ప్రాంతాలలో కలిసి, గంటల తరబడి వారితో గడిపి, వారిని అర్థం చేసుకున్నప్పుడే వారిని సంఘటితం చేయటం, చైతన్య పరచటం సాధ్యపడుతుంది. ఉదయం బ్రేక్‌ఫాస్ట్ చేసి బయలుదేరి, సాయంత్రానికి ఇంటికి తిరిగి వచ్చే కార్యకర్తలకు, నాయకులకు ఈ పని సాధ్యం కాదు. విప్లవ చైతన్యంతో విప్లవ కార్మికోద్యమం నిర్మించే లక్ష్యంతో పనిచేస్తే ఇది సాధ్యం కానిదేమీ కాదు.

ప్రయివేటు కంపెనీలే కాదు, ప్రతిష్టాత్మకమైన సింగరేణి బొగ్గు గనులలోనూ ఇదే పరిస్థితి. ఆదర్శ యజమానిగా ఉండవల్సిన సింగరేణిలో కూడా వలస కార్మికుల శ్రమదోపిడీ యధేచ్ఛగా సాగుతున్నది. ఎనిమిది వేల మంది వలస కార్మికులు, ఓపెన్ కాస్ట్ గనులలో పని చేస్తూ కంపెనీ ఆవరణలోనే బందీలై ఉన్నారు. వారి దగ్గరికి యూనియన్ల కార్యకర్తలకు ప్రవేశం లేదు. ఎన్ని రోజులు సింగరేణి కార్మికులు సమ్మె చేసినా ఉత్పత్తి సాగేలా ఈ వలస కార్మికుల చేత చేయిస్తున్నారు.

పొట్టచేత పట్టుకుని రాష్ట్రాల సరిహద్దులు దాటి వచ్చి పనిచేస్తున్న వలస కార్మికులు తీవ్ర అభద్రతా భావంలో ఉన్నారు. ఒకవైపు యాజమాన్యాల నిర్బంధం, శ్రమదోపిడీ... మరోవైపు వీరిని తెచ్చిన ఏజెంట్లూ, స్థానిక నాయకులూ, వీరికి తోడు పోలీసుల దాడులు నిత్యకృత్యమైనాయి. రాత్రులు రోడ్ల మీద కనిపించిన వలస కార్మికులను ఐడెంటిటీ కార్డులు చూపించాలంటున్నారు. వారి దగ్గర ఏముంటుంది? అంతే... వారిని దొంగలుగా, సంఘ వ్యతిరేక శక్తులుగా అనుమానిస్తున్నారు. వేధిస్తున్నారు. వలస కార్మికుల పరిస్థితులు, బ్రోకర్ల మాయలో పడి, అరబ్బు దేశాలలో బానిస చాకిరీ చేస్తూ చితికిపోతున్న కార్మికుల పరిస్థితులను పోలి ఉన్నాయి.



హిందీ, ఒరియా వంటి భాషలలో కరపత్రం చూసిన ఈ కార్మికుల సంతోషానికి అవధులు లేవు. ఆపద్బాంధవులు తమదగ్గరికే వచ్చినట్టు భావిస్తున్నారు. ఎర్రజెండా నీడన చోటు కోసం ప్రయత్నిస్తున్నారు. ఈ కరపత్రం అందటంతో వారి చేతికి ఏదో గొప్ప ఆయుధం దొరికినంతగా ఊపిరి పీల్చుకుంటున్నారు. తమ స్వరాష్ట్రాలోని కార్మికులకు, ఈ రాష్ట్రంలోనే ఇతర పారిశ్రామిక ప్రాంతాలలోని తమ మిత్రులకు సెల్‌ఫోన్ ద్వారా పంపిస్తున్నారు. కానీ సంతకాల సేకరణకు చేసిన ప్రయత్నాలు అంతగా ఫలించలేదు. సంతకాలు చేసేందుకు వారికి ధైర్యం చాలటం లేదు. ఎంతో కొంత ధైర్యం చేసిన చోట సభలూ, ప్రదర్శనలలో మాత్రం పాల్గొంటున్నారు. వ్యక్తిగతంగా తమ సమస్యలు వివరిస్తున్నారు.

ఇప్పుడు పారిశ్రామిక కార్మికులను సంఘటిత పరచటం ట్రేడ్ యూనియన్ నాయకులకు సవాలుగా మారింది. వారి నివాస ప్రాంతాలలో కలిసి, గంటల తరబడి వారితో గడిపి, వారిని అర్థం చేసుకున్నప్పుడే వారిని సంఘటితం చేయటం, చైతన్య పరచటం సాధ్యపడుతుంది. ఉదయం బ్రేక్‌ఫాస్ట్ చేసి బయలుదేరి, సాయంత్రానికి ఇంటికి తిరిగి వచ్చే కార్యకర్తలకు, నాయకులకు ఈ పని సాధ్యం కాదు. విప్లవ చైతన్యంతో విప్లవ కార్మికోద్యమం నిర్మించే లక్ష్యంతో పనిచేస్తే ఇది సాధ్యం కానిదేమీ కాదు. ■



శోభకృత్ కాలానికి స్వాగతం..

కొత్త చిగుర్లు తొడుగుతోంది..
కాలమయిందని చెట్టు..
పరవశించిన ప్రకృతి మలుపు
కమ్మని కోకిల పిలుపు..
పాత కొత్తల మేలవింపుతో
"షష్టి వర్ష కాల చక్రం" మార్పును
ఆహ్వానించడమే నూతన వత్సర "ఉగాది"..
షడ్రుచుల పచ్చడి సారాన్ని ఆస్వాదిస్తూ..
మన జీవన సమ్మిళిత విశ్వాస స్ఫూర్తితో..
ఆశయ సాధనే అంతిమ లక్ష్యంగా..
నిర్భయంగా ప్రయాణాలు, ప్రయత్నాలు చేస్తాం..
అదే..జీవిత సత్యం విజయ రహస్యం..
మెరుగులకైనా, మెరుపులకైనా
"మార్పే" చక్కని మేళవింపు..
సుఖసంతోషాలకు ఏకైక నియమం..
రాత్రి ప్రశాంతంగా నిద్ర పోనియ్యని
పనులేవి పగలు చేయరాదు..
పగలు తలదించుకునే పనులను
రాత్రి తలపెట్టకూడదు..
వీటిని నిత్య జీవితంలో అమలు చేసే వారిని
కాలం కావ్య గర్భం(చరిత్ర)లో నిలుపుతుంది..
కాదంటే? కాల గర్భంలో కలుపుతుంది..
మనలోని శక్తి యుక్తులను పోగుచేసుకుని
నిన్నటి కన్నా! నేడు కొత్త తలంపుతో
నెగ్గేదాకా తగ్గేదే లేదని..
నూతన శోభకృత్ వత్సరానికి
స్వాగతం పలుకుదాం...

- మేకిరి దామోదర్,
సెల్:9573666650.

ఉక్రెయిన్ సంక్షోభం - పశ్చిమ దేశాల ఇరకాటం

ఉక్రెయిన్ సంక్షోభం ఏడాది క్రితం ప్రారంభమైనట్లు పైకి కనిపించినా పశ్చిమ దేశాల మద్దతుతో పది సంవత్సరాల క్రితం "యూరోమైదాన్" పేరుతో ఉక్రెయిన్లో అమలు జరిపిన కుట్ర దానికి నాంది పలికింది. అది అమెరికా-రష్యా ఘర్షణకు దారి తీసింది. రష్యా మీద అవసరమైతే దాడి చేసేందుకు అమెరికా రెండు విమానవాహక యుద్ధ నౌకలను రష్యా ముంగిట తెచ్చిపెట్టింది. దాంతో ఉక్రెయిన్ మీద పుతిన్ సైనిక చర్యకు దిగాడు. మరోవైపు డోనాల్డ్ ట్రంప్ ఏలుబడిలో చైనాతో వాణిజ్య పోరుతో ప్రారంభించి ఇప్పుడు సాంకేతిక పరిజ్ఞాన పోరు అనే మరో రెండో రంగాన్ని కూడా తెరిచారు. ఈ పూర్వరంగంలో షీ జిన్‌పింగ్ మాస్కో పర్యటన నామమాత్రం కాదు అన్నది స్పష్టం.

చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ రష్యాలో పర్యటిస్తున్నారు. తుది ప్రకటన విడుదల కాకముందే ప్రపంచ మీడియాలో పరి పరి విధాల వ్యాఖ్యానాలు వెలువడుతున్నాయి. ఉక్రెయిన్ సమస్య పరిష్కారానికి 12 అంశాలతో చైనా చేసిన ప్రతిపాదన ఇప్పుడు ఉక్రెయిన్ సంక్షోభ పరిష్కారానికి పన్నెండు అంశాలతో చైనా ఒక ప్రతిపాదనను ముందుకు తెచ్చిన పూర్వరంగంలో ఆసక్తి మరింతగా పెరిగింది. అమెరికా, ఇతర నాటో కూటమి దేశాలకు ఇది మింగా కక్కలేని పరిస్థితిని ఏర్పరచింది. చైనా ప్రతిపాదనలపై చర్చించేందుకు తమకు అభ్యంతరం లేదని రష్యా స్పష్టంగా స్పందించింది. తాము కూడా వాటిని పరిగణనలోకి తీసుకుంటామని ఉక్రెయిన్ ప్రకటించింది. ఈ అంశాలపైనే ప్రధానంగా జిన్‌పింగ్-పుతిన్ మంగళవారంనాడు నాలుగున్నర గంటల పాటు చర్చలు జరిపినట్లు వార్తలు. ఇతర అంశాలపై బుధవారంనాడు కూడా కొనసాగుతాయి. మాస్కో చర్చల గురించి అమెరికా విదేశాంగశాఖ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ మాట్లాడుతూ... ఐరాస నిబంధనల ప్రకారం ఉక్రెయిన్ సంక్షోభాన్ని నివారించాలన్న చైనా ప్రతిపాదనల్లోని ఒక అంశం మీద నిజానికి చైనా దానికి కట్టుబడితే ఇదే ప్రాతిపదిక మీద వ్లదిమిర్ జెలెనెస్కీ, ఉక్రెయిన్‌తో కూడా షీ జిన్‌పింగ్ మాట్లాడాలని అన్నాడు. తమ మీద జరుపుతున్న దాడికి స్వస్తి పలికేందుకు చైనా తన పలుకుబడిని ఉపయోగించగలదని, జెలెనెస్కీ, షీ మధ్యనేరుగా చర్చలు జరపాలని ఉక్రెయిన్ విదేశాంగశాఖ ప్రతినిధి ఒలెగ్ నికొలెంకో కోరాడు. వీలైనప్పుడు తమ దేశాన్ని సందర్శించాలని పుతిన్‌ను కోరినట్లు షీ జిన్‌పింగ్ వెల్లడించాడు.



ఎం కోటేశ్వరరావు

మరియాపూల్ ప్రాంతాన్ని పుతిన్ సందర్శించారు. ఉక్రెయిన్‌కు మరిన్ని ఆయుధాలను అందించేందుకు నాటో కూటమి పూనుకుంది. దానిలో భాగంగా గతంలో సోవియట్ నుంచి పొందిన మిగ్ 29 విమానాలను పోలాండ్, స్లోవేకియా దేశాలు ఉక్రెయిన్‌కు అందచేసి రష్యా మీదకు పురికొల్పుతున్నాయి. కిరాయి మూకల పేరుతో పోలాండ్ తన మిలిటరీని కూడా పంపినట్లు వార్తలు. ఇలాంటి వాటితో పుతిన్ సేనలు ఓటమి ఖాయమంటూ మరోవైపున ప్రచారం. చైనా బెలూన్ కూల్చివేతకు ప్రతీకారం అన్నట్లుగా అమెరికా ప్రయోగించిన ఒక నిఘా డ్రోన్లును నల్ల సముద్రంలో రష్యా విమానాలు కూల్చివేశాయి. ఫిన్లండ్ నాటోలో చేరేందుకు టర్కీ అంగీకారం తెలిపింది. ఇలా అనేక కీలక పరిణామాలు జిన్‌పింగ్ రాక ముందు జరిగాయి.

ఇరు దేశాల మధ్య స్నేహబంధం, ఇతర సంబంధాలు మరింత పటిష్టం కావించుకోవటం గురించి చివరి రోజు ఎలాగూ చెబుతారు. చైనా ముందుకు తెచ్చిన ఉక్రెయిన్ సంక్షోభ పరిష్కార అంశాల చుట్టూ ఇప్పుడు చర్చ నడుస్తున్నది. ఈ పర్యటనతోనే అవి కొలిక్కి వచ్చే అవకాశాలు లేవు. ఇది ప్రారంభం మాత్రమే. పశ్చిమ దేశాలు నడిపే శల్యసారథ్యం ఎలా ఉంటుందో చూడాల్సి ఉంది. ఇప్పటి వరకు జరిగిన పరిణామాల్లో ఉక్రెయిన్ తొలి రోజుల్లో చర్చలకు సిద్ధపడినా అమెరికా తన పథకాన్ని అమలు జరిపేందుకు వాటిని చెడగొట్టింది. రష్యా లేవనెత్తిన తన భద్రత అంశాలను విస్మరించటమేగాక దానిపై ఆంక్షల కత్తికట్టింది. ఇతర పశ్చిమ దేశాలు వంతపాడుతున్నాయి. పుతిన్‌తో చర్చించిన తరువాత షీ జిన్‌పింగ్ అవసరమైతే ఉక్రెయిన్ కూడా వెళతారని వార్తలు. గతేడాది డిసెంబరు 30న షీ జిన్‌పింగ్‌తో పుతిన్ జరిపిన వీడియో చర్చలలో మాస్కో రావాలని పుతిన్ ఆహ్వానించినా, కేవలం వారం రోజుల ముందే షీ టూర్ ఖరారైంది. ఫిబ్రవరి 24వ తేదీన చైనా విదేశాంగ మంత్రిత్వశాఖ శాంతి ప్రతిపాదనలను ప్రకటించింది. షీ టూర్‌కు ముందు అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు(ఐసిసి) పశ్చిమ దేశాల ప్రచారదాడి పథకంలో భాగంగానే పుతిన్ మీద అరెస్టు వారంట్ ప్రకటన చేసినట్లు కనిపిస్తోంది. కోర్టు తీర్పులకు కట్టుబడి ఉంటామని అంగీకరించిన దేశాలకే దాని నిర్ణయాలు వర్తిస్తాయి ఇతర దేశాలకు కాదు. ఇది చైనా మీద ఒత్తిడి తేవటంలో భాగంగా జరిగినట్లు చెబుతున్నారు. ఐసిసిలో అమెరికా, చైనా, రష్యా



మరికొన్ని దేశాలు భాగస్వాములు కాదు. లేని మారణాయుధాలను సాకుగా చూపి ఇరాక్ మీద దాడి చేసి దాదాపు ఆరులక్షల మంది పౌరుల ప్రాణాలను బలిగొన్న, కోట్లాది మంది జీవితాలను అతలాకుతలం గావించిన అమెరికా, దాని మిత్రదేశాల అధిపతుల మీద ఐసిసి ఇలాంటి అరెస్టు వారంట్లను జారీ చేయలేదు.

అంతర్జాతీయ చట్టాలకు అనుగుణంగా ప్రపంచ వ్యవస్థను కాపాడేందుకు రష్యాతో పాటు ఒక రక్షకుడిగా చైనా నిలిచేందుకు సిద్ధమని మాస్కోలో జిన్‌పింగ్ చెప్పాడు. సోమవారం రాత్రి విందుకు ముందు పుతిన్‌తో కలసి ఇష్టా గోష్టిగా విలేకర్లతో క్లుప్తంగా మాట్లాడుతూ... పుతిన్ ఆహ్వానం మేరకు మరోసారి సందర్శనకు రావటం సంతోషంగా ఉందని, ఇరుదేశాల సంబంధాలు చక్కగా, స్థిరమైన వృద్ధితో ముందుకు సాగేందుకు కొత్త ఊపు నిస్తుందని అన్నాడు. ఈ సందర్భంగా పుతిన్ మాట్లాడుతూ ఉక్రెయిన్ సంక్షోభ తీవ్రత గురించి చైనా ప్రతిపాదించిన శాంతి ప్రతిపాదనలను క్షుణ్ణంగా అధ్యయనం చేశామని, వాటి గురించి చర్చించేందుకు మాకు అవకాశం వచ్చిందంటూ, చర్చలకు తాము ఎప్పుడూ సిద్ధంగానే ఉన్నట్లు చెప్పాడు. అంతకు ముందు పీపుల్స్ డైలీ (చైనా) పత్రికలో పుతిన్ రాసిన ఒక వ్యాసంలో ఉక్రెయిన్‌లో జరుగుతున్న పరిణామాల మీద చైనా సమతుల్య వైఖరితో ఉన్నందుకు తాము కృతజ్ఞులమై ఉంటామని, దాన్ని పరిష్కరించేందుకు ఒక నిర్మాణాత్మక పాత్రను పోషించేందుకు సుముఖంగా ఉండటాన్ని ఆహ్వానిస్తున్నామన్నాడు. ఉక్రెయిన్ అంశంలో వ్యవహార జ్ఞానంతో ఉండాలని షీ జిన్‌పింగ్ కోరినట్లు రష్యా అధికార పత్రిక రూసిసక్యా గజెటాలో ప్రచురించిన ఒక ఆర్టికల్లో పేర్కొన్నారు.

ప్రపంచ వ్యవహారాల నిర్వహణలో మరింత ప్రబలమైన పాత్ర పోషించాలని చైనా కోరుకుంటోందని దాన్ని మరింత ముందుకు నెట్టేందుకు ఈ పర్యటన కలసి వచ్చిందని పశ్చిమ దేశాలు భావిస్తున్నాయి. ఉక్రెయిన్ నుంచి పుతిన్ సేనలు వైదొలగటం, స్వాధీనం చేసుకున్న ప్రాంతాల నుంచి వెళ్లిపోవటం వంటి వాటి గురించి చైనా ప్రతిపాదనల్లో స్పష్టత లేదని, అందువలన అది ముందుకు పోదని పశ్చిమ దేశాలు చిత్రిస్తున్నాయి. చైనా ప్రతిపాదనలు ప్రమాదకర పర్యవసానాలకు దారితీస్తాయని అమెరికా పత్రిక టైమ్ ధ్వజమెత్తింది. ఈ ప్రతిపాదన ద్వారా అంతర్జాతీయ రాజకీయాల్లో కేంద్ర స్థానాన్ని ఆక్రమించేందుకు ఒక ముఖ్యమైన అడుగువేసింది. చైనా భద్రతతో నేరుగా సంబంధంలేని అంశాల్లో బాధ్యత తీసుకొనేందుకు, ముప్పు ఎదుర్కొనేందుకు గతంలో దూరంగా ఉండేది. ఇప్పుడు జింపింగ్ కొత్త పద్ధతుల్లో చైనా ప్రభావాన్ని చూపేందుకు పూనుకున్నారు. శాంతి ప్రతిపాదనల్లో మొక్కుబడిగా ఉక్రెయిన్ సార్వభౌమత్వం పట్ల గౌరవం ఉందని పేర్కొన్నది. పౌరుల రక్షణ, మానవతా పూర్వసాయంపై జోక్యం చేసుకోరాదని, అణ్వాయుధా లను ఉపయోగించే అవకాశాలను ఖండించటం, ప్రపంచంలో వెల్లడైన అభిప్రాయాలను అది ప్రతిబింబించినప్పటికీ ప్రధానంగా రష్యాకు సాయపడేవిధంగా ప్రతిపాదనలు ఉన్నట్లు టైమ్స్ విశ్లేకుడు ఆరోపించాడు. వాటి ప్రకారం తక్షణమే కాల్పుల విరమణ జరిగితే రష్యా జయించింది దాని దగ్గరే ఉంటుంది. తమ ప్రాంతాలను తమకు స్వచ్ఛందంగా అప్పగించాలని పుతిన్‌ను ఉక్రెయిన్ బతిమాలుకోవాల్సి ఉంటుందని టైమ్ రెచ్చగొట్టింది. నష్టపోయేందుకు ఎవరూ సిద్ధం కానందున ఈ దశలో శాంతిపథకం విజయవంతం కాదని పేర్కొన్నది. పశ్చిమ దేశాల వ్యాఖ్యాతలు ముందుకు తెచ్చిన అంశాలు వాటి పాలకవర్గాల ఆలోచనా వైఖరిని ప్రతిబింబిస్తున్నాయి. వాటిలో చైనాను బెదిరించటం కూడా ఒకటి.

కరోనా, తరువాత ఉక్రెయిన్ సంక్షోభం కారణంగా తలెత్తిన పరిస్థితి, పేద, వర్ధమాన దేశాలకు సంకటంగా మారింది. దాన్ని పరిష్కరించకుండా అడ్డుపడుతున్నది అమెరికా, పశ్చిమదేశాల కూటమే అని అవి భావిస్తున్నాయి. ధరల పెరుగుదల, ఆర్థిక మాంద్యం, ద్రవ్యోల్బణం, సరఫరా సంక్షోభం వంటి తీవ్ర పరిస్థితిని ఎదుర్కొంటున్నాయి. ఉక్రెయిన్ వివాదాన్ని మరింత తీవ్రంగావించే, దీర్ఘకాలం కొనసాగించే ఎత్తుగడల కారణంగా రష్యా మీద విధించిన ఆంక్షలకు అవి మద్దతు పలకకపోవటంతో అమెరికా వ్యూహవేత్తలు కంగుతిన్నారు. ఇరాన్-సౌదీ మధ్య చైనా కుదిర్చిన ఒప్పందం తరువాత ఉక్రెయిన్ సంక్షోభం పరిష్కారానికి అడ్డుపడేవారి మీద వత్తిడి పెరుగుతోంది. ఇప్పుడు చైనా ముందుకు తెచ్చిన శాంతి పథకాన్ని సూత్ర ప్రాయంగా ఏ దేశమూ కాదనలేదు. ఉక్రెయిన్‌కు బాసటగా నిలిచి చర్చలకు అడ్డుపడుతున్న పశ్చిమ దేశాల మీద మరింత ఆగ్రహం వెల్లడి అవుతోంది.

తమ పెత్తనానికి ఎసరు వస్తోందని, దానికి చైనా, రష్యాలే కారణమని భావిస్తున్న అమెరికా, ఇతర పశ్చిమ దేశాలు ఇటీవలి కాలంలో అన్ని విధాలుగా పెద్ద సవాలు విసురుతున్నాయి. ఈ నేపథ్యంలో రెండు దేశాలూ తమ సంబంధాలను మరింతగా పెంచుకోవాల్సిన అవసరాన్ని ముందుకు తెచ్చాయి. ఉక్రెయిన్ సంక్షోభం ఏడాది క్రితం ప్రారంభమైనట్లు పైకి కనిపించినా పశ్చిమ దేశాల మద్దతుతో పది సంవత్సరాల క్రితం "యూరోమైదాన్" పేరుతో ఉక్రెయిన్లో అమలు జరిపిన కుట్ర దానికి నాంది పలికింది. అది అమెరికా-రష్యా ఘర్షణకు దారి తీసింది. రష్యా మీద అవసరమైతే దాడి చేసేందుకు అమెరికా రెండు విమానవాహక యుద్ధ నౌకలను రష్యా ముంగిట తెచ్చిపెట్టింది. దాంతో ఉక్రెయిన్ మీద పుతిన్ సైనిక చర్యకు దిగాడు. మరోవైపు డోనాల్డ్ ట్రంప్ ఏలుబడిలో చైనాతో వాణిజ్య పోరుతో ప్రారంభించి ఇప్పుడు సాంకేతిక పరిజ్ఞాన పోరు అనే మరో రెండో రంగాన్ని కూడా తెరిచారు. ఈ పూర్వరంగంలో షీ జిన్‌పింగ్ మాస్కో పర్యటన నామ మాత్రం కాదు అన్నది స్పష్టం. సెల్: 8331013288

పండుగల్లో మన తెలుగువారికి అతిముఖ్యమైన పండుగ ఉగాది. ఉగాది రోజు నుండే తెలుగు సంవత్సరం మొదలవుతుంది కాబట్టి ఇది తెలుగువారి మొదటి పండుగ. మామిడితోరణాలూ, పచ్చిమామిడి కాయలూ, పిండివంటలతో అన్ని లోగిళ్లూ ఘుమఘుమలాడిపోతాయి. ముఖ్యంగా ఉగాది పచ్చడి కచ్చితంగా చేసుకుంటారు. ఎందుకంటే జీవితంలో కష్టాసుఖాలు కూడా ఉగాది పచ్చడి అంత సురిచికరంగా సౌకర్యవంతంగా మారి మన జీవన మనుగడకు దోహదం చేస్తాయని ఒక నమ్మిక. అయితే ఈ కాలంలో దొరికే వస్తువులతో ఉగాది పచ్చడి చేసుకుని సేవిస్తే కొన్ని రకాల వ్యాధులు రాకుండా కాపాడుకోవచ్చని సైన్స్ చెబుతుంది. అయితే దీంతో పాటు బొబ్బట్లు, పూర్ణాలు, మామిడికాయ చిత్రాన్నం, కొబ్బరి లడ్డూలు వంటి ప్రత్యేమైన వంటకాలు ఉగాది రోజే చేస్తారు. ఈ శోభకృత్ ఉగాదికి కొన్ని వంటలు మీకోసం...

ఉగాది రుచులు..!!

ఉగాది పచ్చడి



కావల్సిన పదార్థాలు : వేపపువ్వు రేకులు - స్పూను, చెరుకు ముక్క - చిన్నది, కొబ్బరి ముక్క - చిన్నది, అరటిపళ్ళు - ఆరు, చింతపండు - నిమ్మకాయంత, మామిడికాయ - చిన్నది, బెల్లం - వంద గ్రాములు, పచ్చిమిర్చి - ఒకటి, ఉప్పు - చిటికెడు, ఏలకులు - రెండు, నీళ్ల - రెండు గ్లాసులు.

తయారు చేసే విధానం : ముందుగా చెరకు, కొబ్బరి, బెల్లం, పచ్చిమిర్చి, మామిడికాయలను చిన్న చిన్న ముక్కలుగా చేసుకుని విడివిడిగా పెట్టాలి. వేప పువ్వును శుభ్రపరిచి రేకల్ని మాత్రం పక్కన ఉంచుకోవాలి. ఏలకులు మెత్తగా చేసి పెట్టుకోవాలి. రెండు గ్లాసుల నీళ్లల్లో చింతపండు బాగా పిసికి ఆ నీళ్ళను ఒక గిన్నెలోకి వడగట్టాలి. అందులో బెల్లం వేసి బాగా కలియబెట్టాలి. ఆ తర్వాత అరటిపళ్ళను బాగా ముద్ద చేసి ఆ నీళ్ళలో కలపాలి. ఎక్కడా అరటిపండు ముక్కలు ఉండకూడదు. అందులో చిటికెడు ఉప్పు, ఏలకల పొడి, చెరకు, కొబ్బరి, పచ్చి మిర్చి, మామిడి కాయ ముక్కల్ని వేసి బాగా కలపాలి. అంతే ఉగాది పచ్చడి రెడీ.



మామిడికాయ చిత్రాన్నం

కావల్సిన పదార్థాలు : అన్నం - కప్పు, తురుమిన మామిడకాయ -ఒకటి, పచ్చిమిర్చి - 10, పసుపు - చిటికెడు, పల్లీలు - అర కప్పు, కొత్తిమిర - కట్ట, తురిమిన కొబ్బరి - కప్పు, ఎండబెట్టిన మెంతి ఆకు - టీస్పూను, ఉప్పు తగినంత

తయారు చేసే విధానం : ముందుగా అన్నం వండి పక్కన పెట్టుకోవాలి. ఒక మిక్సీ జార్‌లో పచ్చి మిర్చి, ఇంగువ, పసుపు వేసి పేస్ట్‌లా తయారు చేసుకోవాలి. ఆ తర్వాత మరో బాణలిలో నూనె వేడి చేసి అందులో ఆవాలు, మినపప్పు, పల్లీలు వేసి 2 నుండి 3 నిమిషాలు వేయించాలి. ఇందులో మిక్సీ జార్‌లో వేసుకున్న పేస్ట్ వేసి, ఆపై కొద్దిగా కరివేపాకు వేసి రెండు నిమిషాలు వేయించండి. ఇప్పుడు తరిగిన కొత్తిమీర, మేథి పొడర్ వేసి, అందులో ఉడికించిన అన్నం, తురిమిన పచ్చి మామిడి తురుమును వేసి బాగా కలపండి. మామిడికాయ పుల్లగా ఉంటే అందులో టీస్పూన్ చక్కెరను కూడా కల పొచ్చు. ఇందులో తురిమిన కొబ్బరి, ఉప్పు వేసి అన్ని పదార్థాలను బాగా వేయించాలి.

కొబ్బరి లడ్డూలు



కావాల్సిన పదార్థాలు : మిల్క్ మెయిడ్ లేదా కండెన్స్‌డ్ పాలు - కప్పు, కొబ్బరి తురుము - రెండు కప్పులు, సన్నగా తరిగిన డ్రైఫ్రూట్స్ (బాదం, జీడిపప్పు, కిస్ మిస్) - మూడు చెంచాలు, ఇలాచి పొడి - చెంచా.

తయారు చేసే విధానం : ముందుగా నాన్ స్టిక్ పాన్‌లో కొబ్బరి కోరుని రెండు నిమిషాలు పాటు వేయించుకోవాలి. ఇందులోనే కండెన్స్‌డ్ పాలు, డ్రైఫ్రూట్స్, ఇలాచి పొడి వేసి బాగా కలిపి దగ్గరకు రానివ్వాలి. ఒక పళ్లెంలోకి తీసుకుని చల్లారిన తర్వాత లడ్డుల్లాగా చుట్టుకోవాలి.

పూర్ణం బూరెలు

కావలసిన పదార్థాలు : శనగపప్పు - పావు కిలో, బెల్లం - 200 గ్రా, యాలకుల పొడి - చిటికెడు, నెయ్యి - నాలుగు స్పూన్లు.

పూతపిండికి : మినపప్పు - గ్లాసు, బియ్యంపిండి - రెండు గ్లాసులు, ఉప్పు- చిటికెడు, నూనె - వేయించడానికి సరిపడా.

తయారు చేసే విధానం : మినపప్పు రెండు గంటలు పాటు నానబెట్టుకుని మెత్తగా రుబ్బుకుని తడిపిన బియ్యం పిండిలో వేసి తగినంత ఉప్పు కలిపి ఒక గంట నాననివ్వాలి. శనగపప్పు కుక్కర్లో పప్పులా ఉడికించుకోవాలి. నీరు లేకుండా వడకట్టాలి.అందులో బెల్లం తరిగి కలపాలి. అదే పాన్‌లో కొద్దిగా నెయ్యి వేసి పై మిశ్రమం వేసి వేయించి ఉడికించాలి. నీరు ఇగిరిన తర్వాత మిశ్రమం ఓ గిన్నెలో వేసి చల్లార్చాలి. ఆ తర్వాత చిన్న చిన్న ఉండలుగా చేసుకోవాలి. ఈ ఉండలను రెడీగా ఉన్న పిండిలో ముంచి కాగిన నూనెలో వేసి దోరగా బంగారు రంగు వచ్చేవరకు వేయించి తీసుకోవాలి.



బొబ్బట్లు



కావలసిన పదార్థాలు : మైదా - అరకిలో, శనగపప్పు - పావుకిలో, బెల్లం - పావు కిలో, యాలకుల పొడి - చిటికెడు, నెయ్యి - సరిపడా.

తయారు చేసే విధానం : మైదాపిండి జల్లించి పెట్టుకోవాలి. ఆ పిండిలో సరిపడా నీరుపోసి ముద్దగా కలిపి పక్కన పెట్టుకోవాలి. ఒక పాత్రలో శనగపప్పును వేసి మెత్తగా ఉడికించుకోవాలి. పప్పు ఉడికిన తర్వాత మిగిలిన నీటిని పూర్తిగా వంపేయాలి. ఈ పప్పులో బెల్లం తురుము, యాలకుల పొడి వేసి బాగా కలపాలి. కలిపిన తర్వాత చిన్నచిన్న ఉండలుగా చేసుకోవాలి. ఇప్పుడు మైదా పిండిని చిన్నచిన్న ఉండలుగా తీసుకోని రెడిచేసి పెట్టుకున్న శనగపప్పు ముద్దని మధ్యలోపెట్టి మళ్లీ ఉండలుగా చేసి కాస్త మందంగా చపాతిలా చేసి, పెనం మీద నెయ్యి వేసి కాల్చాలి.



పండుగ శోభ

పండుగంటేనే పచ్చని తోరణాలు, రంగురంగుల పూలతో అలంకరించిన గుమ్మాలు.. రంగవల్లికలతో తీర్చిదిద్దిన ముంగిళ్లు.. ఇలా ప్రతి ఇల్లూ ఓ సరికొత్త కళను సంతరించుకుంటుంది. అలాంటిది కొత్త సంవత్సరాది ఉగాది అంటే ఇంటి అలంకరణలో మరింత శ్రద్ధ వహిస్తుంటాం. అప్పుడే పండగ శోభ రెట్టింపవుతుంది. ఈ సంతోషం ఏడాదంతా మనతోనే ఉంటుంది. మరి ఈ ఉగాదికి ఇంటిని ఎలా ముస్తాబు చేసుకోవాలా అని ఆలోచిస్తున్నారా..?

➤ పండగైనా, శుభకార్యమైనా.. ఉదయాన్నే ఇంటి ముంగిట్లో ముచ్చటైన ముగ్గుల్ని తీర్చిదిద్దుకుంటాం. అలాగే ఉగాది రోజునా ఇంటి ముంగిట్లో రంగులు, పూలతో ముగ్గులు తీర్చిదిద్దితే ఇంటికి సగం పండగ కళ వచ్చేసినట్లే..! ఇక ముగ్గు త్వరగా వేయడానికి వీలుగా ప్రస్తుతం వివిధ డిజైన్లలో రూపొందించిన రంగోలీ స్టెన్సిల్స్ మార్కెట్లో దొరుకుతున్నాయి. వాటిని ఉపయోగించండి.

➤ ఇక పండగ రోజున ఉదయాన్నే లేచి, తలస్నానం చేసి, కొత్త బట్టలు ధరించి.. ఇంటి గుమ్మాలకు పచ్చటి మామిడాకు తోరణాలు కట్టాలి. అలాగే గుమ్మం వద్ద అరటి చెట్టు కాండాలను కూడా నిలబెట్టచ్చు. తద్వారా ఈ పచ్చటి ఆకుల్లాగే మన జీవితం ఎప్పుడూ పచ్చగా, సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, ధనధాన్యాలతో తులతూగుతుందని చాలామంది నమ్మకం. ఇక మామిడాకులతో పాటు పూల దండల్ని కూడా గుమ్మాలకు వేలాడదీయచ్చు. ఇక రాత్రి పూట పండగ శోభ ఉట్టిపడేలా ఫ్లోరసెంట్ లైట్లతో ఇంటి ముంగిలిని అలంకరించచ్చు.

➤ అలంకరణతో పాటు ఆహ్లాదం కోసం ఇప్పుడు చాలామంది ఇండోర్ ప్లాంట్స్‌ని పెంచుకోవడం సాధారణమయింది. అలాగే కొంతమంది బయట దొరికే ఫ్లవర్‌వాజుల్నీ ఇంట్లో అలంకరించుకుంటారు. అయితే ఈ పండగ సందర్భంగా వీటిలో ఉండే ప్లాస్టిక్ పూలను తొలగించి.. చామంతి, బంతి.. వంటి నిజమైన పూలను అమర్చుకోవచ్చు. అంతేకాదు.. బయట దొరికే బ్లష్ ఫ్లవర్స్‌నీ మధ్యమధ్యలో చేర్చుకుంటే మరింత ఆకర్షణీయంగా ఉంటుంది. ఇక ఇంటి ముంగిట ఏర్పాటు చేసే పాత్రలోనూ నీళ్లు మార్చి రంగురంగుల పూలతో అలంకరిస్తే ఇంటికొచ్చే అతిథులకు స్వాగతం పలికినట్లుగా ఉంటుంది.





వుయ్ వాంట్ జేపీసీ..

న్యూఢిల్లీ : అదానీ వ్యవహారంపై దర్యాప్తు చేసేందుకు తమకు జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) వేయాల్సిందేనని ప్రతిపక్షాలు నినదించాయి. మంగళవారం పార్లమెంట్‌లో మొదటి అంతస్తులో ఉన్న ఎస్బీఐ బ్రాంచ్ కార్యాలయం ఎదుట ప్రతిపక్ష ఎంపీలు ఆందోళన చేపట్టారు. "వుయ్ వాంట్ జేపీసీ" అని ప్లకార్డులు చేబూని నినాదాల హోరెత్తించారు. అదానీ-హిండెన్‌బర్గ్ వ్యవహారాన్ని జేపీసీ చేత దర్యాప్తు చేయించాలని డిమాండ్ చేశారు. అదానీ గ్రూప్ స్టాక్ మ్యానిపులేషన్, ఆర్థిక మోసాలు వంటి అక్రమాలకు పాల్పడినట్టు వచ్చిన ఆరోపణలపై దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేశారు. అదానీ గ్రూప్‌పై హిండెన్‌బర్గ్ నివేదిక తరువాత ఎస్బీఐ తీవ్రంగా దెబ్బతిన్నదని అన్నారు. ప్రధాని చర్చ నుంచి ఎందుకు పారిపోతున్నారని ప్రతిపక్షనేత మల్లికార్జున ఖర్గే ప్రశ్నించారు. "ప్రభుత్వం పార్లమెంటులో చర్చలను ఎందుకు నిలిపివేస్తోంది? సభను నిర్వహించడం, దేశ ప్రయోజనాలకు సంబంధించిన అంశాలను పరిష్కరించడం ప్రభుత్వ బాధ్యత కాదా?" అని ప్రశ్నించారు.

కొనసాగిన ప్రతిష్టంభన

అదానీ వివాదంపై జేపీసీ దర్యాప్తు జరిపించాలని ప్రతిపక్షాలు, లండన్‌లో రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై క్షమాపణలు చెప్పాలని అధికార బీజేపీ సభ్యులు ఆందోళనతో పార్లమెంట్ సమావేశాలు తుడిచిపెట్టుకుపోతున్నాయి. పార్లమెంట్ ఉభయ సభల్లో ప్రతిష్టంభన మంగళవారం కూడా కొనసాగింది. లోక్‌సభ ప్రారంభం కాగానే అధికార, ప్రతిపక్ష సభ్యుల ఆందోళనతో మధ్యాహ్నం రెండు గంటల వరకు సభ వాయిదా పడింది. తిరిగి ప్రారంభమైన సభలో ఆందోళన మధ్యే కేంద్ర పాలిత ప్రాంతం జమ్మూ, కాశ్మీర్ కోసం 2023-24 ఆర్థిక సంవత్సరానికి రూ. 1.118 లక్షల కోట్ల బడ్జెట్‌కు సంబంధించిన బిల్లును ఆమోదం పొందింది. జమ్మూ కాశ్మీర్ బడ్జెట్‌ను నినాదాల మధ్య ఒక్క నిమిషంలోనే మూజువాణి ఓటుతో ఆమోదించారు. వెంటనే సభ గురువారానికి వాయిదా పడింది. రాజ్యసభలో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. అదానీ-హిండెన్‌బర్గ్ సమస్యపై చర్చను రాజ్యసభ చైర్మెన్ జగదీప్ ధన్కర్ తిరస్కరించారు. దీంతో సభలో గందరగోళం ఏర్పడింది. ఫలితంగా మధ్యాహ్నం రెండు గంటల వరకు రాజ్యసభ వాయిదా పడింది. తిరిగి ప్రారంభమైన సభలో అదే పరిస్థితి కొనసాగడంతో సభ గురువారానికి వాయిదా పడింది.

రాజ్యసభ చైర్మెన్ సమావేశానికి ప్రతిపక్షాలు దూరం

రాజ్యసభ చైర్మెన్ మంగళవారం ఉదయం 11:30 గంటలకు అన్ని పార్టీలను సమావేశానికి పిలిచారు. అయితే ఈ సమావేశానికి బీజేపీ, వైసీపీ, టీడీపీ ఎంపీలు మాత్రమే హాజరయ్యారు. ఇతర పార్టీల ఫ్లోర్ లీడర్లు హాజరు కాలేదు. కాంగ్రెస్, టీఎంసీ, డీఎంకే, ఆప్, బీజేడీ, ఆర్జేడీ, సీపీఐ(ఎం), సీపీఐ, జేడీయూ, అన్నాడీఎంకే, ఎన్సీపీ, ఎస్పీ, శివసేన (ఠాక్రే), బీఆర్ఎస్, ఏజీపీ పార్టీల నాయకులు గైర్హాజరయ్యారు.

కేంద్ర మంత్రులతో మోడీ భేటీ

ప్రధాని మోడీ మంగళవారం ముఖ్యమైన కేంద్ర మంత్రులతో సమావేశమయ్యారు. పార్లమెంటు బడ్జెట్ సమావేశాల రెండో దశలో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. ఉభయ సభల సమావేశాలు ప్రారంభమవడానికి ముందు ఈ భేటీ జరిగింది.

కనీస మద్దతు ధర లేకపోతే దేశ ఆహార భద్రతకు ముప్పు



న్యూఢిల్లీ : కేంద్ర ప్రభుత్వం రైతులకు కనీస మద్దతు ధర ప్రకటించకుంటే దేశ ఆహార భద్రత నాశనమవుతుందని ప్రముఖ ఆర్థికవేత్త ప్రభాత్ పట్నాయక్ హెచ్చరించారు. కనీస మద్దతు ధరకు చట్టపరమైన రక్షణ కల్పించడం రైతులకే కాకుండా దేశానికి కూడా మేలు చేస్తుందన్నారు. ఏప్రిల్ 5న ఢిల్లీలో జరిగిన ఉమ్మడి కార్మిక రైతుల కవాతు (మజ్దూర్ కిసాన్ సంఘర్ష్ ర్యాలీ) సందర్భంగా మంగళవారం నాడిక్కడ ప్రెస్ క్లబ్ ఆఫ్ ఇండియా (పీసీఐ)లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆహ్వాన సంఘ చైర్మెన్ ప్రొఫెసర్ ప్రభాత్ పట్నాయక్ మాట్లాడారు. కనీస మద్దతు ధర ఇవ్వకుంటే రైతులు అన్నదాత సాగు నుంచి తప్పుకుంటారు. ఇది భారతదేశంతో పాటు కొన్ని ఆఫ్రికన్ దేశాల ఆహార భద్రతలను గణనీయంగా ప్రభావితం చేస్తోందన్నారు. లేబర్ కోడ్‌లు, వ్యవసాయ చట్టాలతో నయా ఉదారవాద విధానాలను క్రూరంగా అమలు చేసేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని విమర్శించారు. దశాబ్దాలుగా పోరాడి సాధించుకున్న హక్కులను కాలరాస్తూ కార్మికులను బానిసలుగా మార్చే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. ఉపాధి హామీకి నిధులు ఇవ్వకుండా నిర్వీర్యం చేస్తున్నారని దుయ్యబట్టారు. ప్రభుత్వం విధానాలకు కార్మిక, రైతు, వ్యవసాయ కార్మికులు బాధితులయ్యారని పేర్కొన్నారు. ఆధునిక భారతదేశ నిర్మాణంలో ఈ వర్గాలే కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. దేశ లౌకికవాదాన్ని, రాజ్యాంగాన్ని పరిరక్షించడంలో కార్మిక, రైతు ఉమ్మడి పోరాటం ప్రధాన పాత్ర పోషిస్తోందని ఆయన పేర్కొన్నారు.

ఏఐకేఎస్ ఉపాధ్యక్షుడు హన్నన్ మొల్లామాట్లాడుతూ.. ఉత్పత్తి వర్గాలైన కార్మిక, రైతు, వ్యవసాయ కార్మికులు దోపిడీకి గురవుతున్నారని అన్నారు. దేశంలో నాలుగు లక్షల మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని, ఎంఎస్పీ కోసం రైతులు చాలా కాలం నుంచి డిమాండ్ చేస్తున్నారని పేర్కొన్నారు. సీఐటీయూ, ఏఐకేఎస్, ఏఐఏడబ్ల్యూయూ సంఘాల ఆధ్వర్యంలో ఐదు లక్షల మంది ఢిల్లీకి చేరుకుంటారని తెలిపారు. దీనికి ముందు కోటి మందికి చేరువయ్యేలా ప్రచార కార్యక్రమాలు పూర్తి చేస్తున్నామన్నారు. నాలుగు వందల జిల్లాల్లో ఉమ్మడిగా సభలు పూర్తి చేశామన్నారు.

సీఐటీయూ ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్ మాట్లాడుతూ దేశంలో 93 శాతం కార్మికులు అసంఘటిత రంగంలో ఉన్నారని, వారి భద్రత ప్రశ్నార్థకంగా ఉన్నదని అన్నారు. కనీస మద్దతు ధరకు చట్టపరమైన రక్షణ కల్పించాలని, లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, విద్యుత్ బిల్లును ఉపసంహరించుకోవాలని, ప్రభుత్వ రంగ ప్రయివేటీకరణకు స్వస్తి పలకాలనీ, సంపన్నులపై అదనపు పన్నులు విధించాలని కోరుతూ ఈ ఆందోళన జరుగుతోందన్నారు. గత ఐదు నెలలుగా దేశవ్యాప్తంగా మోడీ సర్కార్ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రచారం చేస్తున్నామని, క్షేత్రస్థాయిలో ప్రజల వద్దకు ఈ ర్యాలీ సందేశం వెళ్తుందని తెలిపారు. ఏఐఏడబ్ల్యూయూ ప్రధాన కార్యదర్శి బి వెంకట్ మాట్లాడుతూ దేశంలో 25 కోట్ల మంది దళితులు ఉన్నారని, వారిపై దాడులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ప్రభుత్వ మద్దతుతో దాడులు జరుగుతున్నాయని అన్నారు. ఏడు శాతం మంది గిరిజనులు ఉన్నారనీ, వారికి సంబంధించిన అటవీ హక్కుల చట్టాన్ని బీజేపీ నిర్వీర్యం చేస్తుందని విమర్శించారు. ఉపాధి హామీకి గతంలో 4 శాతం నిధులు కేటాయిస్తే, ఇప్పుడు 1.3 శాతానికి తగ్గించారని తెలిపారు. పార్లమెంట్‌లో ఎలాంటి చర్చ లేకుండా కేంద్ర ప్రభుత్వం ఆదేశాలిస్తుందని దుయ్యబట్టారు. ప్రజా పంపిణీ వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు వన్ నేషన్, వన్ రేషన్ కార్డు తీసుకొచ్చారని విమర్శించారు.

దళితులపై దాడులు, నేరాలు..

న్యూఢిల్లీ : 2018-2021 మధ్యకాలంలో దళితులపై జరిగిన దాడులు, నేరాలకు సంబంధించి 1,89,945 కేసులు నమోదయ్యాయని మంగళవారం పార్లమెంట్‌లో కేంద్రం వెల్లడించింది. పోలీసు, శాంతిభద్రతలు పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలోని అంశమని, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని సమర్థవంతంగా అమలుజేయటంపై రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు కేంద్రం తరుచూ మార్గదర్శకాలు, సూచనలు జారీచేస్తోందని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి అజయ్ కుమార్ మిశ్రా చెప్పారు.

2018 నుంచి ఇప్పటివరకూ దళితులపై జరిగిన దాడులు, నేరాల గణాంకాల్ని తెలపాలని, దాడి ఘటనలు, కేసులను పర్యవేక్షించే యంత్రాంగమేదైనా ఉందా? అని బీఎస్పీ ఎంపీ గిరీష్ చంద్ర ప్రశ్నించారు. ఈ ప్రశ్నకు సమాధానంగా అజయ్‌కుమార్ మిశ్రా పై సమాచారాన్ని విడుదల చేశారు.

దళితులపై జరుగుతున్న నేరాలు, ఘోరాల సమాచారాన్ని ఎన్సీఆర్‌బీ విడుదల చేస్తోందన్నారు. ఇందులో పొందుపర్చిన సమాచారాన్నే ఆయన తన సమాధానంలో ప్రస్తావించారు. గత రెండేండ్లలో న్యూఢిల్లీలో ప్రజాప్రతినిధులపై జరిగిన దాడుల అంశాన్ని ఏఐఎంఐఎం చీఫ్ అసదుద్దీన్ ఓవైసీ లేవనెత్తారు. కేంద్ర సహాయమంత్రి నిత్యానందరాయ్ స్పందిస్తూ.."ప్రజాప్రతినిధులపై దాడులకు సంబంధించి ఢిల్లీ పోలీసులు నాలుగు కేసులు నమోదుచేశారు. 16మందిని అరెస్టు చేశారు. రెండు కేసుల్లో ఛార్జ్‌షీట్ దాఖలు అయ్యింది. ఇలాంటి దాడులు జరగకుండా పోలీసు అధికారులు తమ తమ ప్రాంతంలో నిఘా ఉంచాలని ఆదేశించా"మని చెప్పారు.

రైతుల పట్ల బ్యాంకులు ఉదారంగా వ్యవహరించాలి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రుణ చెల్లింపుల విషయంలో బ్యాంకులు రైతుల పట్ల ఉదారంగా వ్యవహరించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి సూచించారు. బీఆర్ఎస్ తొమ్మిదేండ్ల పాలనలో రాష్ట్రంలో వ్యవసాయరంగం బలోపేతమైందన్నారు. దేశంలో వ్యవసాయ ఉత్పత్తుల సగటులో రాష్ట్రం మొదటి స్థానాన్ని ఆక్రమించిందని తెలిపారు. అదే సమయంలో రాష్ట్రంలో పంటల వైవిధ్యీకరణకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నదని వివరించారు. అందులో భాగంగా పామాయిల్ సాగును ప్రోత్సహిస్తున్నట్టు తెలిపారు. ఆ రైతులకు బ్యాంకులు రుణాలు అందించాలని కోరారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల (ఎస్ఎల్‌బీసీ) సమావేశంలో మంత్రి మాట్లాడారు. బ్యాంకులు వ్యవసాయ ఆధారిత పరిశ్రమలను ప్రోత్సహించి, వాటిని స్థాపించడంపై దృష్టి సారించాలని ఆదేశించారు. వాటి నుంచి ప్రజలకు ఉపాధి కలిగే అవకాశాలపై బ్యాంకులు అధ్యయనం చేయాలన్నారు. ప్రతి జిల్లాలో వ్యవసాయ ఆధారిత పరిశ్రమల ఏర్పాటుపై ప్రభుత్వం ఇది వరకే దృష్టి పెట్టిందని చెప్పారు.డెయిరీ రంగాన్ని లాభసాటి వ్యాపారంగా మార్చేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందని వివరించారు. అందుకుగానూ బ్యాంకులు డైరీ రంగంపై అధ్యయనం చేసి ప్రణాళికాబద్ధంగా సహకరించాలని తెలిపారు. రుణాలకు సంబంధించి బ్యాంకులు కేవలం పట్టణాల్లోని ఆస్తులు, భూములనే ప్రామాణికంగా తీసుకుంటున్నాయని చెప్పారు. విదేశీ విద్యకు ఉన్న రుణ గరిష్ట పరిమితి రూ.7.5 లక్షలు ఇస్తున్నారనీ, దాన్ని పెంచాలని సూచించారు. నాణ్యమైన వేరుశనగ ఉత్పత్తులకు తెలంగాణ అనువైన ప్రాంతమని, అందులో దక్షిణ తెలంగాణ మరింత అనుకూలమని చెప్పారు. అలాంటి పరిశ్రమల ఏర్పాటుకు బ్యాంకులు ప్రోత్సాహాన్ని అందించాలన్నారు. 2022 - 23 సంవత్సరానికి గాను వ్యవసాయ రంగానికి రుణ లక్ష్యంలో బ్యాంకులు చేరుకున్నాయనీ, ఈ రుణాల విషయంలో మరింత ఉదారంగా వ్యవహరించాలని సూచించారు. ఈ సమావేశంలో ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావు, ఆర్థిక శాఖ కార్యదర్శి రొనాల్డ్‌రాస్, ఎస్ఎల్‌బీసీ అధ్యక్షులు అమిత్ జింగ్రాన్, జీఎం నాబార్డ్ డాక్టర్ వై.హరగోపాల్, ఆర్‌బీఐ డీజీఎం కేఎస్ చక్రవర్తి పాల్గొన్నారు.

పేపర్ లీకేజీ కేసులో సిట్ దూకుడు

(మొదటిపేజీ తరువాయి)

అధికారులు మరోసారి తనిఖీలు చేశారు. హైదరాబాద్, మహబూబ్‌నగర్, జగిత్యాలలో మూడు చోట్ల ఏకకాలంలో సోదాలు చేశారు. మంగళవారం ఉదయం హిమాయత్‌నగర్‌లోని సిట్ కార్యాలయానికి నిందితులను తీసుకొచ్చిన అధికారులు కొద్దిసేపటికే రేణుకతోపాటు ఆమె భర్త ఢాక్యానాయక్‌ను బయటకు తీసుకెళ్లారు. అక్కడి నుంచి లంగర్‌హౌస్‌కు వెళ్లారు. ఆ తర్వాత సన్ సిటీలోని కాళీ మందిర్ సమీపంలో ఉన్న వారి స్నేహితులు, బంధువులను ప్రశ్నించారు. అంతేకాకుండా రేణుక సొంతూరు మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్‌కు సిట్ బృందం వెళ్లింది. అక్కడ వారి బంధువులను, స్నేహితులను ప్రశ్నించినట్టు తెలిసింది. రాజశేఖర్ సొంతూరు జగిత్యాల జిల్లా తాటిపల్లికి వెళ్లిన మరో బృందం అనుమానితులను విచారించినట్టు తెలిసింది. ముఖ్యంగా ఆర్థిక లావాదేవీలు, మనీ ట్రాన్సాక్షన్స్‌తోపాటు సన్నిహితులు, వారి బంధువులు ఎవరైనా పరీక్షలు రాశారా అనే కోణంలో ఆరా తీసినట్టు తెలిసింది. పరీక్ష రాసిన గోపాల్, నీలేష్‌కు నీలేష్ సోదరుడు రాజేంద్రనాయక్ డబ్బులు సమకూర్చిన విషయంపై ఆరా తీశారు. మేడ్చల్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న కేతావత్ శ్రీనివాస్‌కు గోపాల్, నీలేష్‌కు ఎప్పటి నుంచి పరిచయం ఉందన్న కోణంలో విచారించారు. ఈ క్రమంలో పలు కీలక ఆధారాలతోపాటు మరికొన్ని ప్రశ్నాపత్రాలను సేకరించినట్టు సమాచారం. ఇదిలా ఉండగా లీకేజీ కేసులో కీలక అంశాలు బయటకు రావడంతో ఇంటెలిజెన్స్ పోలీసులు సైతం ప్రత్యేక దృష్టి సారించినట్టు తెలిసింది.

లక్ష్మణరేఖ దాటుతున్నదెవరు?

(మొదటిపేజీ తరువాయి)

సర్కార్‌కు అనుకూలంగా వ్యవహరిస్తోందని ఆరోపణలు ఉన్నాయి. ఒక రాష్ట్రంలో ప్రధాని మోడీ, బీజేపీ ముఖ్య నాయకుల సభలు, ప్రచారాలు, ప్రకటనలు ముగిసాక అక్కడ అసెంబ్లీ ఎన్నికలకు షెడ్యూల్ విడుదల కావటం ఆనవాయితీగా మారింది. సీఈసీ పనితీరుపై ప్రతిపక్షాలు అనేక అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు మార్చి 2 నాటి తీర్పు వెలువరించింది. ఇది మోడీ సర్కార్‌కు రుచించలేదు. ప్రధాని, లోక్‌సభ ప్రతిపక్ష నేత, భారత ప్రధాన న్యాయమూర్తిలతో కూడిన ఒక అత్యున్నత స్థాయి కమిటీ సిఫారసుల మేరకు కేంద్ర ఎన్నికల సంఘం సభ్యుల నియామకం జరపాలని తన తీర్పులో సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఇలా చేయటం ఎన్నికల కమిషన్ విశ్వసనీయతను పెంచుతుందని తీర్పులో పేర్కొంది.

అత్యున్నత స్థాయి కమిటీలో భారత ప్రధాన న్యాయమూర్తి ఒక సభ్యుడు మాత్రమే. ఈసీ సభ్యుల ఎంపికలో ఆయన నేరుగా పాల్గొనరు. ఎలాంటి వీటో అధికారమూ ఆయనకు లేదు. ప్రభుత్వ పాలన (కార్యనిర్వాహకం)లో జోక్యం చేసుకోవటమన్న ప్రశ్నే ఇక్కడ లేదు. ఈ తీర్పును కేంద్రం జీర్ణించుకోలేక పోతోంది. ఈ నేపథ్యంలోనే కిరణ్ రిజిజు వ్యాఖ్యలున్నాయని తెలుస్తోంది. పార్లమెంట్ వేదికగా న్యాయవ్యవస్థ పనితీరును కేంద్రం తరుచూ తప్పుబడుతోంది. కొలీజయం అమల్లో లేకుండా చేయాలని రకరకాల నివేదికలు విడుదల చేస్తోంది. న్యాయ నియామకాల సిఫారసును కొలీజియం పునరుద్ఘాటించిన తర్వాత కూడా కేంద్రం న్యాయ నియామకాలను పెండింగ్‌లో ఉంచుతోంది. తాజాగా సీఈసీ, ఇతర సభ్యుల నియామకంపైనా సుప్రీం కీలక వ్యాఖ్యలు చేసింది. అత్యంత బలమైన రాజకీయ నాయకుడి ముందు బానిసలా నిలబడే వ్యక్తి ఆ స్థానంలో (సీఈసీ) ఉండరాదని సంచలన తీర్పు వెలువరించింది.

జీహెచ్ఎంసీ పరిధిలో 1,540 ఆశా వర్కర్ల పోస్టుల భర్తీకి అనుమతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

జీహెచ్ఎంసీ పరిధిలో 1,540 ఆశా వర్కర్ల పోస్టుల భర్తీకి ప్రభుత్వం అనుమతించింది. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర వైద్యారోగ్యశాఖ కార్యదర్శి రిజ్వీ ఉత్తర్వులు జారీ చేశారు. హైదరాబాద్ జిల్లాలో 323, మేడ్చల్ జిల్లాలో 974, రంగారెడ్డి జిల్లా పరిధిలో 243 పోస్టుల భర్తీ చేయనున్నారు. ఈ ఆశా వర్కర్లను జిల్లా సెలక్షన్ కమిటీ ద్వారా ఎంపిక చేయనున్నారు.

ఆటపాటతో చైతన్యం

- జన చైతన్య యాత్ర విజయవంతం కోసం..
- ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో శిక్షణ



నవతెలంగాణ-కంఠేశ్వర్

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను ఆటపాటలతో ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్యం కల్పించేందుకు ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో కృషి చేస్తున్నట్టు పీఎన్ఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కట్ట నర్సింహులు తెలిపారు. మూడు రోజుల పాటు కొనసాగనున్న రాష్ట్ర స్థాయి శిక్షణా శిబిరాన్ని మంగళవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని మల్లు స్వరాజ్యం ట్రస్ట్ భవనంలో ప్రారంభించారు. జెండాను పీఎన్ఎం జిల్లా కార్యదర్శి సిర్పలింగం ఆవిష్కరించారు. ఈసందర్భంగా కట్టా నరసింహులు మాట్లాడుతూ.. సీపీఐ(ఎం) జనచైతన్య యాత్రను విజయవంతం చేసేందుకు రాష్ట్ర శిక్షణా శిబిరానికి ప్రత్యేక ప్రాధాన్యత సంతరించుకున్నదని అన్నారు. శిక్షణా శిబిరం ముఖ్య ఉద్దేశం మోడీ ప్రభుత్వం విధి విధానాలకు వ్యతిరేకంగా సీపీఐ(ఎం) చేపడుతున్న జన చైతన్య యాత్రను విజయవంతం చేయడం కోసం ఆటమాట పాటతో ప్రజలను చైతన్యం చేస్తున్నట్టు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పెట్రోల్, డీజిల్, ధరలు మిన్నంటాయని, పాటలు పాడుతూ ప్రజల్లోకి తీసుకెళ్లడమే తమ ధ్యేయం అని అన్నారు. ఈ జన చైతన్య యాత్ర ఈనెల 24 నుంచి నిజామాబాద్ జిల్లాలో ప్రారంభం కానుందని, ప్రజలంతా ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పీఎన్ఎం రాష్ట్ర అధ్యక్షులు వేముల ఆనంద్, ఉపాధ్యక్షులు వినోద్, ప్రభాకర్, నాయకులు లావణ్య, శ్రావణి, అనిల్ తదితర కళా బృందం పాల్గొన్నారు.

'ధరల కారం'తో షడ్రుచుల పండుగ

• సవాలక్ష సమస్యల మధ్య ఉగాదికి ఆహ్వానం • పచ్చడిలో చేదు, వగరు లోటు



నవతెలంగాణ - కరీంనగర్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ ప్రాంతీయ ప్రతినిధులు

జీవితమంటేనే కష్ట సుఖాల సమ్మేళనం. తీపి, చేదు, వగరు, పులుపు.. ఇలా జీవితంలో ఎదురయ్యే వివిధ అనుభవాలకు ప్రతీకగా నిలిచే ఉగాది పచ్చడితో నూతన తెలుగు సంవత్సరాన్ని సరికొత్తగా ప్రారంభించడం అలవాటు. సరికొత్త ఆలోచనలకు శ్రీకారం చుట్టే పర్వదినంగా భావించే ఈ పండుగ వేళ కొత్త ఆశలు.. కొంగొత్త ఆశయాలకు అడుగులు వేయాలనుకుంటారు. పెరుగుతున్న నిత్యావసరాల ధరల మోతతో రాబడి లేక.. ఖర్చేమో భారమై సవాలక్ష సమస్యల మధ్య ఉగాది ఉషస్సు ఏమోగానీ.. బతుకుజీవుడా! అన్నట్టుగా మారింది. షడ్రుచుల పచ్చడిలో ధరల కారమే పండుగ సంబురాన్ని దూరం చేస్తోంది. ఇంధన ధరలు మొదలుకుని బియ్యం, ఉప్పుపప్పులు, కూర గాయలు ఇలా ఏవి చూసినా కొనాలంటేనే భయపడే రోజులు వచ్చాయి. వచ్చే కాస్తోకూస్తో రాబడితో ఉగాది పండుగ భోజనమూ కడుపునిండా చేయని పరిస్థితులు నెలకొన్నాయి. ఒకప్పుడు వ్యవసాయం మీద ఆధారపడుతూ, ప్రకృతిని గమనించుకుంటూ సాగిన కాలంలో ఉగాది పెద్ద పండుగే. ఆకురాలు కాలం ముగిసి వసంత రుతువు మొదలయ్యే సమయం ఇది. వ్యవసాయపరంగా పొలం పనులను ఆరంభించే సమయం ఇది. ఎండిన పొలాన్ని తిరిగి తొలకరికి అనువుగా సిద్ధం చేసుకునేవాళ్లు. ఉగాది పచ్చడిలో కనిపించే షడ్రుచులూ జీవితంలో కష్టసుఖాలను సమానంగా తీసుకోవాలి అనే సూచనతోపాటుగా ప్రకృతి పరంగా ఆ కాలంలో వేప చిగుళ్లు, మామిడి ముక్కలను ప్రసాదంగా మార్చడం కనిపిస్తోంది. కానీ ఇప్పుడు అందుకు భిన్నంగా ఉంది. ఉగాది పచ్చడిలో వేప పువ్వు చాలా కీలకం. ఆరు రకాల్లో వేప పువ్వు ఒక్కటి. చేదు గుణం కల్గిన వేపపువ్వు పచ్చడికి కమ్మదానాన్ని తీసుకొస్తుంది. ప్రస్తుతం వేప పువ్వు కానరావడం లేదు. కొద్దికాలంగా వేప చెట్లకు వైరస్ సోకి ఎండిపోతున్నాయి. వేప చెట్ల ఉనికే ప్రశ్నార్థకంగా మారింది. దాంతో ఉగాది పచ్చడిలో వేపపువ్వు వెలితి కనిపిస్తోంది. దీనిని కూడా కొనుక్కోవాల్సి వస్తోంది. పచ్చడిలో మరో కీలకమైన పదార్థం మామిడి. వగరు రుచిగా మామిడి కాయలు పచ్చడిలో వాడుతారు. అయితే ఇటీవల కురిసిన వడగండ్ల వర్షంతో పెద్ద మొత్తంలో మామిడి తోటలు దెబ్బతిన్నాయి. ఎలా ఉన్నా ఉన్నదాంట్లో ఉగాది వేడుకలు నిర్వహించేందుకు ప్రజలు సిద్ధం అయ్యారు.

ధరలు ఇలా..

మార్కెట్‌లో మినపప్పు కిలో రూ. 170, గోధుమ పిండి కిలో రూ. 60కి చేరుకుంది. చింతపండు సాధారణ రకం రూ.100 నుంచి రూ.120, నెంబర్‌వన్ రకం రూ.200లకు చేరింది. మంచి నూనె ధర వింటే సామాన్యులకు కండ్లు బైర్లు కమ్ముతున్నాయి. రిఫైన్డ్ ఆయిల్ కిలో రూ.180, మంచి నూనె కిలో రూ.170 నుంచి రూ.190 ధర పలుకుతోంది. పంచదార కిలో రూ.50కి పెరిగింది. ఆరేండ్లలో ఇంత అధికంగా ధరలు పెరిగిన పరిస్థితి చూడలేదని ప్రజలు చెబుతున్నారు. రూ. 100 పట్టుకుని మార్కెట్‌కు వెళ్తే మూడు రకాల కూరగాయలూ రాని పరిస్థితి నెలకొంది.

ఎరువు కావాలంటే 'కులం' చెప్పాలి

- కేంద్ర మంత్రి భగవంత్ కుబ

న్యూఢిల్లీ : ఎరువుల కొనుగోలు సమయంలో ఎరువుల విక్రయ కేంద్రాల (పీఓఎస్) వద్ద రైతులు 'కులం' పేరు నమోదు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిబంధన పెట్టింది. సమాచార సేకరణకే ఈ నిబంధన పెట్టినట్టు కేంద్ర ఎరువులు, రసాయనాల శాఖ మంత్రి భగవంత్ కుబ తెలిపారు. ఎరువుల కొనుగోలు సమయంలో రైతుల కులం వివరాలు కోరుతున్నారా? అంటూ తమిళనాడుకు చెందిన పీఎంకె రాజ్యసభ సభ్యుడు అన్బుమణి రాందాస్ అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి మంగళవారం లిఖితపూర్వకంగా సమాధానమిచ్చారు. భవిష్యత్తులో కులాల ఆధారంగా రైతులకు ఎరువులపై రాయితీ వర్తింపజేసే ఆలోచన ఏమైనా ఉందా? అని ఎంపీ ప్రశ్నించగా అటువంటి యోచన పరిగణనలో లేదని కేంద్ర మంత్రి వెల్లడించారు.

10,302 ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులు ఖాళీ

ప్రభుత్వ రంగ సంస్థల్లో 10,302 ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని కేంద్ర ఆర్థిక సహాయ మంత్రి పంకజ్ చౌదరి తెలిపారు. రాజ్యసభలో ఒక ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానమిచ్చారు. 2023 జనవరి 1 నాటికి ప్రభుత్వ రంగ సంస్థల్లో 5,768 ఎస్సీ బ్యాక్‌లాగ్ పోస్టులు, 4,534 ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు.

రైతులకు ఏపిలోనే అత్యధిక రుణభారం

దేశంలో రైతులపై అత్యధిక రుణభారం ఉన్న రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో నిలిచింది. ప్రతి రైతుపై సగటున రూ.2,45,554.00 అప్పు ఉన్నట్లు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి భగవత్ ఖరాడ్ వెల్లడించారు. రాజ్యసభలో ఒక ప్రశ్నకు ఆయన లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. ప్రతి రైతుపై అప్పు విషయంలో దేశంలో ఐదో స్థానంలో తెలంగాణ నిలిచింది. తెలంగాణలో ప్రతి రైతుపై రూ.1,52,113 అప్పున్నట్టు మంత్రి తెలిపారు.

రూ.6,627.86 విద్యుత్ బకాయిలు ఏపీకి తెలంగాణ చెల్లించాలి

తెలంగాణకు 2014 జూన్ 2 నుంచి 2017 జూన్ 10 వరకు విద్యుత్ సరఫరా చేసినందుకు ఆ రాష్ట్రం తమకు రూ.6,627.86 కోట్లు (2021 ఏప్రిల్ 30 నాటికి) చెల్లించాల్సి ఉందని ఆంధ్రప్రదేశ్ తెలిపిందని కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి తెలిపారు. టీడీపీ ఎంపీ కనకమేడల రవీంద్రకుమార్ అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానమిచ్చారు. విద్యుత్ సరఫరా చేసినందుకు గానూ తెలంగాణ ఆంధ్రప్రదేశ్‌కు (2022 జులై 31 నాటికి) అసలు రూ.3,441,78 కోట్లు, ఆలస్యం చేసినందుకు సర్‌చార్జి కింద రూ.3,315.14 కోట్లు (మొత్తంగా రూ.6,756.92 కోట్లు) చెల్లించాల్సి ఉందని కేంద్ర విద్యుత్ శాఖ ఉత్తర్వులు ఇచ్చిందని ఆయన పేర్కొన్నారు.

టీఎస్‌పీఎస్సీ ప్రశ్నాపత్రం లీకేజీపై సమగ్ర విచారణ జరపాలి

ఇష్టాగోష్టిలో టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

టీఎస్‌పీఎస్సీ ప్రశ్నాపత్రం లీకేజీపై సమగ్ర విచారణ జరిపించాలని టీపీసీసీ అధ్యక్షులు, ఎంపీ ఎనుముల రేవంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. సిట్ ద్వారా ఈ వ్యవహారం పూర్తిగా బయటపడబోదంటూ అనుమానం వ్యక్తం చేశారు. సిట్ అంటే సిట్, స్టాండ్ మాత్రమేనని ఎద్దేవా చేశారు. గతంలో సిట్ విచారించిన కేసులన్నీ ఎక్కడపోయాయని ప్రశ్నించారు. డ్రగ్స్, నయీమ్ ల్యాండ్, గోల్డ్ స్టోన్ ప్రసాద్, హౌసింగ్ బోర్డు, ఎమ్మెల్యే కొనుగోలు అంశంపై ఏం చర్యలు తీసుకున్నారో చెప్పాలని ప్రశ్నించారు. మంగళవారం అసెంబ్లీలోని సీఎల్పీ కార్యాలయంలో ఇష్టాగోష్టిగా విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు భర్తీ చేసిన ఉద్యోగాల వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచాలని కోరారు. ఇదే అంశంపై హైకోర్టులో గంట సేపు వాదనలు జరిగాయని వివరించారు. ఇప్పటి వరకు సిట్ విచారించిన విషయాలు తమకు కూడా తెలపాలని కోరినట్టు వివరించారు. సిట్ రిపోర్ట్‌ను కోర్టుకు అందజేయడంతోపాటు తమకూ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. పేపర్ లీకేజ్ విషయం ప్రవీణ్, రాజశేఖర్‌కే పరిమితం కాలేదన్నారు. చైర్మెన్, సెక్రెటరీలు, శంకర్ లక్ష్మిని బాధ్యులుగా చేర్చాల న్నారు. టీఎస్‌పీఎస్సీలో ఉన్న సిస్టమ్‌కు బాధ్యత ఐటీ శాఖదేనన్నారు. ఈ క్రమంలో పిరియాడికల్ ఆడిట్ చేయాలని సూచించారు. చిరు ఉద్యోగులతో కేసును మూసే కుట్ర జరుగుతున్నదని చెప్పారు. న్నారు. మంత్రి కేటీఆర్ తెలివిగా నా పరిధిలోకి రాదని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. టీఎస్‌పీఎస్సీ తాళాల గుత్తిని ఆంధ్రోడి చేతిలోనే పెట్టారనీ, సిట్ విచారణ అధికారి ఏఆర్ శ్రీనివాస్ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వ్యక్తేననిన్నారు. టీఎస్‌పీఎస్సీ ప్రశ్నాపత్రాల విచారణ సమగ్ర చేయాలంటూ కోరిన కారణంగానే, తనకు నోటీసులిచ్చారని తెలిపారు.

సీఐటీయూలో 2,400 మంది చేరిక..

- పోరాట సంఘంలోకే బీడీ కార్మికులు, టేకేదార్లు
- బీడీ రంగంపై ఆంక్షలు ఎత్తేయాలి
- చట్టబద్ధ సౌకర్యాల కోసం పోరు : ఎస్ రమ



నవతెలంగాణ-నిజామాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

కామారెడ్డి జిల్లా దొమకొండ, బీబీపేట్ మండలాల నుంచి సుమారు 2400 మంది బీడీ కార్మికులు సీఐటీయూలో చేరారు. పోరాట సంఘంలోనే భాగస్వామ్యం అవుతామంటూ వివిధ సంఘాలకు రాజీనామా చేసి సీఐటీయూ జెండా పట్టారు. మంగళవారం కామారెడ్డి జిల్లా దొమకొండలోని పైడిమర్రి ఫంక్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో వివిధ సంఘాల నుంచి కార్మికులు సీఐటీయూలో చేరారు. వారిని బీడీ అండ్ సిగార్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.రమ స్వాగతం పలికారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. కార్మిక హక్కుల పోరాటాలకు సీఐటీయూ కేరాఫ్‌గా నిలిచిందన్నారు. కార్మికుల చట్టబద్ధ సౌకర్యాల సాధనకు కామారెడ్డి జిల్లాలో భవిష్యత్తు ఉద్యమాలు చేపడతామని, జిల్లాను పోరాట కేంద్రంగా మలుస్తామని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీడీ రంగంపై తీవ్రమైన ఆంక్షలు విధిస్తూ మహిళల ఉపాధి దెబ్బతిస్తున్నాయని విమర్శించారు. ప్రత్యామ్నాయ ఉపాధి చూపకుండా ఆంక్షలు విధించడం సరికాదని అన్నారు. కామారెడ్డి జిల్లాలో ఈ రంగంపై లక్షన్నరకు పైగా కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నాయని వివరించారు. కార్మికులకు 24 రోజుల పని దినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే టేకేదార్లు, చాట, ప్యాకర్లు, బీడీ కార్మికుల్లో అర్హులైన అందరికీ జీవనభృతి కల్పించాలని డిమాండ్ చేశారు. డబుల్ బెడ్‌రూం ఇండ్లు ఇవ్వాలని అన్నారు. బీడీ కార్మికుల సంక్షేమ నిధి ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పీఎఫ్‌లో జరుగుతున్న అవకతవకలను సవరించాలన్నారు. కార్మికులకు రావాల్సిన చట్టబద్ధ సౌకర్యాలన్నీ కల్పించాలని, లేకపోతే కామారెడ్డి జిల్లా కేంద్రంగా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీడీ అండ్ సిగార్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు నాగారపు ఎల్లయ్య, బీడీ యూనియన్ జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్‌తో పాటు దశరథం, శంకర్, శ్రీనివాస్, జ్ఞానేశ్వర్, శివాజీ, లక్ష్మీనారాయణ, రవి, నరహరి, చందు, శ్రీనివాస్, నర్సింలు రాజ్యలక్ష్మయ్య, మహాదేవ్ తదితర నాయకులు పాల్గొన్నారు.

నవచిత్రం

చిరంజీవి, మెహర్ రమేష్ కాంబినేషన్‌లో రూపొందుతున్న చిత్రం 'భోళా శంకర్'. ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్‌ను రామబ్రహ్మం సుంకర నిర్మిస్తున్నారు. ఉగాది పండగని పురస్కరించుకుని మేకర్స్ మెగా అభిమానులకు మంచి అప్డేట్ ఇచ్చారు. ఆగస్ట్ 11, 2023న ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా థియేటర్‌లలో గ్రాండ్‌గా విడుదల చేస్తున్నట్లు అనౌన్స్ చేశారు.

ఆగస్ట్ 11న భోళా శంకర్

ఈ సందర్భంగా విడుదల చేసిన అనౌన్స్‌మెంట్ పోస్టర్‌లో చిరంజీవి, కీర్తి సురేష్, తమన్నా ముగ్గురూ పండగ కళ ఉట్టిపడేలా అందంగా ఉండటం విశేషం. ఇప్పటికే విడుదలైన 'భోళా శంకర్' ప్రమోషనల్ కంటెంట్‌కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ఈ చిత్రంలో కీలక పాత్రల్లో ప్రముఖ నటీనటులు నటిస్తున్నారు. తమన్నా కథానాయికగా నటిస్తుండగా, కీర్తి సురేష్ చిరంజీవికి చెల్లెలుగా కనిపించనుంది. సుశాంత్ ప్రత్యేక పాత్రలో కనిపించనున్నారు. క్రియేటివ్ కమర్షియల్స్‌తో కలిసి అనిల్ సుంకర ఎకె ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు.



చిరంజీవి, కీర్తి సురేష్, తమన్నా

బతికే ఉన్నా..



కోటా శ్రీనివాసరావు

సోషల్ మీడియాలో తాను చనిపోయినట్లు వచ్చిన వార్తలను నటుడు కోటా శ్రీనివాసరావు తీవ్రంగా ఖండించారు. ఆరోగ్యంగా ఉన్న తనని చంపెయ్యడం ఘోరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో మీడియాకి విడుదల చేసిన వీడియోలో ఆయన మాట్లాడుతూ, 'ఉగాది పండుగ ఏర్పాట్లు చూసుకుంటున్న నాకు వరుసగా చాలా ఫోన్ కాల్స్ రావడం ఆందోళన కలిగించింది. అదే కొంచెం పెద్ద వాళ్లైతే గుండె ఆగి చనిపోయే వాళ్ళు. ఈ వార్తల వల్ల నా ఇంటి వద్ద భద్రత కోసం ఏకంగా 10 మంది పోలీసులు వచ్చారు. పాపులారిటీ, డబ్బు కావాలంటే వేరే మార్గాల్లో సంపాదించుకోవచ్చు. ఇలా పుకార్లను వ్యాప్తి చేయడం మంచిది కాదు. మనుషుల జీవితాలతో ఆడుకోవడం దారుణమైన విషయం. ఇలాంటి చర్యలను ప్రజలు తీవ్రంగా ఖండించాలి. ఇప్పుడే కాదు.. ఎప్పుడూ ఇలాంటి తప్పుడు వార్తలను నమ్మవద్దని ప్రజలను కోరుతున్నాను' అని ఆవేదన వ్యక్తం చేశారు.

నిర్మాత ప్రమోద్‌కుమార్ కన్నుమూత



ప్రమోద్ కుమార్

నిర్మాత, సీనియర్ పబ్లిసిటీ ఇన్‌ఛార్జ్ ప్రమోద్‌కుమార్ (87) మంగళవారం విజయవాడలో కన్నుమూశారు. 38 సంవత్సరాల సినీ ప్రస్థానంలో ఆయన 300లకు పైగా చిత్రాలకు పబ్లిసిటీ ఇన్‌చార్జ్‌గా వ్యవ హరించారు. అందులో 31 సినిమాలు శతదినోత్సవం జరుపుకోవడం విశేషం. కొన్ని చిత్రాల్లో నటుడిగా అతిథి పాత్రల్లో కనిపించారు. అలాగే మోహన్‌బాబు 'దొంగ పోలీస్'తో పాటు 'గరం మసాలా' చిత్రాల్ని నిర్మించారు. 'సుబ్బయ్య గారి మేడ' పేరుతో ఓ నవలని, తన సినిమా అనుభవాలను 'తెర వెనుక తెలుగు సినిమా'గా ఓ పుస్తకం రాశారు. ఇది నంది పురస్కారానికి ఎంపికైంది. వ్యక్తిగా, కొడుకుగా, భర్తగా, తండ్రిగా ఆయన తన బాధ్యతను నిర్వర్తించారని ప్రమోద్‌కుమార్ తనయుడు శ్రీనివాస్ రాయ్ తెలిపారు. ప్రమోద్ కుమార్‌కు కుమారుడు శ్రీనివాస్‌రాయ్, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. నిర్మాత, పబ్లిసిటీ ఇన్‌ఛార్జ్ ప్రమోద్‌కుమార్ మృతి పట్ల డిజైనర్స్ అసోసియేషన్‌తోపాటు పలువురు సినీ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు.

కథతో పాటు మారే పాత్ర

రవితేజ తాజాగా నటించిన చిత్రం 'రావణాసుర'. సుధీర్ వర్మ దర్శకత్వంలో అభిషేక్ పిక్చర్స్, ఆర్‌టీ టీమ్‌వర్క్స్ పై అభిషేక్ నామా, రవితేజ నిర్మించారు. ఏప్రిల్ 7న సమ్మర్ స్పెషల్‌గా ఈ సినిమా రిలీజ్ కానుంది. ఈ నేపథ్యంలో ఈ చిత్రంలోని హీరోయిన్స్‌లో ఒకరైన ఫరియా అబ్దుల్లా మీడియాతో ముచ్చటించారు.

'ఇందులో నా పాత్ర పేరు కనకమహాలక్ష్మీ. లాయర్‌గా నటించా. రవితేజ నాకు సీనియర్ లాయర్. క్యారెక్టర్‌లో చాలా వెరైటీ కలర్స్ ఉంటాయి. కథతో పాటు మారే పాత్ర నాది. నటించడానికి మంచి స్పాన్ ఉన్న పాత్ర. ఇందులో ఐదుగురు హీరోయిన్స్ ఉన్నాం. అందరివి భిన్నమైన పాత్రలు. రవితేజతో పని చేయడం నెక్స్ట్ లెవల్ ఎక్స్‌పీరియన్స్. దర్శకుడు సుధీర్ వర్మ చాలా క్లారిటీ ఉన్న దర్శకుడు. 'రావణాసుర'లో సీత ఎవరనేది మీరు సినిమా చూసి తెలుసుకోవాలి. అప్పటివరకూ సస్పెన్స్ (నవ్వుతూ). పాత్రల పరంగా నాకు ప్రయోగాలు చేయడం ఇష్టం. నెగటివ్, యాక్షన్, పీరియాడిక్ ఇలా డిఫరెంట్ పాత్రలు చేయాలని ఉంది. అలాగే దర్శకత్వంతోపాటు నిర్మాణం కూడా చేస్తాను. అయితే వాటికి ఇంకా టైమ్ ఉంది. ప్రస్తుతం తెలుగు, హిందీ, తమిళంలో సినిమాలు చేస్తున్నా' అని తెలిపారు.



ఫరియా అబ్దుల్లా

ఆటలు

సిరీస్ నీదా?నాదా?

- భారత్, ఆసీస్ అమీతుమీ నేడు
- చెపాక్‌లో నిర్ణయాత్మక మూడో వన్డే
- సిరీస్ విజయంపై ఇరు జట్ల గురి
- మధ్యాహ్నం 1.30 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..

2019 నుంచి స్వదేశంలో టీమ్ ఇండియా వన్డే సిరీస్‌ను కోల్పోలేదు. చివరగా అరోన్ ఫించ్‌సేన ఐదు వన్డేల సిరీస్‌ను 0-2 వెనుకంజ నుంచి పుంజుకుని గెల్చుకుంది. 2023లో 2019 ఫలితం పునరావృతం చేసేందుకు కంగారూలు సిద్ధమవుతుండగా.. చెన్నై చెపాక్‌లో ఆస్ట్రేలియాకు చెక్ పెట్టి వన్డే సిరీస్‌ను సాధించేందుకు రోహిత్‌సేన సిద్ధమవుతోంది. ఇరు జట్లు సిరీస్ విజయంపై కన్నేయటంతో నేడు నిర్ణయాత్మక మూడో వన్డే రసవత్తరంగా సాగనుంది.



నవతెలంగాణ-చెన్నై

స్వింగ్, సీమ్.. వాంఖడే, విశాఖ వన్డేల్లో హల్‌చల్ చేశాయి. భారత్‌లో ఓ వన్డేల్లో తొలుత బ్యాటింగ్ చేసిన జట్టు వరుసగా రెండు మ్యాచుల్లో 200 ప్లస్ పరుగులు చేయకపోవటం బహుశా ఇదే తొలిసారి కాబోలు!. పేసర్లు విజృంభించిన సిరీస్‌లో తొలి రెండు మ్యాచుల్లో బ్యాటర్లకు, స్పిన్నర్లకు పెద్దగా పని లేకుండా పోయింది. కానీ ఎం.ఏ చిదంబరం స్టేడియం స్పిన్ మలుపులు తిరిగేందుకు ముస్తాబైంది. స్పిన్నర్లు ప్రధాన పాత్ర పోషించనున్న నిర్ణయాత్మక వన్డేలో నెగ్గి భారత్ సిరీస్ సాధిస్తుందా?లేదంటే మరోసారి భారత్‌పై వన్డే సిరీస్‌ను ఆసీస్ సొంతం చేసుకుంటుందా? ఆసక్తికరం.

మెరుస్తారా?

సొంతగడ్డపై మన బ్యాటర్లు పవర్‌ప్లేలోనే చేతులెత్తేయటం చాలా అరుదు. మిచెల్ స్టార్క్ సీమ్ అనుకూల పరిస్థితుల్లో గొప్ప ప్రభావం చూపించాడు. కానీ చెపాక్‌లో పరిస్థితులు భిన్నం. కెప్టెన్ రోహిత్ శర్మ, శుభ్‌మన్ గిల్, విరాట్ కోహ్లిలు మంచి ఫామ్‌లో ఉన్నారు. పరుగుల పిచ్‌పై ఈ ముగ్గురిని నిలువరించటం అంత సులువు కాదు. కానీ సూర్యకుమార్ యాదవ్ ఫామ్ ఆందోళనకు గురి చేస్తోంది. టీ20ల్లో అదరగొట్టే సూర్యకుమార్ యాదవ్.. వన్డేల్లో తేలిపోతున్నాడు. శ్రేయస్ అయ్యర్ అందుబాటులో లేని వేళ సూర్యకుమార్‌కు అవకాశాలు సులువుగా దక్కుతున్నా.. ఈ ఫార్మాట్‌లో సూర్య తనదైన ఇన్నింగ్స్ నమోదు చేయాల్సి ఉంది. అక్షర్‌పటేల్ బ్యాట్‌తో గొప్ప ఫామ్‌లో ఉన్నాడు. అక్షర్ బ్యాటింగ్ సామర్థ్యం వాడుకోవటంతో పాటు లెఫ్ట్ ఆర్మ్ సీమర్ స్టార్క్‌కు చెక్ పెట్టేందుకు అతడిని బ్యాటింగ్ ఆర్డర్‌లో ముందుకు పంపించాలి. రవీంద్ర జడేజాకు తోడు వాషింగ్టన్ సుందర్ నేడు తుది జట్టులో నిలిచే అవకాశం ఉంది. మహ్మద్ షమి, మహ్మద్ సిరాజ్‌లు పేస్ బాధ్యతలు పంచుకోనున్నారు.

వార్నర్ రాక

లెఫ్ట్ ఆర్మ్ పేసర్ మిచెల్ స్టార్క్ రెండు వన్డేల్లో భారత్‌ను వణికించాడు. వాంఖడేలో 3, విశాఖలో ఐదు వికెట్లతో సత్తా చాటాడు. సీన్ అబాట్, నాథన్ ఎలిస్ సైతం సీమ్ అనుకూల పరిస్థితుల్లో మెరిశారు. తొలి పది ఓవర్ల అనంతరం వాంఖడెలో 39/4, విశాఖలో 5/49తో భారత్ నిలిచింది. భారత పిచ్‌లపై వన్డేల్లో టీమ్‌ఇండియాను ఇంతలా మరో జట్టు ఇబ్బంది పెట్టలేదు. స్పిన్ పిచ్ సైతం స్టార్క్ భారత్‌కు సవాల్ విసరనున్నాడు. ఇక ఢిల్లీ టెస్టు అనంతరం గాయంతో జట్టుకు దూరమైన డెవిడ్ వార్నర్.. చివరి వన్డేకు అందుబాటులోకి వచ్చాడు. వార్నర్ రాకతో ఆసీస్ తుది జట్టు కూర్పు మారనుంది. ట్రావిశ్ హెడ్‌తో కలిసి దంచికొట్టిన మిచెల్ మార్ష్ మిడిల్ ఆర్డర్‌కు వెళ్లనున్నాడు. మార్నస్ లబుషేన్ బెంచ్‌కు పరిమితం కానున్నాడు. గ్లెన్ మాక్స్‌వెల్ సైతం తుది జట్టులో నిలువనున్నాడు. స్పిన్ పిచ్‌పై ఓ సీమర్ స్థానంలో ఆష్టన్ ఆగర్‌ను తీసుకునే అవకాశం ఉంది.

పిచ్, వాతావరణం

చెపాక్ సహజసిద్ధంగా స్పిన్ అనుకూల పిచ్. ఐపీఎల్‌లో సూపర్‌కింగ్స్‌ను దృష్టిలో ఉంచుకుని ప్రస్తుత పిచ్‌ను తయారు చేశారు. ఇప్పుడే అదే పిచ్‌పై భారత్, ఆసీస్ మూడో వన్డే ఆడనున్నాయి. సోమవారం ఇక్కడ వర్షం కురిసింది. అయినా, పిచ్ నుంచి సీమర్లు తొలి రెండు వన్డేల తరహా సహకారం ఆశించలేరు. టాస్ నెగ్గిన తొలుత బౌలింగ్ ఎంచుకునే అవకాశం కనిపిస్తోంది.


తుది జట్లు (అంచనా)

భారత్ : రోహిత్ శర్మ (కెప్టెన్), శుభ్‌మన్ గిల్, విరాట్ కోహ్లి, సూర్యకుమార్ యాదవ్, కెఎల్ రాహుల్ (వికెట్ కీపర్), హార్దిక్ పాండ్య, రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్/వాషింగ్టన్ సుందర్, మహ్మద్ షమి, మహ్మద్ సిరాజ్.

ఆస్ట్రేలియా : డెవిడ్ వార్నర్, ట్రావిశ్ హెడ్, స్టీవ్ స్మిత్ (కెప్టెన్), మిచెల్ మార్ష్, అలెక్స్ కేరీ (వికెట్ కీపర్), కామెరూన్ గ్రీన్, గ్లెన్ మాక్స్‌వెల్, మార్కస్ స్టోయినిస్, ఆష్టన్ ఆగర్, మిచెల్ స్టార్క్, ఆడం జంపా.

క్వార్టర్‌ఫైనల్లో నిఖత్

లవ్లీనా, మనీశ, నీతూ సైతం.. ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్స్



న్యూఢిల్లీ : భారత బాక్సింగ్ సూపర్‌స్టార్, డిఫెండింగ్ ప్రపంచ చాంపియన్ నిఖత్ జరీన్ వరుస ప్రపంచ చాంపియన్‌షిప్స్‌లో భిన్న విభాగాల్లో పసిడి సొంతం చేసుకున్న బాక్సర్‌గా నిలిచేందుకు మరో అడుగు ముందుకేసింది. మహిళల 52 కేజీల విభాగంలో ప్రపంచ చాంపియన్‌గా కొనసాగుతున్న నిఖత్ జరీన్.. ప్రస్తుతం న్యూఢిల్లీలో జరుగుతున్న ఐబీఏ మహిళల ప్రపంచ చాంపియన్‌షిప్స్‌లో క్వార్టర్స్ ఫైనల్స్‌లోకి ప్రవేశించింది. మహిళల 50 కేజీల విభాగం ప్రీ క్వార్టర్‌ఫైనల్స్‌లో నిఖత్ జరీన్ ముచ్చటగా మూడోసారి ఏకపక్ష విజయం నమోదు చేసింది. సోమవారం జరిగిన ప్రీ క్వార్టర్స్ బౌట్‌లో మెక్సికో బాక్సర్ ఫాతిమా ఫెర్రెరాపై ఏకపక్ష విజయం సాధించింది. మూడు రౌండ్లలోనూ ప్రత్యర్థిపై పదునైన పంచ్‌లు విసిరిన నిఖత్ జరీన్ ఐదుగురు న్యాయ మూర్తుల ఏకగ్రీవ విజేతగా నిలిచింది. 5-0తో మెక్సికో బాక్సర్‌ను చిత్తు చేసింది. కీలక క్వార్టర్‌ఫైనల్లో థాయ్ లాండ్ బాక్సర్‌తో నిఖత్ జరీన్ తలపడనుంది. 57 కేజీల విభాగంలో మనీశ నాకౌట్ విజయం సాధించింది!. మూడో రౌండ్ మధ్యలోనే బౌట్‌ను ఆపేసిన రిఫరీలు మనీశను విజేతగా ప్రకటించారు. టర్కీ బాక్సర్ తుర్హన్ నుర్‌పై మనీశ తిరుగులేని ఆధిపత్యం చూపించింది. 48 కేజీల విభాగంలో యువ బాక్సర్ నీతూ అదరగొట్టింది. తజకిస్తాన్ బాక్సర్ సుమైయను చిత్తు చేసింది. తొలి రౌండ్లోనే రిఫరీలు నీతూను ఆర్ఎస్సీ ప్రకారం విజేతగా ప్రకటించారు. టర్కీ బాక్సర్‌ను దిమ్మదిరిగే పంచ్ ఇచ్చిన నీతూ క్వార్టర్‌ఫైనల్లోకి చేరుకుంది. 75 కేజీల విభాగంలో ఒలింపిక్ మెడలిస్ట్ లవ్లీనా బొర్గొహైన్ 5-0తో మెక్సికో బాక్సర్‌ను చిత్తు చేయగా.. 52 కేజీల విభాగంలో సాక్షి చౌదరి ఐదో సీడ్ జాజిరాను 5-0తో ఓడించి క్వార్టర్‌ఫైనల్లోకి ప్రవేశించింది.

లీకేజీకి పాలనా వైఫల్యమే కారణం



అభ్యర్థులకు నష్టపరిహారం చెల్లించాలి

- టీఎస్‌పీఎస్సీ చైర్మెన్, సభ్యులు రాజీనామా చేయాలి
- హైకోర్టు సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ చేయించాలి
- ఇక నుంచి ఐక్య పోరాటాలు
- విద్యార్థి జన సమితి రౌండ్ టేబుల్ సమావేశంలో తీర్మానం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

టీఎస్‌పీఎస్సీ ప్రశ్నాపత్రాల లీకేజీకి ప్రభుత్వ పాలనాపరమైన వైఫల్యమే కారణమని పలువురు నాయకులు విమర్శించారు. విద్యార్థి జన సమితి (వీజేఎస్), యువజన సమితి ఆధ్వర్యంలో మంగళవారం సోమాజీగూడ ప్రెస్ క్లబ్‌లో టీఎస్‌పీఎస్సీ పేపర్ల లీకేజీపై అనే అంశంపైనిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీజేఎస్ అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో పలు రాజకీయ పార్టీలు, విద్యార్థి, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. ప్రశ్నాపత్రాల లీకేజీతో నష్టపోయిన అభ్యర్థులందరికీ తిరిగి పరీక్షలు నిర్వహించేంత వరకు పరిహారం చెల్లించాలని సమావేశం డిమాండ్ చేసింది. టీఎస్ పీఎస్సీ చైర్మెన్ అధీనంలోనే పరీక్షల వ్యవస్థ ఉన్న నేపథ్యంలో నైతిక బాధ్యతగా ఆయనతో సహా సభ్యులందరూ రాజీనామా చేయాలని తీర్మానించింది. మొత్తం అధికారం సీఎం చేతిలోనే ఉంది. అందువల్ల ఆయన ఈ ఘటనకు నైతిక బాధ్యత వహించాలని అభిప్రాయపడింది. త్వరలో అన్ని పార్టీలతో కలిసి ఉమ్మడి కార్యాచరణ రూపొందిస్తామని ప్రకటించింది.

సమావేశంలో పాల్గొన్న ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందరికి ఉద్యోగాలివ్వాలనే డిమాండ్‌తో ఐక్య ఉద్యమం కొనసాగాలని సూచించారు. ఆత్మహత్యలు పరిష్కారం కాదనీ, యువతలో నిర్లిప్తత మంచిది కాదని అన్నారు. నిరుద్యోగ సమస్యను పరిష్కరించకుండా సీఎం కేసీఆర్, దేశానికి తెలంగాణ మోడల్ అని ఎలా చెబుతారంటూ ప్రశ్నించారు. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ కొందరి తెలంగాణను అందరి తెలంగాణగా మార్చేందుకు బలమైన ఐక్యవేదిక ఏర్పాటు చేయాలని సూచించారు. కేటీఆర్ ప్రెస్‌మీట్ పెట్టి ఇద్దరు మాత్రమే తప్పు చేశారని చెప్పడం ...సిట్ అధికారులను హెచ్చరించినట్టుగా ఉందని తెలిపారు. ప్రశ్నాపత్రాల లీకేజీ అంశంపై బయటికొచ్చాక సకాలంలో సాక్ష్యాలను సరిగ్గా సేకరించలేదని తప్పుపట్టారు. సిట్‌కు విచారించే సాంకేతిక సామర్థ్యం లేదనీ, సీబీఐతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి మాట్లాడుతూ అన్ని రకాల పరీక్షలను ఒకే గొడుగు కిందకు తీసుకురావాలని కోరారు. రాజకీయ ప్రమేయం లేని వారిని టీఎస్‌పీఎస్సీ చైర్మెన్, సభ్యులుగా నియమించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ సీనియర్ నేత మల్లు రవి మాట్లాడుతూ నిరుద్యోగులకు న్యాయం జరిగేంత వరకు పోరాటం నిర్వహించాలనీ, వాటిలో కాంగ్రెస్ భాగస్వామి అవుతుందని తెలిపారు. తెలంగాణ విద్యావంతుల వేదిక నాయకులు అంబటి నాగన్న మాట్లాడుతూ టీఎస్‌పీయస్సీ సభ్యునిగా ఉన్న సమయంలో విఠల్ అన్ని ఉద్యోగాలు భర్తీ చేశామంటూ చెప్పారని గుర్తుచేశారు. ఆయన బీజేపీలో చేరాక ఉద్యోగాల భర్తీ చేయలేదంటూ మాటమార్చారని విమర్శించారు. సీపీఐ(ఎం-ఎల్) న్యూడెమోక్రసీ నాయకులు గోవర్దన్ మాట్లాడుతూ, పరీక్షలు తిరిగి నిర్వహించేంత వరకు ఒక్కో అభ్యర్థికి నెలకు రూ.20 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ప్రజాపంథా నాయకులు వి.ప్రవీణ్, పీఓడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు ఝాన్సీ, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు పుట్టా లక్ష్మణ్, సీడీపీఓల అభ్యర్థుల ప్రతినిధి స్వప్న, స్వేరోస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రాజ్ కుమార్, టీపీటీఎఫ్ నాయకులు కొండల్ రెడ్డి, హెచ్‌సీయూ విద్యార్థి నాయకులు వెంకటేష్ చౌహాన్, వీజేఎస్ రాష్ట్ర అధ్యక్షులు సర్దార్ వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జనరిక్ మందులను ప్రచారంలోకి తీసుకురావాలి

- ఫార్మా కంపెనీల దోపిడీని అరికట్టాలి
- ఎస్‌వీకే ఇన్‌చార్జి ఎస్.వినయకుమార్



నవతెలంగాణ - భువనగిరి

మార్కెట్‌లో ఫార్మా కంపెనీల దోపిడీ విచ్చలవిడిగా పెరిగిందని, జనరిక్ మందుల వాడకంపై ప్రభుత్వం ప్రచారం చేపట్టాలని హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం ఇన్‌చార్జి ఎస్.వినయకుమార్ అన్నారు. మంగళవారం యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రంలో దుంపల మల్లారెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో జనరిక్ మెడిసిన్‌పై ట్రస్ట్ అధ్యక్షులు గూడూరు అంజిరెడ్డి అధ్యక్షతన అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో వినయకుమార్ మాట్లాడారు. ఫార్మా కంపెనీలు మందుల వ్యాపారం పేరుతో యథేచ్ఛగా దోపిడీ కొనసాగిస్తున్నాయన్నారు. ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఫార్మా కంపెనీల దోపిడీని అరికట్టడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని విమర్శించారు. ఫార్మా కంపెనీలకు స్వేచ్ఛనివ్వడంతో విచ్చలవిడి ధరలతో ఒక మాఫియా లాగా మందుల అమ్మకం జరుగుతోందన్నారు. జనరిక్ మందులు కూడా ఇతర మందుల్లాగే పనిచేస్తున్నాయని, వీటి పట్ల ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని చెప్పారు. వాటిని ప్రచారంలో పెట్టడంలో ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి పెట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఫార్మా కంపెనీల దోపిడీని అరికట్టి జనరిక్ మందుల ప్రచారాన్ని.. వాటి ప్రత్యేకతలపై అవగాహన సదస్సులు నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు ప్రధాన కార్యదర్శి ఎండి.జహంగీర్, ట్రస్టు సభ్యులు కొండమడుగు నర్సింహ, బట్టుపల్లి అనురాధ, మాటూరి బాలరాజు, కల్లూరి మల్లేశం, కోమటిరెడ్డి చంద్రారెడ్డి, సంగు నరేందర్, గద్దె నర్సింహ, ఎదునూరి మల్లేశం, దయ్యాల నర్సింహ, ఎం.ఎ.ఇక్బాల్, గడ్డం వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

నిరసన ఉద్యోగుల ప్రజాస్వామిక హక్కు

కాదనే అధికారం కేంద్రానికి లేదు : టీఎస్‌యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి చావ రవి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పాత పెన్షన్ విధానం సాధన కోరుతూ జరిగే నిరసన ప్రదర్శనల్లో ఉద్యోగులు పాల్గొంటే క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామంటూ కేంద్ర ప్రభుత్వం ఉద్యోగులు, ఉపాధ్యాయులను బెదిరించటాన్ని స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్టీఎఫ్ఐ) ఉపాధ్యక్షులు, తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి తీవ్రంగా ఖండించారు. సమస్యలపై నిరసన తెలపడం ఉద్యోగులు పోరాటం చేయడం ప్రజాస్వామిక హక్కని అన్నారు. దీన్ని కాదనే అధికారం కేంద్ర ప్రభుత్వానికి లేదన్నారు. యూటీఎఫ్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి అప్పారి వెంకటస్వామి 22వ వర్ధంతి సభ మంగళవారం హైదరాబాద్‌లోని సంఘం రాష్ట్ర కార్యాలయంలో టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కె జంగయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా చావ రవి మాట్లాడుతూ పాత పెన్షన్ విధానాన్ని (ఓపీఎస్) పునరుద్ధరించాలంటూ జరగుతున్న నిరసనల్లో ఉద్యోగులు పాల్గొనకూడదంటూ కేంద్ర ప్రభుత్వ సిబ్బంది, శిక్షణా విభాగం ఆదేశాలివ్వడం పైగా ఈ ఆదేశాలను అతిక్రమిస్తే తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించటం అప్రజాస్వామికమని విమర్శించారు. ఉద్యోగుల సామాజిక భద్రతకు ముప్పుగా



ఉన్న సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాల్సిందేనని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్రం బెదిరిపులకు భయపడకుండా పాత పెన్షన్ సాధనే లక్ష్యంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. ఉద్యోగుల ఉద్యమానికి తలొగ్గి ఇప్పటికే నాలుగు రాష్ట్రాలు పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాయని గుర్తు చేశారు. పీఎఫ్ఆర్డీఏ చట్టాన్ని రద్దు చేసి దేశవ్యాప్తంగా పాత పెన్షన్ పునరుద్ధరించాలని కోరారు. తొలుత వెంకటస్వామి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయ ఉద్యమం కోసం 16 ఏండ్ల సర్వీసును వదులుకుని పూర్తి కాలం కార్యకర్తగా మారి ఆయన చేసిన త్యాగం అందరికీ స్ఫూర్తిదాయకమని ఇతర నాయకులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎ సింహాచలం, రాష్ట్ర కమిటీ సభ్యులు శారద, రాజారావు, శ్యామ్ సుందర్, సైదులు, నరసింహారెడ్డి, జిల్లా నాయకులు విద్య, జగన్మోహన్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నిమ్స్ డైరెక్టర్‌ను మార్చాలి

నర్సుల ఆందోళన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నిమ్స్ డైరెక్టర్‌ను మార్చాలంటూ అక్కడి నర్సులు డిమాండ్ చేశారు. నర్సుల పట్ల అరాచకంగా వ్యవహరిస్తూ, వివక్ష ప్రదర్శిస్తున్న నిమ్స్ డైరెక్టర్‌కు వ్యతిరేకంగా నిమ్స్ నర్సెస్ యూనియన్ (ఎన్ఎన్‌యూ) ఆధ్వర్యంలో మంగళవారం వారు విధులు బహిష్కరించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ లెక్కల ప్రకారం నిమ్స్‌లో 2,300 మంది నర్సులు పని చేయాల్సి ఉండగా, ప్రస్తుతం కేవలం 800 మంది మాత్రమే ఉన్నారని తెలిపారు. ఉన్నవారిలోనూ కేవలం 500 మంది రెగ్యులర్ ప్రాతిపదికన పని చేస్తున్నారని తెలిపారు. దీంతో వారిపై ఒత్తిడి పెరుగుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయాలపై డైరెక్టర్ ను కలిసి విన్నవించుకుందామంటే కలవడం లేదని వారు విమర్శించారు. నర్సింగ్ సూపరింటెండెంట్ లలితకుమారి సమస్యలు లేవనెత్తారనే కోపంతో యూనియన్ ప్రధాన కార్యదర్శి విజయకుమారి, స్లీవలకు మెమోలిచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ మెమోలను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎమెర్జెన్సీ వార్డుల్లో బెడ్లు ఖాళీగా ఉన్నాయని చూపించుకునేందుకు అక్కడి రోగులను జనరల్ వార్డులకు తరలిస్తున్నారనీ, దీంతో నర్సులపై పని భారం పడటమే కాకుండా రోగులకు సదుపాయాలు దొరకడం లేదని చెప్పారు. అర్హత కలిగిన వారికి గ్రేడ్ 1 నర్సింగ్ సూపరింటెండెంట్‌గా పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు.

ఈ-కుబేర్ పెండింగ్ బిల్లులు చెల్లించాలి

- యూఎస్‌పీసీ ధర్నాలకు సంపూర్ణ మద్దతు : ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఈ-కుబేర్ పెండింగ్ బిల్లుల చెల్లింపులను వెంటనే పూర్తి చేయాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎయిడెడ్ ఉపాధ్యాయులు, లెక్చరర్ల మూడు నెలల జీతాలు, కాంట్రాక్టు లెక్చరర్ల జీతాలు, పీఆర్సీ బకాయిలు, ప్రావిడెంట్ ఫండ్ రుణాలు, పార్ట్ ఫైనల్స్, మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు, మైనార్టీ గురుకుల టీచర్ల పీఆర్సీ బకాయిల బిల్లులు ఈ-కుబేర్‌లో పెండింగ్‌లో ఉండటం వల్ల ఉపాధ్యాయులు, అధ్యాపకులు, ఉద్యోగులు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారని మంగళవారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ఈ-కుబేర్‌లతోని పెండింగ్ బిల్లులను ఈనెల 23వ తేదీలోగా చెల్లించకుంటే 24న జిల్లా ట్రెజరీ కార్యాలయాల ఎదుట ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీసీ) ఆధ్వర్యంలో ధర్నా చేస్తామంటూ పిలుపునిచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. ఆ సంఘం చేపట్టే ధర్నా చాలా సమంజసమైందని పేర్కొన్నారు. ఆ కార్యక్రమాలకు తాను సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నానని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి ఈనెల 23వ తేదీలోగా ఈ-కుబేర్ పెండింగ్ బిల్లులను చెల్లించాలని కోరారు. లేదంటే ఉపాధ్యాయులు, అధ్యాపకులు, ఉద్యోగులందరూ 24న జరిగే ధర్నాలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఈ అంశాన్ని గతనెలలో జరిగిన బడ్జెట్ సమావేశాల సందర్భంగా శాసనమండలిలో తాను ప్రస్తావించానని గుర్తు చేశారు. ఆ తర్వాత రెండు సార్లు లేఖ ద్వారా ఆర్థిక మంత్రి దృష్టికి తెచ్చానని తెలిపారు. అయినా పెండింగ్ బిల్లుల చెల్లింపులు కాలేదని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బిల్లుల చెల్లింపుల జాప్యాన్ని నివారించాలని సూచించారు. వెంటనే ఆ బిల్లులను చెల్లించాలని కోరారు.

ఆయుర్వేద వైద్యం ఆరోగ్యానికి ఎంతో మేలు

- వనమూలికా వైద్యసేవలు ప్రశంసనీయం
- హోంమంత్రి మహమూద్ అలీ



నవతెలంగాణ - హైదరాబాద్

ఆయుర్వేద డాక్టర్ జమాల్‌ఖాన్ ఔషధ వనమూలికల వైద్య సేవలను రాష్ట్ర హోంశాఖా మంత్రి మహ్మద్ మహమూద్ అలీ ప్రశంసిం చారు. మంగళవారం డాక్టర్ జమాల్ ఖాన్‌ను హైదరా బాద్‌లోని తన నివాసానికి ఆహ్వానించారు. ఆయన వైద్య సేవలను కొని యాడుతూ శాలువా కప్పి ఘనంగా సత్క రించారు. ఈ సందర్భంగా డాక్టర్‌తో హోం మంత్రి మాట్లాడుతూ వనమూ లిక వైద్యం ఎంతో విశిష్టతతో కూడుకున్నదన్నారు. పురాతన కాలం నుంచి మానవాళికి ఉపయోగపడే ఆయుర్వేద వైద్య విధానం గూర్చి ప్రజలకు అవగా హన కలిగించాలని అభిప్రాయ పడ్డారు. గ్లోబల్ వార్మింగ్ రోజు రోజుకు వాతావరణం వేడెక్కి భూమిపై జీవరాశి మనుగడకే సవాల్‌గా మారిందన్నారు. మనిషి స్వార్థానికి అడవులను విచక్షణారహితంగా నరికి వేయడంతో ఎంతో విలువైన ఔషధ మొక్కలు అంతరించి పోతున్నాయని చెప్పారు. మానవ మనుగడకు అవసరమయ్యే వనమూలికా ఔషధ మొక్క లు నాటి ప్రజలలో చైతన్యం తీసుకువచ్చి భావితరాలకు ప్రాణ వాయు వును అందించాలన్నారు. ఇందుకు డాక్టర్ జామాల్‌ఖాన్ స్పందిస్తూ ప్రస్తుత పరిస్థితుల్లో వనమూలికల కొరత ఎక్కువగా ఉంటున్నదని అన్నారు. తెలంగాణ ముస్లిం ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు మహమ్మద్ ముజాహిద్ మాట్లాడుతూ విష సర్పాల బారినపడి మత్యువుకు చేరువవుతున్న దశలో వేలాది మందిని పాము కాటు బాధి తులను ఉచితంగా మందులను అందించారని చెప్పారు. మంత్రిని కలిసిన వారిలో భద్రాచలం బీఆర్ఎస్ పార్టీ మాజీ నియోజకవర్గ ఇన్‌ఛార్జీ మానే రామకష్ణ, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి, సీనియర్ జర్నలిస్ట్ కర్ర అనిల్‌రెడ్డి. ఎస్కే షాజహాన్ తదితరులు పాల్గొన్నారు.

విప్లవాత్మక పథకాలతో ప్రజల ఆరోగ్య ప్రమాణాల్లో మెరుగుదల

- సీఎస్ శాంతికుమారి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ముఖ్యమంత్రి కేసీఆర్ చేపట్టిన విప్లవాత్మక పథకాల వల్ల రాష్ట్ర ప్రజల ఆరోగ్య ప్రమాణాల్లో గణనీయమైన మెరుగుదల సాధించినట్టు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి వెల్లడించారు. వైద్య ఆరోగ్య శాఖపై మంగళవారం హైదరాబాద్‌లోని బీ.ఆర్.కె.భవన్‌లో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ శాంతికుమారి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన కంటి వెలుగు, కేసీఆర్ కిట్, కేసీఆర్ న్యూట్రిషన్ కిట్, మహిళా జర్నలిస్టులకు కాంప్రహెన్సివ్ హెల్త్ చెకప్ లతోపాటు ఎన్నో విప్లవాత్మక పథకాలతో రాష్ట్ర ప్రజల ఆరోగ్య, జీవన ప్రమాణాలు మెరుగయ్యాయని తెలిపారు. రాష్ట్రంలో ఇప్పటివరకు 13,28,808 మందికి కేసీఆర్ కిట్లను అందచేశామనీ, తద్వారా 29.10 లక్షల మంది లబ్ది పొందారని తెలిపారు. ప్రస్తుతం 95 శాతం ప్రసవాలు సంస్థాగతంగా జరుగుతున్నాయని వివరించారు. ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవాలు 30 శాతం నుండి 61 శాతానికి పెరిగాయని తెలిపారు. ప్రాథమిక వైద్య కేంద్రాల్లో ప్రసవాలను జరిపితే ప్రోత్సాహక పురస్కారాలను కూడా సిబ్బందికి అందిస్తున్నామని చెప్పారు. గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారాన్ని అందించేందుకు రాష్ట్రంలోని 9 జిల్లాల్లో ప్రయోగాత్మకంగా ప్రవేశ పెట్టిన కేసీఆర్ న్యూట్రిషన్ కిట్ ద్వారా మంచి ఫలితాలు వస్తున్నాయని, ఈ కిట్‌ల వల్ల మాతా శిశు మరణాల సంఖ్య తగ్గిందని అన్నారు. మరి కొద్దీ రోజుల్లో ఈ కేసీఆర్ న్యూట్రిషన్ ఫుడ్ కిట్‌లను అన్ని జిల్లాల్లో ప్రారంభించనున్నామని వెల్లడించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రారంభించిన ఆరోగ్య మహిళా కార్యక్రమంలో భాగంగా ఇప్పటి వరకు 5,214 మంది మహిళలకు ఎనిమిది రకాల వైద్య పరీక్షలు నిర్వహించామని తెలిపారు ప్రతీ మంగళవారం నాడు ప్రత్యేకంగా నిర్వహించే ఈ కార్యక్రమం క్రింద వైద్య పరీక్షలు నిర్వహించుకోవాలని రాష్ట్రంలోని మహిళలకు శాంతి కుమారి ఈ సందర్భంగా సూచించారు. దాదాపు 57 రకాల పాథాలజికల్ పరీక్షలు ఉచితంగా నిర్వహించేందు కోసం రాష్ట్రంలోని హైదరాబాద్ తోపాటు 22 జిల్లాలో ప్రారంభించిన తెలంగాణా డయాగ్నోస్టిక్స్ ద్వారా ఇప్పటివరకు 49 లక్షల మందికి 8 .90 కోట్ల పరీక్షలు నిర్వహించినట్టు వెల్లడించారు. దాదాపు రెండు కోట్ల మంది ప్రజలకు తక్షణ వైద్య పరీక్షలు నిర్వహించేందుకు వీలుగా ప్రవేశపెట్టిన 352 బస్తీ దవాఖానాల ద్వారా ఇప్పటివరకు కోటి 14 లక్షల మందికి ఒపి ద్వారా వైద్య పరీక్షలు నిర్వహించామని తెలిపారు. మరో 46 బస్తీ దవాఖానాలను త్వరలోనే ప్రారంభించనున్నామని తెలిపారు.

మహిళా జర్నలిస్టులకు మాస్టర్ హెల్త్ చెకప్ లు

రాష్ట్రంలోని మహిళా జర్నలిస్టులకు మాస్టర్ హెల్త్ చెకప్‌లను నిర్వహించనున్నట్టు సీఎస్ తెలిపారు. దాదాపు 56 రకాల పారామీటర్లు, 12 పరీక్షలు ఈ మాస్టర్ హెల్త్ చెకప్ ద్వారా నిర్వహిస్తామని చెప్పారు. ఇందు కోసం సమాచార శాఖ కార్యాలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని సమాచార పౌర సంబంధాల శాఖ కమీషనర్‌ను సీఎస్ ఆదేశించారు.

వర్షాలకు నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

- ఎకరాకు రు.20వేల ష్టపరిహారమివ్వాలి : సీపీఐ(ఎం) మాజీ ఎమ్మెల్యే జూలకంటి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో కురిసిన అకాల వర్షాలకు నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం తక్షణం ఆదుకోవాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకులు, సీపీఐ(ఎం) మిర్యాలగూడెం మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లక్షల ఎకరాల్లో ధాన్యం, మామిడి, మొక్కజొన్న, జొన్న, పసుపు, పొద్దుతిరుగుడు, కూరగాయలు తదితర పంటలు దెబ్బతిన్నాయని తెలిపారు. దీంతో రైతులు అప్పులు తెచ్చి పంటలు పండిస్తే..కష్టమంతా నీళ్లపాలయిం దని రోదిస్తున్నారని పేర్కొన్నారు. పిడుగులు పడటంతో ప్రాణనష్టం, ఆస్తి నష్టం జరిగిందని తెలిపారు. గొర్రెలు, మేకలు, కోళ్ల చనిపోయాయని పేర్కొన్నారు. తక్షణమే జరిగిన నష్టంపై ప్రభుత్వ అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి అంచనాలు వేయాలని డిమాండ్ చేశారు. నష్టానికి సంబంధించిన వాస్తవ గణాంకాలను, పూర్తి వివరాలను సేకరించి, నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.



రాష్ట్రంలో 2018 నుంచి నేటివరకు రూ.1,500 కోట్ల పంటల నష్టం వాటిల్లిందని తెలిపారు. 2020 నుంచి 2023 వరకు రూ.1,787కోట్లు 15వ ఫైనాన్స్ కమిషన్‌లో ప్రకటించినా నష్టపరిహారం నామమాత్రంగానే అందిం దని పేర్కొన్నారు. 2022 వానాకాలంలో అధిక వర్షాల వల్ల 11లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని తెలిపారు. జరిగిన నష్టంపై కేంద్రానికి లేఖ రాయాలని కోరారు. నష్టాన్ని అంచనా వేసి నష్టపోయిన రైతులకు ఎకరాకు రు.20వేల చొప్పున పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

అకాల వర్షాల వలన నష్టపోయిన పంటలకు పరిహారం చెల్లించండి

సీఎం కేసీఆర్‌కు తెలంగాణ రైతు సంఘం లేఖ

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

అకాల వర్షాలు, వడగండ్ల వానతో నష్టపోయిన పంటలకు పరిహారం చెల్లించాలంటూ తెలంగాణ రైతు సంఘం కోరింది. మంగళవారం ఈమేరకు ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. సాగర్, సీనియర్ నాయకులు సారంపల్లి మల్లారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు అరిబండి ప్రసాదరావు, రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్‌శోభన్...సీఎం కేసీఆర్‌కు లేఖ రాశారు. దాదాపు ఐదు లక్షల ఎకరాల్లో రూ.1250 కోట్ల నష్టం వాటిల్లినట్లు ప్రభుత్వమే ప్రాథమిక అంచనా వేసిందని పేర్కొన్నారు. నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.20 వేల పరిహారం ఇవ్వాలని కోరారు. ఈ నెల 16 నుంచి 20 వరకు కురిసిన వర్షాల వలన 25 జిల్లాలలో దాదాపు 7 లక్షల ఎకరాలలో పంటలు దెబ్బతిన్నాయని తెలిపారు. వరి, మొక్కజొన్న, పసుపు, మిరప, జొన్న, నువ్వులు, పొద్దుతిరుగుడు, కూరగాయల పంటలు పూర్తిగా నష్టపోయాయని పేర్కొన్నారు. పండ్ల తోటలలో పుచ్చ, కర్బూజ, మామిడి పంటలు దెబ్బతింటే, పిడుగుపాటుకు గొర్రెలు, మేకలు, ఎద్దులు మరణించాయని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్తగూడెం మండలంలో ధరంసోత్ శంకర్ మరణించారని తెలిపారు. పెనుబల్లి మండలం బయ్యన్నపురంలో పిడుగుపడి 1500 కోళ్ళు మృత్యువాతపడ్డాయని పేర్కొన్నారు. భద్రాద్రి జిల్లా అశ్వపల్లి మండలంలో పిడుగుపడి మూడు గ్రామాల్లో 13 దుక్కిటెడ్లు మరణించాయని గుర్తు చేశారు. మొత్తంగా రూ. 2,000 కోట్ల నష్టం జరిగిందని తెలిపారు. ఎండిఆర్ఎఫ్ స్కీమ్ కింద పరిహారం ఇప్పిస్తామంటూ వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావు ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. భారీ నష్టం జరిగినప్పటికీ 43,424 మందికి చెందిన 57,855 ఎకరాల్లో దెబ్బతిన్నట్టు ప్రకటించడం సరైందికాదని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం విపత్తు సహాయం కింద 2023 మార్చి 14న రూ.1816 కోట్లు విడుదల చేసిందనీ, అందులో రూపాయి కూడా ఇవ్వలేదని విమర్శించారు. 2022-23లో వానాకాలం, యాసంగి కలిసి రూ.4,000 కోట్లు రైతులకు నష్టం జరిగిందని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే సర్వే చేసి ఎకరా ఆహారధాన్యాలకు రూ.20 వేలు, వాణిజ్య పంటలకు రూ.40వేల పరిహారం చెల్లించాలని విజ్ఞప్తి చేశారు.

నెలాఖరు వరకు 1442 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీ

- ప్రక్రియ వేగంగా పూర్తి చేయండి : మంత్రి హరీశ్ రావు

నవతెలంగామ బ్యూరో - హైదరాబాద్

బోధనాస్పత్రుల పరిధిలోని 1,442 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల నియామక ప్రక్రియను ఈ నెలాఖరు వరకు పూర్తి చేయాలని ఆర్థిక, వైద్యారోగ్య మంత్రి హరీశ్ రావు ఆదేశించారు. వెరిఫికేషన్ సహా, ఇతర ప్రక్రియలు పూర్తయిన నేపథ్యంలో తుది ఫలితాలు విడుదల చేసేందుకు అవసరమైన చర్యలను సత్వరం చేపట్టాలని సూచించారు. పేదలకు వైద్య ఖర్చుల భారం లేకుండా చేసి, నాణ్యమైన వైద్యం అందేలా చూడాలన్నారు. మంగళవారం ఆరోగ్యశ్రీ పథకం అమలు, పురోగతిపై హరీశ్‌రావు నెలవారీ సమీక్ష నిర్వహించారు. డీఎంఇ, డీపీహెచ్, టీవీవీపీ పరిధిలోని ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ కింద నిర్వహిస్తున్న చికిత్సలు, శస్త్రచికిత్సల సంఖ్య పెరుగుతుండటం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

2021-22తో పోల్చితే, 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఫిబ్రవరి చివరి వరకు ఈ చికిత్సలు, శస్త్రచికిత్సల సంఖ్య డీఎంఈ పరిధిలో 72,225 నుంచి 1,08,223కు పెరగగా, టీవీవీపీలో 66,153 నుంచి 99,744కు పెరిగాయి. డీపీహెచ్ పరిధిలో కొత్తగా ఆరోగ్యశ్రీ సేవలు ప్రారంభం కావడం వల్ల 14,965 కేసులు నమోదు అయ్యాయి.

ఐకేపీ వీఓఏ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

ఏప్రిల్ 2వరకు ఆన్‌లైన్ పనులు బంద్ : సీఐటీయూ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఐకేపీ వీఓఏల సమస్యలను పరిష్కరించాలనీ డిమాండ్ చేస్తూ మంగళవారం నుంచి ఏప్రిల్ రెండో తేదీ వరకు ఆన్‌లైన్ సేవలను బంద్ చేస్తున్నట్టు ఐకేపీ వీఓఏ ఉద్యోగుల జేఏసీ ప్రకటించింది. ఈ మేరకు సెర్ప్ సీఈఓకు సమ్మె నోటీసును ఐకేపీ వీఓఏ ఉద్యోగుల సంఘం(సీఐటీయూ అనుబంధం) సమ్మె నోటీసును మంగళవారం అందజేసింది. ఈ మేరకు ఆ సంఘం గౌరవాధ్యక్షులు ఎస్వీ రమ, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.రాజ్‌కుమార్, ఎం.నగేశ్, కోశాధికారి సుమలత ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో ఈ నెల 16 నుంచి 18 వరకు మూడు రోజుల పాటు టోకెన్ సమ్మె చేసినా రాష్ట్ర ప్రభుత్వం స్పందించలేదని విమర్శించారు. ఈ నేపథ్యంలోనే మంగళవారం నుంచి ఏప్రిల్ రెండో తేదీ వరకు ఆన్‌లైన్ సేవలను బంద్ చేయాలని నిర్ణయించుకున్నామని తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి కనీసవేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గ్రామ సంఘం గ్రేడింగ్‌తో సంబంధం లేకుండా ప్రతినెలా వీఓఏల వ్యక్తి ఖాతాల్లో వేతనాలు వేయాలని కోరారు. వీఓఏలపై మహిళా సంఘాల ఒత్తిడి ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ఎస్‌హెచ్‌ఓలకు వీఎల్ఆర్, అభయహస్తం డబ్బులు చెల్లించాలని విన్నవించారు. ఎస్‌హెచ్‌జీ, వీఏ లైవ్ మీటింగ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అర్హులైన వీఓఏలకు సీసీలుగా ప్రమోషన్లు కల్పించాలనీ, రూ.10 లక్షల ఆరోగ్య, సాధారణ బీమా సౌకర్యాలను కల్పించాలని కోరారు.

తెలంగాణ ఆడబిడ్డపై ప్రతాపమా? : మంత్రి శ్రీనివాస్‌గౌడ్

న్యూఢిల్లీ : తెలంగాణ ఆడబిడ్డ కవితపై ప్రతాపం చూపిస్తారా? కక్షసాధింపు చర్యలకు పాల్పడతారా? అని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ప్రశ్నించారు. ఢిల్లీ మద్యం పాలసీ కుంభకోణంలో ఎమ్మెల్సీ కవిత సెల్‌ఫోన్లను ధ్వంసం చేశారని గతంలో చేసిన వ్యాఖ్యలను కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి తక్షణమే ఉపసంహరించు కోవాలని డిమాండ్ చేశారు. అంతేగాక ఈడీ విచారణలో భాగంగా మంగళవారం గతంలో ఉపయోగించిన 10 సెల్‌ఫోన్లను ఎమ్మెల్సీ కవిత ఈడీ అధికారులకు సమర్పించినందున... కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి కవితకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మంగళవారం నాడిక్కడ తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర మంత్రి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ గొప్ప గొప్ప మాటలు చెప్పే కిషన్‌రెడ్డి... ఏ ఆధారాలు లేకుండా ఊహించుకొని అబద్ధాలతో ఒక మహిళ ప్రతిష్టను దిగజార్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అవకాశం ఇచ్చారు కదా అని ఇష్టమొచ్చినట్టు మాట్లాడితే తెలంగాణ ప్రజలు సహించరన్న విషయాన్ని కిషన్‌రెడ్డి గుర్తుంచుకోవాలని మంత్రి హితవు పలికారు. తెలంగాణ ఆడబిడ్డ కవితపై తమ ప్రతాపం చూపిస్తున్నారని, కక్ష సాధింపునకు పాల్పడుతున్నారని విమర్శించారు. దేశంలో లక్షల కోట్లు ప్రజాధనాన్ని దోచుకొని విదేశాలకు పారిపోయిన అవినీతిపరులను కేంద్ర ప్రభుత్వం ఎందుకు పట్టుకోవట్లేదో చెప్పాలని డిమాండ్ చేశారు. అంతేగాక లక్షల కోట్లు కొల్లగొట్టిన వారిని వదిలిపెట్టి, ఉల్లిగడ్డపై పొట్టు మాదిరి లాంటి రూ.100 కోట్ల స్కామ్ అనే పేరుతో లేని అధారాలను సృష్టించి కవితను వేధిస్తూ అప్రతిష్టపాలు చేయాలని ప్రయత్ని స్తున్నారని మండిపడ్డారు.

23,24 తేదీల్లో

ఈదురుగాలులతో వర్షాలు!

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో ఈ నెల 23, 24 తేదీల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు ఆయా జిల్లాల్లో పడే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఎక్కువ ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వానలు కురువొచ్చని తెలిపింది. హైదరాబాద్‌లో వచ్చే మూడు రోజుల పాటు ఆకాశం పాక్షికంగా మేఘావృతమై సాయంత్రంపూట తేలికపాటి జల్లులు పడే అవకాశముంది. సముద్ర మట్టం నుంచి 0.9 కిలోమీటర్ల ఎత్తులో దక్షిణ శ్రీలంక నుంచి తమిళనాడు, రాయలసీమ, తెలంగాణ మీదుగా ఈశాన్య మధ్యప్రదేశ్ వరకు ద్రోణి నెలకొంది.

ఉగాది శుభాకాంక్షలు: టీడీపీ అధ్యక్షులు కాసాని

నవతెలంగాణ - హైదరాబాద్

ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని తెలుగుదేశం రాష్ట్ర అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. శోభకృత్ నామ సంవత్సరంలో తెలుగు రాష్ట్రాల ప్రజలందరికి శుభాలు చేకూరాలని ఆకాంక్షించారు. ఇంటిల్లిపాది ఆనందోత్సాహాలతో ఉగాది పండుగను జరుపుకోవాలన్నారు. ఉగాది పండుగ నేపథ్యంలో బుధవారం ఎన్టీఆర్ ట్రస్ట్‌భవన్‌లో పంచాంగశ్రవణం జరుగుతుందని అన్నారు. పార్టీ శ్రేణులంతా హాజరు కావాలని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

మూడు తులాల బంగారం, రూ. 10వేలతో యువకుడు అదృశ్యం



నవతెలంగాణ-వనస్థలిపురం

ఇంట్లో ఎవరికీ చెప్పకుండా మూడు తులాల బంగారం, పదివేలు నగదుతో యువకుడు అదృశమైన సంఘటన వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వనస్థలిపురం సీఐ కే సత్యనారాయణ పర్యవేక్షణలో ఎస్సై పరమేష్ తెలిపిన వివరాలు ప్రకారం బీయన్ రెడ్డి నగర్, ఎస్కేడీ నగర్ నివాసి ఇసావత్ అక్షయ్ కుమార్ వత్తిరీత్యా డ్రైవర్. ఈ నెల 19న మధ్యాహ్నం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బీరువాలో ఉన్న మూడు తులాల బంగారం, పదివేల రూపాయల నగదుతో వెళ్లిపోయాడు. తల్లి భాగ్య చుట్టుపక్క ప్రాంతాలు వెతికి ఫలితం లేకపోవడంతో పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

నిందితులను శిక్షించాలని డీసీపీ కార్యాలయం ముందు ధర్నా

నవతెలంగాణ-హయత్‌నగర్



అబ్దుల్లా పూర్ మెట్ మండలంలో హత్యకు గురైన నవీన్ కుటుంబ సభ్యులకు న్యాయం చేయాలని, నిందితులకు శిక్ష పడే విదంగా చర్యలు తీసుకోవాలని ఎల్బీనగర్ డీసీపీ కార్యాలయం ముందు బాధిత నవీన్ కుటుంబ సభ్యులు మంగళవారం ఆందోళన చేపట్టారు .తదనంతరం విలేకరులతో నవీన్ తల్లిదండ్రులు శంకర్, బుజ్జి లు మాట్లాడుతూ నిందితులకు ఉరిశిక్ష పడేలా చూడాలన్నారు. కానీ నిందితురాలికి బెయిల్ వచ్చిందని తెలిసి తీవ్ర మానసిక క్షోభకు గురయ్యామని ఆవేదన వ్యక్తంచేశారు. ఆమె తండ్రి, ఆమె బావకు కూడా హత్యలో ప్రమేయం ఉందని ఆరోపించారు. గిరిజనులపై జరుగుతున్న దాడులను రాష్ట్ర ప్రభుత్వం అరికట్టాలని లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్య నిర్వాహక అధ్యక్షుడు శంకర్ నాయక్ కోరారు. ఎస్సీ,ఎస్టీ యాక్ట్ లో ఉన్న చట్ట ప్రకారం బాధిత కుటుంబానికి డబుల్ బెడ్ రూమ్ ఇల్లు,నష్ట పరిహారం,ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశా రు. తదనంతరం డీసీపీ సాయి శ్రీకి వినతి పత్రం సమర్పించారు. గిరిజన నేతలు హెరియా,రాజు నాయక్,పంతు నాయక్‌లు ఉన్నారు.

అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయండి

- జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి
- అధికారులతో సమావేశం



నవతెలంగాణ-సిటీబ్యూరో

జీహెచ్ఎంసిలో వివిధ పథకాల ద్వారా అమలు చేస్తున్న అభివృద్ధి పనులను సత్వరమే పూర్తి చేయాలని నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి అధికారులను ఆదేశించారు సోమవారం సాయంత్రం ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్, జోనల్ కమిషనర్ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మేయర్ మాట్లాడుతూ మౌలిక సదుపాయల కోసం చేపట్టిన అసంపూర్తి పనులను వెంటనే పూర్తి చేయాలని అన్నారు. రోడ్డు వెడల్పు కార్యక్రమంలో భాగంగా వేగవంతంగా సేకరణ చేసి రోడ్డు పనులు వేగవంతంగా చేపట్టేందుకు చర్యలుతీసుకోవాలని అధికారులను కోరారు

వివిధ పనులు పెండింగ్‌లో పెట్టకుండా సత్వరమే పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అదేవిధంగా శానిటేషన్ సమర్థ వంతంగా నిర్వహణ స్వచ్ఛ ఆటోల పనితీరును మెరుగుపరచడం కోసం చర్యలు తీసుకోవాలని అదేవిధంగా అంతర్గత రోడ్లను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాలని మేయర్ అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా వచ్చే వర్షాకాలంలో లోతట్టు ప్రాంతాల్లో వరద ముంపు లేకుండా ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చేపట్టిన ఎస్ఎన్‌డీపీ పనులను వెనువెంటనే పూర్తి చేసేందుకు మెన్ మెటీరియల్ పెంచాలని ఇంజనీరింగ్ అధికారులను కోరారు. అదేవిధంగా నూతనంగా మంజూరైన మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్స్ సీఎస్ ఆర్ క్రింద పద్ధతి చేపట్టిన వివిధ రకాల పనులను స వేగవంతంగా పూర్తి చేయాలని అదేవిధంగా చెరువుల సుందరీకరణ కూడా వెంటనే పూర్తి చేసే విధంగా కృషి చేయాలని ఆమె అధికారులను ఆదేశించారు

ఎన్నికల కోడ్ వల్ల ఆశించించిన పనులు పూర్తి కాలేక పోయాయన్నారు. అగ్ని ప్రమాద నివారణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని అదేవిధంగా వ్యాపార సంస్థలు కూడా ఫైర్ సేఫ్టీ ప్రమాణాలను పాటించే విధంగా ప్రత్యేక దృష్టి సారించాలని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి జోనల్ కమిషనర్లను ఆదేశించారు. ఈ సమావేశంలో ఈ ఏన్ సి జియా ఉద్దీన్, సి సిపి దేవేందర్ రెడ్డి, ఆడిషనల్ సిపి శ్రీనివాస్, జోనల్ కమిషనర్లు రవి కిరణ్, శంకర య్య, మమత, పంకజ, శ్రీనివాస్ రెడ్డి, అశోక్ సామ్రాట్ తదితరులు పాల్గొన్నారు.

నగర ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు : మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి నగర ప్రజలకు "శోభకృత్ ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలిపారు. నగర వాసులందరూ ఉగాది పండగను కుటుంబ సభ్యులతో కలిసి ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆకాక్షించారు. నగరంలో అన్ని వర్గాల ప్రజలు సుఖః సంతోషాలతో, ఆనందోత్సాహాలతో ఉండాలని కోరుకున్నారు.

కవి స్వేచ్ఛా జీవిగా సత్యం వైపు నిలబడాలి

- తెలంగాణ సాహితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ఆనందాచారి
- ఉగాది కవి సమ్మేళనం



నవతెలంగాణ-అంబర్‌పేట్

భావ స్వేచ్ఛను కోల్పోతున్న తరుణంలో కవులు క్రాంతిదర్శులు కావాలని, స్వేచ్ఛా జీవిగా సత్యం వైపు నిలబడాలని తెలంగాణ సాహితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ఆనందాచారి అన్నారు. తెలంగాణ సాహితి హైదరాబాద్ నగర కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఉగాది కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ సాహితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనందాచారి ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. కవులు ప్రపంచ గమనాన్ని అర్థం చేసుకోవాలన్నారు. రచనల్లో జీవితాల్ని ప్రతిభించాలన్నారు. తెలంగాణ సాహితి నగర అధ్యక్షులు ఏబూషి నర్సింహ అధ్యక్షతన జరిగిన సభలో ప్రముఖ కవయిత్రి శైలజామిత్ర మాట్లా డుతూ ఉగాది ప్రకతి పండుగని, ప్రకతిని ప్రేమించే సందే శాన్ని ఈ పండుగ మనకు అందిస్తోందని తెలిపారు. మేరెడ్డి రేఖ, ప్రభాకరా చారి ఆధ్వర్యంలో జరిగిన కవి సమ్మేళనంలో 60మంది కవులు తమ స్వీయ కవితలు వినిపించారు. కార్యక్రమంలో చినుకు సంస్థ అధ్యక్షులు పీఎన్ మూర్తి, ప్రముఖ కవి శ్రీనివాస్ గౌడ్, ప్రముఖ కవయిత్రి జ్వలిత, తెలంగాణ సాహితి రాష్ట్ర ఉపాధ్యక్షులు తంగిరాల చక్రవర్తి, అనంతోజు మోహన్ కృష్ణ, సహాయ కార్యదర్శి సలీమ, నగర నాయకులు రామకృష్ణ చంద్రమౌళి, శరత్ సుదర్శి, పేర్ల రాము, ముజాహిద్, మ హేష్, శాంతారావు పాల్గొన్నారు.

సుంకిశాల ప్రాజెక్టు పూర్తయితే 40 ఏండ్లు ధోకా లేదు

- జలమండలి ఎండీ దానకిశోర్



నవతెలంగాణ-సిటీబ్యూరో

రానున్న రోజుల్లో నీటి సంక్షోభం తలెత్తకుండా ఉండాలంటే పొదుపుగా నీటి వాడకంతో పాటు శుద్ధి చేసిన నీరు పునర్వియోగం చేయాలని జలమండలి ఎండీ దానకిశోర్ అన్నారు. ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో ప్రపంచ నీటి దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. నీరు, పారిశుద్ధ్యంలో సంక్షోభాన్ని పరిష్కరించడానికి మార్పును వేగవంతం చేయుట అనే ప్రధానాంశంతో జరిగిన ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎండీ మాట్లాడుతూ దేశంలో తెలంగాణ నూతనంగా ఏర్పడిన రాష్ట్రమని, అయినప్పటికీ ప్రతీ ఇంటికీ తాగు నీరందించిన తొలి రాష్ట్రంగా ఘనతను సొంతం చేసుకుందన్నారు. హైదరాబాద్ మహానగరంలో 99.16 శాతం మంది ప్రజలు జలమండలి సరఫరా చేస్తున్న నీటిని వినియోగిస్తున్నట్టు తెలిపారు. ఈ విషయం స్వయానా కేంద్ర ప్రభుత్వమే చెప్పిందన్నారు. ఈ జులై నాటికి దేశంలోనే వంద శాతం మురుగు నీటిని శుద్ధి చేస్తున్న తొలి నగరంగా హైదరాబాద్ నిలుస్తుందని పేర్కొన్నారు. ఇప్పటికే జలమండలికి వాటర్ డైజెస్ట్ మ్యాగజైన్ ప్రభుత్వ విభాగంలో ఉత్తమ ఎస్టీపీ అవార్డు ఇచ్చిందని, ఆ అవార్డును అందిస్తూ కేంద్ర జల్ శక్తి మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ ప్రశంసించిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ ఘనత సాధించడంలో ముఖ్య పాత్ర పోషించిన ఇంజినీర్లు, అధికారులు, సిబ్బందికి అభినందనలు తెలిపారు. సుంకిశాల ప్రాజెక్టు పూర్తయితే రానున్న 40 ఏండ్ల వరకు నగర ప్రజలకు తాగునీటికి ఎలాంటి ధోకా ఉండదని స్పష్టం చేశారు. నీటిని పొదుపుగా వినియోగించేందుకు పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. నీటి వృథాను అరికట్టడంపై 10 రోజుల పాటు అవగాహన కల్పిస్తామన్నారు. ఇందులో పలు ఎన్జీవోలను భాగస్వామ్యం చేయనున్నట్టు వివరించారు. ప్రజలకు నీటి విలువ తెలియజెప్పేలా ప్రచారం చేసేందుకు 2 వాహనాలు సైతం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. అనంతరం వీటికి సంబంధించిన కరపత్రాలు బోర్డు డైరెక్టర్లతో కలిసి ఆవిష్కరించారు. ప్రచార వాహనాలను ఈడీ సత్యనారాయణ జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఈడీ డా.ఎం. సత్యనారాయణ, ఈఎన్సీ, డైరెక్టర్ ఆపరేషన్స్-1 అజ్మీరా కష్ణ, ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీధర్ బాబు, రెవెన్యూ డైరెక్టర్ వీఎల్. ప్రవీణ్ కుమార్, డైరెక్టర్ ఆపరేషన్స్-2 స్వామి, టెక్నికల్ డైరెక్టర్ రవి కుమార్, రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ ఓఎస్టీ సత్యనారాయణ, బ్రహ్మకుమారీలు అంజలి దేవి, దీదీ శోభాదేవి, సీజీఎంలు, జీఎంలు, డీజీఎంలు, ఎన్జీవోల ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



నాణ్యమైన శిక్షణ మా సొంతం

- టెక్స్ అకాడెమీ మేనేజింగ్ డైరెక్టర్ జహిరుద్దీన్ షేక్
- హైటెక్ సిటీలో 'టెక్స్ అకాడెమీ' ప్రారంభం

నవతెలంగాణ-సిటీబ్యూరో

హైటెక్ సిటీలో 'టెక్స్ అకాడెమీ' నూతన శాఖను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా టెక్స్ అకాడెమీ మేనేజింగ్ డైరెక్టర్ జహిరుద్దీన్ షేక్ మాట్లాడుతూ దిల్‌సుఖ్‌నగర్, అమీర్‌పేట్, గచ్చిబౌలీలో బ్రాంచులున్నాయని తెలిపారు. ఇందులో 5000లకుపైగా విద్యార్థులు శిక్షణ అందించామన్నారు. విద్యార్థులకు ఉద్యోగావకాశాలు వచ్చేవిధంగా క్వాలీటీ ప్రొగ్రామ్స్ అందిస్తున్నామని తెలిపారు. నాణ్యమైన శిక్షణను అందించడమే తమ సంస్థ ముఖ్యఉద్దేశమన్నారు. ట్రెండింగ్ కోర్సులు, డేటా సైన్స్, స్టాక్ డెవలప్‌మెంట్, సేల్స్‌ఫోర్స్, డిజిటల్ మార్కెటింగ్‌తోపాటు తదితర ట్రెండింగ్ కోర్స్‌లకు చెందిన ప్రాజెక్టు ఓరియంటెడ్ ట్రైనింగ్ అందిస్తామని తెలిపారు. ట్రైనింగ్‌తోపాటు విద్యార్థులకు పెయిడ్ ఇంటెర్న్‌షిప్, జాబ్ అసిస్టెన్స్, ఫ్రీ జాబ్ రెడీ స్కిల్స్ ట్రైనింగ్ అందిస్తామన్నారు. నాణ్యమైన విద్యను అందిస్తూ విద్యార్థులకు వివిధ రంగాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించడమే సంస్థ ముఖ్యఉద్దేశమని స్పష్టం చేశారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సత్యకిషోర్, రఘు, వంశీ, భాస్కర్, ప్రతాప్‌తోపాటు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- మంత్రి సబితా ఇంద్రారెడ్డి

నవతెలంగాణ - మీర్ పేట్



ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఎమ్మెల్యేలకు, ఎమ్మెల్సీలకు దిశానిర్దేశం చేశారు. మంగళవారం జిల్లెలగూడలోని ఓ కన్వెన్షన్ హాల్‌లో బీఆర్ఎస్ రంగారెడ్డి జిల్లా శాఖ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ కుటుంబం కనీసం ఒక్కరికైన ఒక పథకంతో లబ్ది పొందారని తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాలతో జిల్లాలో అన్ని స్థాయిలలో పెద్ద ఎత్తున ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించాలని ఆదేశించారు. బీఆర్ఎస్ పటిష్టతకు ఆత్మీయ సమ్మేళనాలు ఎంతగానో దోహదం చేస్తాయని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం అనేక అభివద్ధి సంక్షేమ కార్యక్రమాలతో దేశానికే ఆదర్శంగా నిలిచిందని అన్నారు. పథకాలు విస్తతంగా ప్రచారం చేయాలని, ప్రతిపక్షాల విమర్శలను ఎక్కడిక్కడ తిప్పి కొట్టాలన్నారు. తెలంగాణ మోడల్ పాలనను నేడు దేశ ప్రజలు కోరుకుంటున్నారని ఆ దిశగా అబ్ కి బార్ కిసాన్ సర్కార్ నినాదంతో ముందుకు వెళ్తున్నామని చెప్పారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చిన బీఆర్ఎస్ పార్టీని అధికారంలోకి తెచ్చేందుకు ప్రతీ ఒక్కరూ కషి చేయాలని కోరారు. పార్టీ జిల్లా ఇన్‌చార్జి ఎమ్మెల్సీ ఎల్ రమణ, జిల్లా అధ్యక్షుడు ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి, ప్రభుత్వ విప్ శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ, మూసి రివర్ బోర్డు చైర్మెన్ ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, జెడ్పీ చైర్ పర్సన్ అనిత రెడ్డి, ఎమ్మెల్సీలు పట్నం మహేందర్ రెడ్డి, సురభి వాణీదేవి, దయనంద్, ఎమ్మెల్యేలు ప్రకాష్ గౌడ్, అంజయ్య యాదవ్, జైపాల్ యాదవ్, వివిధ కార్పొరేషన్ల చైర్మెన్‌లు ఆయాచితం శ్రీధర్, ఉప్పల శ్రీనివాస్ గుప్తా, లక్ష్మీ నారయణ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ సత్తు వెంకటరమణ రెడ్డి, డీసీసీబీ, డీసీఎంఎస్ చైర్మన్లు మనోహర్ రెడ్డి, కృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే రత్నం, మాజీ కార్పొరేషన్ చైర్మన్ నాగేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రేయాన్ సైనిక్ స్కూల్ విద్యార్థుల ఉత్తమ ఫలితాలు



నవతెలంగాణ-ఎల్బీనగర్

సైనిక్, నవోదయ పాఠశాలలో విద్యార్థులకు ఉత్తమ శిక్షణ ఇస్తూ విద్యార్థుల భవిష్యత్ కు బంగారు బాటలు వేస్తున్న ఏకైక స్కూల్ రేయాన్ విద్య సంస్థ అని రేయాన్ విద్య సంస్థ చైర్మెన్ జనార్దన్ రెడ్డి తెలిపారు. నవతెలంగాణకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ ఈ సంవత్సరం రేయాన్ విద్యా సంస్థ ఆల్ ఇండియా ఫస్ట్ ర్యాంక్‌తో పాటు అత్యధిక సీట్లలో కోచింగ్‌లో అగ్రస్థానంలో ఉన్నదని ఆయన తెలిపారు. ఆర్ ఐఎంసీలో ఏకైక సీటును తెలంగాణ నుంచి 2022లో సాధించిందన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న ఐదు ఆర్ఎంఎస్ స్కూల్స్ కూడా ప్రతీ సంవత్సరం 4 ఆ పైన సీట్లు సాధిస్తున్నామని ఆయన తెలిపారు. 2023లో నాలుగు సీట్లు వచ్చాయని తెలిపారు. 2023 సంవత్సరంలో కొన్ని వేల మంది విద్యార్థులు సైనిక్, నవోదయ విద్యాలయాలకు ఎంపిక అవుతున్నారని పేర్కొన్నారు. విద్యార్థుల ఉన్నతికి కోసం విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాట వేస్తున్న ఏకైక స్కూల్ రేయాన్ స్కూల్ అన్నారు. రేయాన్ స్కూల్ డైరెక్టర్ ఉమా రెడ్డి మాట్లాడుతూ ఆరవ తరగతి ప్రవేశం తోపాటు తొమ్మిదో తరగతి ప్రవేశాలకు హాజరైన విద్యార్థుల్లో 75 శాతం విద్యార్థులు సైనిక్ స్కూల్ కు ఎంపిక అవుతున్నారని తెలిపారు. లక్షిత్ రెడ్డి తెలుగు రాష్ట్రంలో మూడో ర్యాంకు సాధించారని తెలిపారు. 9వ తరగతి ప్రవేశానికి ఎంపికైన రెహాన్‌కు సైనిక్ విద్యార్థుల ందరికీ అభినందనలు తెలిపారు. అదేవిదంగా విద్యార్థుల తల్లిదండ్రుల పట్టుదలతో ఈ ర్యాంకులను స్వంతం చేసుకొన్నారని కొనియాడారు.

మహిళలు ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉండాలి

- సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి

నవతెలంగాణ - సరూర్ నగర్



గర్భిణులుగా ఉన్న ప్రతీ మహిళ తమ ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉండాలని, పౌష్టిగా ఆహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యవంతమైన పిల్లలు పుడతారని రంగా రెడ్డి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జ్ శ్రీదేవి అన్నా రు. బుధవారం వరల్డ్ డౌన్ సిండ్రోమ్ డే సందర్భంగా జిల్లా వికలాంగుల పునరా వాస కేంద్రం నందు వరల్డ్ డౌన్ సిండ్రోమ్ డే అవగాహన సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా వారు హాజరై మాట్లాడారు. డౌన్ సిండ్రోమ్ చిల్డ్రన్స్ భౌతిక, మానసిక వికాసం గురించి తలిదండ్రులు ప్రాముఖ్యత గురించి వివరించారు. డీడ బ్యూఓ అధికారి మోతి మాట్లాడుతూ డోన్ సిండ్రోమ్ ఒక జెన్యూ సంబంధమైన వ్యాధి అని.. ఈ వ్యాధి గ్రస్తులో క్రోమోజోమ్ 21లో రెండు ఉండాల్సిన పోగులు మూడు ఉంటాయన్నారు. అందువలన దీనిని ట్రిసోమి 21గా పిలుస్తారన్నారు. డౌన్ సిండ్రోమ్ లక్షణాలు , దాని నివారణ గురించి మాట్లాడారు. రాంగరెడ్డి, వినిత దేవి పాల్గొన్నారు.



రంజాన్, శ్రీరామనవమి పండుగల నేపథ్యంలో నగరంలో శాంతిభద్రతల పరిరక్షణపై క్షేత్రస్థాయి పోలీస్ అధికారులతో సీపీ సీవీ ఆనంద్ విడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో మంగళ వారం నిర్వహించిన కార్యక్రమంలో డీసీపీలు, ఏసీపీలు, సీఐలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీపీ పలు సూచనలు, సలహాలను అందించారు.

నవతెలంగాణ-సిటీబ్యూరో

నాగోల్ డివిజన్ అభివృద్ధే లక్ష్యంగా కృషి

- కార్పొరేటర్ అరుణా సురేందర్ యాదవ్

నవతెలంగాణ-నాగోల్



నాగోల్ డివిజన్ అభివృద్ధే తమ లక్ష్యంగా నిరంతరం కృషి చేస్తూ ముందుకు వెళ్తున్నామని నాగోల్ డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణా సురేందర్ యాదవ్ అన్నారు. ఉగాది సందర్భంగా వారు నవతెలంగాణతో ప్రత్యేకంగా మాట్లాడారు. ముందుగా నాగోల్ డివిజన్ ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలియ జేస్తూ ఈ సంవత్సరం అంతా సుఖ సంతోషాలతో ఉండాలని వారు ఆకాంక్షించారు. ఈ రెండు సంవత్స రాలలో రూ. 18 కోట్ల నిధులతో ఎస్ఎన్‌డీపీ, ఎస్ఆర్‌డీపీ తదితరు ప్రాజెక్టుల ద్వారా డివిజన్‌లోని భూగర్భ డ్రయినేజీలు, సీసీ రోడ్ల నిర్మాణాలు చేపట్టడం జరిగిందని తెలిపారు. 2019 సంవత్సరంలో కురిసిన భారీ వర్షాల వల్ల డివిజన్‌లోని కొన్ని కాలనీలు వరద ముంపునకు గురై తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని దాంతో బండ్ల గూడ చెరువు నుంచి నాగోల్ చెరువుకు, నాగోల్ చెరువు నుంచి మూసీ నదిలోకి వెళ్లేందుకు ప్రత్యేకంగా బాక్స్ డ్రయినేజీ నిర్మాణాన్ని చేపట్టడం జరిగిందని తెలిపారు. మూసి పరిసరాలలో కొన్ని కాలనీలు ఉన్నాయని వాటిలో ఇంకా మౌలిక వసతులను, సీసీ రోడ్లు భూగర్భ డ్రయినేజీ ఏర్పా టు చేయాల్సి ఉందన్నారు. ఆ కాలనిలలో కూడా తగిన ప్రతిపాదనలు తయారుచేసి ప్రభుత్వానికి నివేదించి వాటి అభివద్ధికి కషి చేస్తామని తెలిపారు. వీటితోపాటు డివిజన్‌లోని మరికొన్ని కాలనీలు కూడా సీసీ రోడ్డు అండర్ డ్రయినేజీ నిర్మాణాలు చేయాలని, అవి కూడా పరిష్కరించేందుకు ప్రయత్నిస్తామని చెప్పారు. త్వరలో నాగోల్ చెరువు, పత్తుల గూడా చెరువులను సుందరీకరణ చేసి వాకింగ్ ట్రాక్లను కూడా ఏర్పాటు చేయనున్నట్టు పేర్కొ న్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా నాగోలు డివిజన్‌లో మూడు మతాలకు సంబంధించిన ముక్తిగాటును ఏర్పాటు చేయడం ఆశించదగ్గ విషయమని అన్నారు. నాగోలు డివిజన్‌లో అంతర్గత రోడ్లే కాకుండా ఫ్లైఓవర్ బ్రిడ్జిని ఏర్పా టు చేయడంతో డివిజన్ అభివృద్ధి ఎంతో ముందుకు వెళుతుందని చెప్పారు. కొన్ని కాలనీల్లో ప్రెషర్ వల్ల తాగునీటి సమస్య నెలకొంటుందని దాంతో సంబంధిత అధికారుల దృష్టికి కూడా తీసుకెళ్లడం జరిగిందని త్వరలో ఆయా కాలనీలో ఆ సమస్యను పరిష్కరి స్తామని హామీ ఇచ్చారు. నిరంతరం డివిజన్ అభివృద్ధే ధేయంగా కాలనీల్లో పర్య టిస్తూ ప్రజలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకుని సాధ్యమైనంత వరకు పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. ఎన్నికల వరకే రాజకీ యాలను పరిమితం చేస్తూ ఒక కాంగ్రెస్ ఎంపీ, ఒక బీ ఆర్ఎస్ ఎమ్మెల్యేతో ఒక బీజేపీ కార్పొరేటర్‌గా కలిసి డివిజన్ అభివృద్ధికి కావాల్సిన నిధులను మంజూరు చేయించుకుంటున్నామన్నారు. నాగోల్ డివిజన్ అభివద్ధికి ,డివిజన్ ప్రజల సంక్షేమే లక్ష్యంగా కృషి చేస్తూ ముందుకు వెళ్తున్నామన్నారు.



ఫైల్‌ఫోటో

సీఎం సహాయనిధి చెక్కు అందజేత



నవతెలంగాణ-తుర్కయాంజల్

బీఆర్ఎస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలు పేదలకు అండగా నిలుస్తున్నాయని, సీఎం సహాయనిధి పథకం నిరుపేదల పాలిట వరంగా మారిందని డీసీసీబీ వైస్ చైర్మెన్ కొత్తకుర్మ సత్తయ్య అన్నారు. తుర్కయంజాల్ మున్సిపాల్టీ పరిధి 10వ వార్డుకు చెందిన గంధం శమంతకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు రూ.60వేలను మాజీ సర్పంచ్ చెవుల దశరథ ఆధ్వర్యంలో సత్తయ్య అందజేశారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పుల్లగుర్రం విజయానంద్ రెడ్డి, గుండా ధనరాజ్, కొంతం యాదిరెడ్డి, చెక్క బాల నర్సింహ, కొమ్మని దయానంద్, చెక్క రఘు, మేతరి శంకర్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

అభయాంజనేయ స్వామి ఆలయంలో ఘనంగా పండుగలు

- ఆలయ కమిటీ ఉపాధ్యక్షులు వెంకటేష్‌గౌడ్, ప్రధానార్చకులు నారాయణాచార్యులు



నవతెలంగాణ - కూకట్‌పల్లి

కూకట్‌పల్లి ఆల్విన్ కాలనీ ఫేస్ 1లోని శ్రీ అభయాంజనేయ రామలింగేశ్వర స్వామి ఆలయంలో ఉగాది, దసరా లాంటి మహా పర్వదినాలను ఘనంగా నిర్వహిస్తామని ఆలయ కమిటీ ఉపాధ్య క్షులు వెంకటేష్‌గౌడ్, ప్రధానార్చకులు నారాయణాచార్యులు అన్నారు. ఉగాది పర్వదినం పురస్కరించుకుని తెలుగు నూతన సంవత్సరం శోభాకత్ నామ ఉగాది శుభాకాంక్షలు తెలుపుతూ వారు. నవతెలంగాణ ప్రతినిధి తో మాట్లాడారు. శ్రీ అభయాంజనేయ రామలింగేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారు విశేష పూజలు అందుకుంటున్నారని తెలిపారు. 1995వ సంవత్సరం జూన్ 8వ తేదీన అభయాం జనేయ స్వామి ప్రతిష్టాపన జరిగిందన్నారు. ఆ తరువాత 2010 ఏప్రిల్ 4 వ తేదీన అంగరంగ వైభవంగా రామలింగేశ్వర స్వామి ప్రతిష్టాపన జరిగిందని వివరించారు. శివ రాత్రి, హనుమాన్ జయంతి ,ఉగాది, దసరా లాంటి మహా పర్వదినాల రోజున ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసి పోతుందని, దసరా పండగ రోజున శమ్మి పూజ ఆలయంలో నిర్వహించి సరస్వతి శిషమందిర్‌లో రావణ దహణ కార్యక్రమం చేపడతామని తెలిపారు. అలాగే శ్రీరామ నవమి రోజున సీతారాముల కళ్యాణ మహోత్సవం కన్నుల పండువగా నిర్వహిస్తామని చెప్పారు. కళ్యాణ మహోత్సవానికి కాలనీ వాసులతో పాటు పరిసర బస్తీ వాసులందరు బంధువులుగా వచ్చి కళ్యాణ మహోత్సవాన్ని తిలకిస్తారని తెలిపారు.

అలాగే అర్చకులు నారాయణాచార్యులు మాట్లాడుతూ ఆల్విన్ కాలనీ లో అభయాంజనేయ స్వామి, రామలింగేశ్వర స్వామి వార్ల దేవాలయంలో ప్రతీ పండుగ వైభవోపేతంగా నిర్వహిస్తామని తెలిపారు. గత తెలుగు సంవత్సరంలో అన్ని శుభాలే జరిగాయని,అదే విధంగా రాబోయే నూతన సంవత్సరం శోభాకత్ నామ సంవత్సరం సందర్భంగా మహా వైభవోపేతంగా ఈ ఆలయంలో కార్యక్రమాలు నిర్వహిస్తామని వివరించారు. ఉదయమే అభిషేకాలు, అర్చనలు, ఆకు పూజలు, జరుగుతాయని, సాయంత్రం వేళల్లో భక్త జన సందోహం నడుమ పంచాంగ శ్రవణ పఠనం ఉంటుందన్నారు. షడ్రుచులతో ఉగాది పచ్చడి చేసి స్వామి వార్లకు నైవేద్యం సమర్పించి ప్రజలందరూ సేవించడం సాంప్రదాయంగా వస్తుందని, ఈ విధంగా ఉగాది పచ్చడి సేవించడం అందరికీ ఆరోగ్య దాయకం అని వివరించారు. ఆలయ ప్రధాన కార్యదర్శి బి,వెంకట స్వామి, కోశాధికారి, జె,నర్సిం హ రెడ్డి, కార్య వర్గ సభ్యులు సాంబయ్య చారి, సోమయ్య గౌడ్, శివ కుమార్, సునీల్, డీ స్వామి, అర్చకులు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

స్టాండింగ్ కమిటీ సమావేశంలో 23 అంశాలకు ఆమోదం



నగర్ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధ్యక్షతన మంగళవారం జరిగిన స్టాండింగ్ కమిటీ సమావేశం మొత్తం 23 అంశాలకు ఆమోదం జరిగింది. అందులో ఎస్.ఆర్.డి.పీ రోడ్డు వెడల్పునకు కమిటీ ఆమోదం తెలిపింది. స్టాండింగ్ కమిటీ సభ్యులైన శాంతి సైజే శేఖర్, సయ్యద్ మినహాజుద్దిన్, సయ్యద్ సోహెల్ ఖాద్రి, శమీన బేగం, అబ్దుల్ వహాబ్, ముహమ్మద్ అబ్దుల్ ముఖద్దర్, మహమ్మద్ మాజీద్ హుస్సేన్, మహమ్మద్ రషీద్ ఫరజుద్దిన్, బండారి రాజ్ కుమార్, సంగీత యాదవ్, నరేందర్ యాదవ్, సతీష్ బాబు పండాల, ఇ.ఎస్ రాజ్, జితేందర్ నాథ్, ఆర్. సునీత, టీ మహేశ్వరి, కమిషనర్ డి.ఎస్ లోకేష్ కుమార్, ఈవిడియం ప్రకాష్ రెడ్డి, ఈ.ఎన్.సి జియా ఉద్దీన్, సి ఈ దేవానం ద్, అడిషన్స్ కమిషనర్లు ప్రియాంక అలా, వి.కృష్ణ, జయరాజ్ కెన్నెడీ, విజయ లక్ష్మి, సరోజ, ఓ.ఎస్.డి సురేష్ కుమార్, సి సి పీ దేవేందర్ రెడ్డి, అడిషనల్ సి సి పీ శ్రీనివాస్, అకౌంట్ చీఫ్ ఎగ్జామినర్ వెంకటేశ్వర రెడ్డి, వెటర్నరీ చీఫ్ డా. అబ్దుల్ వాకిల్, చీఫ్ ఎంటమాలోజి డాక్టర్ రాంబాబు, జోనల్ కమిషనర్ మమత, పంకజ, రవికిరణ్, శంకరయ్య, శ్రీనివాస్ రెడ్డి, సెక్రెటరీ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఆమోదం పొందిన అంశాలు

కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద శేర్లింగంపల్లి జోన్ లో గచ్చిబౌలి నుండి జిపిఆర్ఎస్ క్వార్టర్స్ మీదుగా బ్రహ్మకుమారి సర్కిల్ 20లో గల సెంట్రల్ మీడియన్ సుందరీకరణ కోసం మూడేండ్ల పాటు గమన్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ వారు తమ సొంత నిధులతో నిర్వహణ చేసేందుకు ముందుకు వచ్చిన నిర్వాహకులతో శేర్లింగంపల్లి జోనల్ కమిషనర్ కు ఎంఓయు చేసుకునేందుకు అనుమతికి కమిటీ ఆమోదం. అలాగే 18 మీటర్ల రోడ్డు వెడల్పునకు గాను ఖాజా మెన్షన్ ఫంక్షన్ హాల్ అప్రోచ్ రోడ్ నుండి అహ్మద్ నగర్, ధన బాల రెసిడెన్సి నుండి సరోజినీదేవి రోడ్డు వరకు లింక్ రోడ్డు ఏర్పాటుకు 178 ఆస్తులు సేకరణకు కమిటీ ఆమోదం. డిసెంబర్,,2022 మాసం లో వచ్చిన ఆదాయ వ్యయాలను చీఫ్ ఎగ్జామినర్ అకౌంట్స్ కమిటీ తెలియజేసి ఆమోదం పొందారు. రోడ్డు డెవలప్మెంట్ ప్లాన్ కింద హెరిటేజ్ బిల్డింగ్ నుండి భారతీయ విద్యా భవన్ 12 మీటర్ల రోడ్డు, హెరిటేజ్ బిల్డింగ్ నుండి కింగ్ కోఠి వరకు, సెయింట్ జోసెఫ్ డిగ్రీ కాలేజ్ నుండి తిరిగి కింగ్ కోఠి వరకు ప్రతిపాదిత రోడ్డు వెడల్పు చేయుట కోసం 29 ఆస్తులు సేకరణకు కమిటీ ఆమోదం.ఎన్ఐఏ నుండి డిసిసి క్రికెట్ గ్రౌండ్ వరకు రోడ్డు వెడల్పునకు 14 ఆస్తుల సేకరణకు కమిటీ ఆమోదం తెలిపింది. ఇక రెయిన్ బజార్ చమాన్ నుండి అనుమోల్ హోటల్ ఫతేష నగర్ జంక్షన (జోహర భీ దర్గా) వరకు 30 మీటర్ల రోడ్డు వెడల్పునకు గానూ 136 ఆస్తుల సేకరణలకు కమిటీ ఆమోదించింది. కుత్బుల్లాపూర్ రోడ్డు నుంచి పైప్ లైన్ మధ్య లింక్ రోడ్ వయా గోదావరి హోమ్స్ వరకు 18 మీటర్ల రోడ్డు ప్రభుత్వానికి తెలియ జేస్తూ మాస్టర్ ప్లాన్లు చేర్చుట కోసం 68 ఆస్తులు సేకరణకు కమిటీ ఆమోదం తెలిపింది. ఇక రోడ్డు డెవలప్మెంట్ ప్లాన్ కింద కల్వరి టెంపుల్ నుండి హఫీజ్పేట్ మంజీరా పైప్ లైన్ పాయింట్ రోడ్డు వరకు 2, గ్రేవ్ యార్డ్ నుండి బాంబే హైవే వయా 2 బీహెచ్కే మీదుగా హఫీజ్ పేట్ చెరువు 18 మీటర్ల రోడ్ల వెడల్పునకు, వెస్ట్రన్ సైడ్ గల మేడికుంట చెరువు నుండి నేషనల్ హైవే 9 బాంబే హైవే వయా మాతృశ్రీ నగర్ 12 మీటర్ల రోడ్డు వెడల్పునకు ఇట్టి రోడ్డు వెడల్పునకు మొత్తం 98 ఆస్తుల సేకరణకు కమిటీ ఆమోదం. సరూర్ నగర్ సర్కిల్ 5 వార్డు 19, 21 విజయపూరి కాలనీ రోడ్ నెం 2 (ఎవీ% హోమ్ కాంపౌండ్ వాల్) నుండి ఎస్ఆర్కాలనీ వరకు రూ. 598 లక్షల వ్యయంతో చేపట్టే స్ట్రామ్ వాటర్ నాలా నిర్మాణానికి టెండర్స్ పిలవడానికి పరిపాలన అనుమతికి కమిటీ ఆమోదం.

కూకట్ పల్లి జోన్ సనత్ నగర్ వార్డ్ నెంబర్ 100 కే ఎల్ ఎన్ వై పార్క్ పునరుద్ధరణ పనులు రూ.241.80 లక్షల పరిపాలన ఆమోదానికి కమిటీ ఆమోదం తెలిపింది. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద శేర్లింగంపల్లి జోన్ కొండాపూర్ గార్డెన్ నుండి బొటానికల్ గార్డెన్ నుండి మాజీద్ బండ వరకు సెంట్రల్ మీడియం/ ట్రాఫిక్ ఐలాండ్ ను మార్చి 2023 నుండి ఫిబ్రవరి 2026 వరకు చీరెక్ ఇంటర్నేషనల్ స్కూల్ శేర్లింగం జోన్ కమిషనర్ కు ఎంఓయు అనుమతి కమిటీ ఆమోదించింది. అలాగే కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలి కింద శేర్లింగంపల్లి జోన్ జయభేరి ఎంక్లేవ్ నుండి రేడిసన్ హోటల్ మీదుగా డిఎల్ఎఫ్ సైబర్ సిటీ వరకు గ్రీన్ బెల్ట్ ఏర్పాటు చేసేందుకు మార్చి 2023 నుండి ఫిబ్రవరి 2026 వరకు డిఎల్ఎఫ్ ఫౌండేషన్ సొంత నిధులతో నిర్వహణ చేసేందుకు శేర్లింగంపల్లి జోన్ కమిషనర్ కు ఎంఓయుకు అనుమతికి కమిటీ ఆమోదం తెలిపింది. ఎస్.ఆర్.డి.పి ద్వారా పాత చత్రిఖానా పోలీస్ స్టేషన్ నుండి ఉప్పుగూడ మహంకాళి టెంపుల్ వరకు రూ.2.50 కోట్ల వ్యయంతో 60 ఫీట్ల సి.సి రోడ్డు తో పాటుగా ఫుట్ పాత్ నిర్మాణానికి కమిటీ ఆమోదం తెలిపింది

అరోరా కాలేజీలో ఘనంగా ఉగాది సంబరాలు



నవతెలంగాణ-బోడుప్పల్

పర్వతాపూర్‌లోని అరోరా టెక్నాలజికల్ అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ కాలేజీలోని స్టూడెంట్ ఆక్టివిటీ కమిటీ, ఫెస్టివల్స్ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో తెలుగు సంవత్సరాది ఉగాది పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ శ్రీకాంత్ జట్ల, వివిధ విభాగాధిపతులు కళాశాల విద్యార్థులకు శ్రీ శోభకృత్ నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. తదనంతరం డైరెక్టర్ శ్రీకాంత్ జట్ల మాట్లాడుతూ తెలుగు వారంతా ఎంతో భక్తి శ్రద్ధలతో పండుగను జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందని కాబట్టి ప్రతి ఒక్కరూ తెలుగు సాంప్రదాయాలని పాటించాలని తెలిపారు. ఈ సంబరాల్లో భాగంగా విద్యార్థులు ఉగాది పచ్చడి తయారు చేసి అందరికీ అందజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ఆటపాటలు, నృత్యాలతో అలరించారు. ఈ కార్యక్రమంలో హ్యూమానిటీస్ అండ్ అప్లైడ్ సైన్సెస్ విభాగాధిపతి డాక్టర్ అజయ్ కుమార్, సాక్ కోఆర్డినేటర్ శ్రవణ్ కుమార్‌రెడ్డి ,ఫెస్టివల్స్ కోఆర్డినేటర్ సుప్రియ, కళాశాల అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్‌బీహెచ్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

వినాయక్ నగర్ డివిజన్ పరిధిలోని ఎన్ బీ హెచ్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. కార్పొరేటర్ శ్రీమతితో సమావేశం రాజ్యలక్ష్మి, ఎన్‌బీహెచ్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ కొత్తగా ఎన్నికైన కమిటీ, అధ్యక్షుడుగా జీఆర్ విజయ్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా ఎల్లయ్యకోశాధికారిగా ఎంఆర్. ప్రతాపన్, ఉపాధ్యక్షు డుగా శివచరణ్ సింగ్, జాయింట్ సెక్రటరీలుగా వెంకటేష్, సత్యనారాయణ, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా బాలాజీ, శ్రీనివాస్, నాగేశ్వరరావు ఎన్నికైనారు. ఈ సందర్భంగా నూతన కమిటీ నాయకులు, డివిజన్ కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి ని మర్యాద పూర్వకంగా కలిశారు. వారికి కార్పొరేటర్ శుభాకాంక్షలు తెలియజేశారు.

దళిత హక్కుల పోరాట సమితి గోడపత్రిక ఆవిష్కరణ

నవతెలంగాణ-కాప్రా



దళిత హక్కుల పోరాట సమితి డిహెచ్‌పీఎస్ తెలంగాణ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఈసీఐఎల్ సీపీఐ నీలం రాజశేఖర్ రెడ్డి భవన్లో ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు యేసు రత్న గోడపత్రికను విడుదల చేశారు. దళితులపై జరుగుతున్న అన్యాలను అరికట్టాలని ఆయన పిలుపునిస్తూ 31 తారీఖున ఓయూలో మహాసభలను జయప్రదం చేయాలని యావత్ మేడ్చల్ జిల్లా నుండి దళిత సోదరులందరూ రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి మేడ్చల్ జిల్లా నుండి అధ్యక్షులు జి.లక్ష్మీనారాయణ, కార్యదర్శి కాపుక సహదేవ్, సహాయ కార్యదర్శి చిలుముల మహేష్, మరియు దర్శనం యాదగిరి, అశోక్, ఆనంద్‌రావు, ఎల్లన్న, ఎల్లయ్య, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ కల్పన కాంటేపై చర్యలు తీసుకోండి

- ప్రజారోగ్య సంచాలకులు శ్రీనివాస్‌రావుకు ముజీబ్ ఫిర్యాదు



నవతెలంగాణ-సిటీబ్యూరో

టీఎన్జీవోస్ యూనియన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎస్.ఎం.హుస్సేని(ముజీబ్) ఆధ్వర్యంలో మంగళవారం ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ సంచాల కులు డాక్టర్ గడాల శ్రీనివాసరావుని కలిసి జిల్లా క్షయ వ్యాధి అధికారిని డాక్టర్ కల్పన కాంటేపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు డీహెచ్‌కు డాక్టర్ ముజీబ్ వినతి పత్రం అందజేశారు. రెండు నెలల క్రితం ఇచ్చిన ఫిర్యాదు మేరకు ప్రభుత్వం నుంచి డాక్టర్ కల్పన కాంటే పై దర్యాప్తు చేసి నివేదిక పంపాలని, దీనిపై వెంటనే స్పందించాలని ప్రత్యేకంగా కోరారు. ఉద్యోగుల పట్ల డాక్టర్ కల్పనా కాంటే ప్రవర్తనలో మార్పు లేదని, వారిపై ఫిర్యాదు చేసినందుకు మరింత కఠినంగా ఉద్యోగుల పట్ల వ్యవహరిస్తుందని, సదరు మహిళా ఉద్యోగి డాక్టర్ కల్పన బాధ తట్టుకోలేక సోమవారం రాత్రి హార్ట్ ఎటాక్‌తో ప్రయివేట్ ఆస్పత్రిలో అడ్మిట్ అయ్యిందని చెప్పారు. తక్షణమే విచారణ అధికారిని నియమించి దర్యాప్తు చేయాలని, అప్పటివరకు ఆమె నుంచి డ్రాయింగ్, డిస్బర్సింగ్ పవర్స్ తీసేసి వేరే అధికారిని నియమిం చాలని కోరారు. దీనిపై డాక్టర్ గడాల శ్రీనివాసరావు సానుకూలంగా స్పందిస్తూ.. డాక్టర్ కల్పన కాంటేపై తక్షణ మే చర్యలు చేపడతామని, ఉద్యోగులు తమ విధులను సక్రమంగా నిర్వహించాలని, ప్రభుత్వం ఎల్లప్పుడూ ఉద్యోగుల శ్రేయస్సు కోసమే పనిచేస్తుందని తెలిపారు.

వెంటనే నీటి సమస్యలు పరిష్కరించాలి

నందికంటి శ్రీ ధర్



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

నీటి సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ మంగళవారం కాంగ్రెస్ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు నంది కంటి శ్రీధర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ధర్నా చేశారు. సైనిక్ పురి చౌరస్తా లోని మహాత్మా జ్యోతి భాపూలే విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అక్కడి నుంచి ఆయన ర్యాలీగా జలమండలి కార్యాలయానికి చేరి, ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన జలమండలి జనరల్ మేనేజర్ ను కలిసి కాలనీవాసుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నందికంటి శ్రీధర్ మాట్లాడుతూ... గత 16 రోజులుగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన హాత్ సే హాత్ జోడో అభియాన్ యాత్రలో 133వ డివిజన్ పరిధిలోని రాజీవ్ గృహకల్ప, వాంబే కాలనీల లో స్థానికులు నీటి సమస్యలు పరిష్కారం చేయాలని స్థానికులు కోరినట్లు చెప్పారు. వారి సమస్యల పరిష్కారం కోసమే కాంగ్రెస్ పార్టీ జలమండలి కార్యాలయం వద్ద ధర్నా చేసినట్టు తెలిపారు. రాజీవ్ గృహకల్ప వాంబే కాలనీలో ఒక్క రూపాయి నల్లా కలెక్షన్లు వెంటనే ఇవ్వాలని,అదే విధంగా కాలనీలలో వెంటనే నల్లా కలెక్షన్లను ఇచ్చి నీటి బాధలు లేకుండా చేయాలన్నారు. అలాగే భరత్నగర్‌లో బోర్ వెల్ రిపేరు చేయించి నీటి సరఫరా పునరుద్ధరించాలని కోరారు. నిరంతరాయంగా నీటి సరఫరా చేయాలని ఆరన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

'రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం అన్ని మతాలకు ప్రాధాన్యం ఇస్తుంది'



నవతెలంగాణ-కాప్రా

పవిత్ర రంజాన్ పండుగను పురస్కరించుకుని మీర్‌పేట్ హెచ్‌బి కాలనీ డివిజన్ పరిధిలోని 500 మంది ముస్లిం సోదరులకు ఇనాయ ఎడ్యుకేషన్ అండ్ చారిటబుల్ ట్రస్టు ద్వారా 25 కిలోల బియ్యం మరియు నెల రోజులకు సరిపడ సరుకులు పంపిణీ చేసే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్ హాజరయ్యారు. పవిత్ర రంజాన్ పండుగను పురస్కరించుకుని మీర్‌పేట్ హెచ్‌బి కాలనీ డివిజన్ పరిధిలోనీ 500 మంది ముస్లిం సోదరులకు ఇనాయ ఎడ్యుకేషన్ అండ్ చారిటబుల్ ట్రస్టు ద్వారా 25కిలోల బియ్యం మరియు నెలరోజులకు సరిపడ సరుకులు పంపిణీ చేసే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్ హాజరయ్యారు. అనంతరం ప్రభుదాస్ మాట్లాడుతూ రంజాన్ శుభాకాంక్షలు తెలియజేస్తూ ఈ ట్రస్టు వారు ముస్లిం పేదలకు బియ్యం మరియు సరుకులు పంపిణీ చేయడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం అన్ని మతాలకు ప్రాధాన్యం ఇస్తుందని, ముస్లిం సోదర, సోదరీమణులకు మసీదుల్లో రంజాన్ కానుకలు పంపిణీ చేస్తూ అధికారికంగా పండగలు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ మైనారిటీ అధ్యక్షులు మహ్మద్ బద్రుద్దిన్, స్థానిక నాయకులు, మైనారిటీ సోదరులు పాల్గొన్నారు.

ఏప్రిల్ 3వరకు పోషన్ పక్వాడా-2023

జిల్లా సంక్షేమాధికారి అక్కేశ్వర రావు



నవతెలంగాణ-సిటీబ్యూరో

జిల్లా మహిళా, శిశు, వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఐదవ పోషణ్ పక్వాడా-2023 కార్యక్రమాలను ఈ నెల 20 నుంచి ఏప్రిల్ 3 వరకు నిర్వహిస్తున్నట్లు జిల్లా సంక్షేమ శాఖ అధికారి ఈ.అక్కేశ్వర రావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఛాంబర్‌లో సీడీపీవోలు, సూపర్‌వైజర్లు, పోషన్ అభియాన్ బ్లాక్ కో-ఆర్డినేటర్లు, జిల్లా కో-ఆర్డినేటర్ భరత్, ఈవో శైలజ తదితరులతో పోషణ్ పక్వాడా-2023 కార్యక్రమంపై సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జన్ ఆందోళన్, జన్ భగీదారి ద్వారా పోషకాహారం ప్రాముఖ్యత గురించి అవగాహన పెంచడం, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను ప్రోత్సహించడం పక్వాడా లక్ష్యమని.. మిల్లెట్లను ఆహారంగా తీసుకోవడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలపై గర్భిణులకు, ప్రజలకు పక్షం రోజులపాటు అవగాహన కల్పించాలని తెలిపారు.

ఈస్ట్ మారేడ్‌పల్లిలో షెనాయ్ హాస్పిటల్స్ ఈఎన్‌టీ కేంద్రం ప్రారంభం



నవతెలంగాణ-కంటోన్మెంట్

ఈస్ట్ మారేడుపల్లి షెనాయ్ నర్సింగ్ హోమ్ మంగళవారం డాక్టర్ దీన్‌దయాల్ ఆధ్వర్యంలో ఈఎన్‌టి కేంద్రం ప్రారంభమైంది. అల్ట్రామోడరన్ సాంకేతికతతో అత్యాధునికమైన ఈఎన్టీ కేర్ సెంటర్ను డాక్టర్ దీన్‌దయాల్ ప్రారంభించారు. నాలుగు దశాబ్దాల సుదీర్ఘ అనుభవంతో డాక్టర్ దీన్‌దయాల్ ఈఎన్‌టి, ఆడియాలజీ మరియు స్పీచ్ స్పెషాలిటీలకు చెందిన వివిధ సబ్-స్పెషలిటీ నిపుణులతో కలిపి, ఈ నూతన కేంద్రం ద్వారా ఈఎన్టీ వైద్యంలో రోగులకు ప్రపంచస్థాయి ప్రామాణిక సంరక్షణను అందిస్తారు అని డాక్టర్ చెప్పారు. షెనాయ్ హాస్పిటల్స్ మొదటి అంతస్తులో 4000 చదరపు అడుగుల సువిశాలమైన విస్తీర్ణంలో ఏర్పాటైన ఈ నూతన సెంటర్లో మల్టిపుల్-కన్సల్టేషన్ రూమ్‌లు, ట్రీట్మెంట్ రూమ్స్, ఆడియాలజీ రూమ్స్, ఎండోస్కోపి రూమ్, ఆపరేషన్ థియేటర్లు మరియు ఇన్ పేషెంట్ రూమ్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సున్నితమైన మైక్రో ఇయర్ సర్జరీలను నిర్వహించడం కోసం సెంటర్లో అధునాతనమైన స్పైస్ కెమెరా సిస్టమ్లు జర్మన్ మైక్రోస్కోప్‌లు ఉన్నాయి. ఈఎన్టీ హెడ్ అండ్ నెక్ కోసం ప్రత్యేకంగా తక్కువ రేడియేషన్‌ను కలిగించే సీటీ మెషీన్ గొంతు, స్వరపేటిక, చెవి మరియు ముక్కు చివరలో ఉండే పైకి కనిపించని భాగాలను చేరుకోవడానికి అధునాతన డయాగ్నస్టిక్ సాఫ్ట్‌వేర్ సౌకర్యవంతమైన ఎండోస్కోప్‌లతో డయాగ్నొస్టిక్ టూల్స్ ఏర్పాటు చేసుకున్నట్లు డాక్టర్ దీన్‌దయాల్ వివరించారు. చెవి, గొంతు, ముక్కు వ్యాధులపై నిర్లక్ష్యం చేయకూడదని ఈ సందర్భంగా వివరించారు. ఒకప్పుడు ఈ వ్యాధులను నిర్ధారించడానికి చాలా కష్టసాధ్యమైందని, ఇప్పుడు అత్యధిక టెక్నాలజీతో క్షణాలలో ఈ వ్యాధిని నయం చేయగలుగుతున్నామని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి వైద్య బృందాలు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కాష్యపిరెడ్డి జన్మదినోత్సవం

నవతెలంగాణ-కాప్రా



మాజీ కార్పొరేటర్ పజ్జూరి పావని మణిపాల్‌రెడ్డి కుమార్తె కాష్యపిరెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని చర్లపల్లిలో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తరగతి గదులకు అవసరమైన ఫ్యాన్లు, విద్యార్థులకు వాటర్ బాటిళ్లను పంపిణీ చేయడం జరిగింది. అనంతరం ప్రపంచ అటవీ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా పావని మణిపాల్ రెడ్డి మాట్లాడుతూ తమ కుటుంబసభ్యులంతా పుట్టినరోజు వేడుకలను సేవా కార్యక్రమాలతోనే నిర్వహించడం జరుగుతుందని అన్నారు. అదేవిధంగా తమ వంతు బాధ్యతగా పిల్లలకు కూడా సేవా భావాన్ని పెంపొందించేందుకు పుట్టినరోజు వేడుకలను ఇలా జరుపుకోవడం జరుగుతుందని అన్నారు. తన భర్త మణిపాల్‌రెడ్డి సేవా కార్యక్రమాలను నిర్వహించేందుకు కమలానగర్ స్ఫూర్తి లైన్స్ క్లబ్‌ను స్థాపించి సేవా కార్యక్రమాలను నిర్వహించడం జరిగిందని అన్నారు. మణిపాల్ రెడ్డి తమతో లేకపోవడం తమ కుటుంబానికి తీరనిలోటు అని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కుమారస్వామి, ఏనుగు మంజుల-సీతారామరెడ్డి, వంజిరి ప్రవీణ్, చెప్యాల నాగేశ్వర్రెడ్డి, సింగం రాజు, కుందనపల్లి నరసింహ, మట్టా రాజేశ్వర్ రెడ్డి, పెంచాల సురేందర్ రావు,గోవర్ధన్, ప్రధానోపాధ్యాయురాలు శోభారాణి, విజయ్ కుమార్ తదితరులు ఉన్నారు.

ఆలయ నిర్మాణానికి ఆర్థిక సహాయం

బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్



నవతెలంగాణ-నాచారం

మల్లాపూర్ డివిజన్ పరిధిలోని సూర్య నగర్ ప్రధాన రహదారి సుభాష్ నగర్ యాదవ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా చేపడుతున్న మల్లన్న స్వామి ఆలయ నిర్మాణానికి బిఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు బండారి లక్ష్మారెడ్డి లక్ష రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని నిరుపేద విద్యార్థుల ఉన్నత విద్య కోసం ఇప్పటికే వందమందికి పైగా నిరుపేద విద్యార్థులకు సహాయం చేసినట్లు పేర్కొన్నారు. మల్లన్న ఆలయ నిర్మాణం కోసం తన వంతు సహాయంగా లక్ష రూపాయలను అందించి ఆలయ నిర్మాణంలో సహకారం అందించినట్లు తెలిపారు. ప్రజలకు ఉపయోగపడే సహాయం లో ఎన్నడూ వెనకడుగు వేయనని బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఎల్లవేళలా నిరుపేద ప్రజలకు సహాయం అందించేందుకు ముందు ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా మల్లాపూర్ మల్లన్న స్వామి దేవాలయ నిర్వహణ కమిటీ అధ్యక్షులు అల్లాడి కృష్ణ యాదవ్, బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మెన్ బండారి లక్ష్మారెడ్డిని శాలువతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొమరవెల్లి దేవస్థాన పాలకమండలి డైరెక్టర్ ఎర్రగొల్ల మల్లేష్ యాదవ్, మల్లాపూర్ కార్పొరేటర్ పొన్నాల దేవేందర్ రెడ్డి, కాంటెస్ట్ కార్పొరేటర్ కటార్ల భాస్కర్, బొడ్డు నర్సింగ్ యాదవ్, మల్లె కుమార్ యాదవ్, రాజు మల్లు యాదవ్, చిట్టి యాదవ్, శ్రీనివాస్ యాదవ్, శ్రీను యాదవ్, అంజి యాదిరాజు ముదిరాజ్ సంతు యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

మహిళా మండలి భవనంపై అదనపు అంతస్తు నిర్మించాలని ఎమ్మెల్యేకు వినతి

నవతెలంగాణ-కాప్రా



ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి నివాసంలో ఏఎస్ రావు నగర్ డివిజన్ మహిళా మండలి కమిటీ సభ్యులు ఏఎస్‌రావు నగర్ డివిజన్ మహిళా మండలి భవనంపై అదనపు అంతస్తు నిర్మించాలని ఎమ్మెల్యేకి వినతి పత్రం అందజేశారు. అందుకుగాను ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మహిళా మండలి కమిటీ సభ్యులు మల్కా రమాదేవి, కమల, నిర్మల దేవి, సువర్ణ రెడ్డి, పాల్గొన్నారు.

బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆర్థిక సహాయం అందజేత



నవతెలంగాణ-కాప్రా

చర్లపల్లి డివిజన్ గాంధీ నగర్‌కి చెందిన జింకల చంద్రమౌళి యాదవ్ గుండెపోటుతో మరణించడంతో వారి కుటుంబ సభ్యులకు మనో ధైర్యాన్ని కల్పిస్తూ బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా చర్లపల్లి డివిజన్ కంటెస్టెంట్ కార్పొరేటర్, బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి నేమూరి మహేష్ గౌడ్ 10 వేల రూపాయలు ఆర్థిక సహాయం వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గాంధీ నగర్ కాలనీ అధ్యక్షులు జూపల్లి శ్రీశైలం, గోపాల్ యాదవ్ , కాలనీ వాసులు జింకల వెంకటేష్ యాదవ్, బత్తుల రంగా రెడ్డి, మాదగారి రాంచెందర్, సిరికొండొజు శ్రీధర్ చారి, బండి శ్రీనివాస్ గౌడ్, యం.సుందర్‌చారి పాల్గొన్నారు.

కాలనీ సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి



నవతెలంగాణ-కాప్రా

ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి నివాసంలో కాప్రా డివిజన్ శ్రీరామనగర్ కాలనీ ప్రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ సభ్యులు వారి కాలనీ డ్రైనేజీ, సీసీ రోడ్లు, సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యేకి వినతి పత్రం అందజేశారు. అందుకుగాను ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు లక్ష్మీనారాయణ, జగ్గారెడ్డి, పెంటారెడ్డి, కిషోర్, బీఆర్ఎస్ నాయకులు బద్దం భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ప్రజలకు నూతన సంవత్సరాది శుభాకాంక్షలు

కలెక్టర్ అమోయ్ కుమార్

నవతెలంగాణ-మేడ్చల్ కలెక్టరేట్



తెలుగు నూతన సంవత్సరాది శ్రీశోభ కృత్ సంవత్సర ఉగాది పర్వదినం సందర్భంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ అమోయ్ కుమార్ జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.

గర్భిణులు జంక్ ఫుడ్స్‌కు దూరంగా ఉండాలి

- ఊబకాయంతో అనేక సమస్యలు
- గర్భాశయ సమస్యలు ఉన్నవారికి సరోగసి సరైంది
- ఇది సంస్కృతికి విరుద్ధం కాదు
- సున్నితమైన జీవన విధానం వల్ల పురిటి నొప్పులు భరించేందుకు సిద్ధంగా లేని అమ్మాయిలు
- ప్రస్తుత టెక్నాలజీ గర్భిణులకు, వరం.
- ప్రముఖ గైనకాజీస్టు, స్త్రీ వైద్య నిపుణులు డా.పద్మజ

నవతెలంగాణ-ఓయూ



గర్భిణులు జంక్ ఫుడ్స్‌కు దూరంగా ఉండాలని.. ఆర్గానిక్ ఫుడ్ తీసుకోవాలని ప్రముఖ గైనకాజీస్టు, స్త్రీ వైద్య నిపుణులు డా.పద్మజ సూచించారు. అలాగే గర్భాశయ సమస్యలు ఉన్నవారికి సరోగసి సరైందని తెలిపారు. నవతెలంగాణకు వారు ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు.

నవతెలంగాణ : గర్భిణులు ఎలాంటి సమస్యలు ఎదుర్కొంటున్నారు ?

డా.పద్మజ: గర్భిణులు ఖచ్చితంగా నెలకు ఒక్కసారి డాక్టర్ చూపించు కోవాలి. గతంలో 3 లేక 5 నెలలకు ఒక్కసారి డాక్టర్స్ దగ్గరకు వెళ్లే వారు. తరువాత కొన్ని ప్రసవాలు ఇంట్లోనే జరిగేవి. ప్రస్తుతం నెల తప్పిన నాటి నుంచి డాక్టర్స్ వద్దకు వెళ్లాల్సిన అవసరం ఏర్పడింది. స్థానికంగా తప్పనిసరిగా స్త్రీ వైద్యు రాలు ఉంటే తప్పనిసరిగా ప్రతినెలా అక్కడ చూయించు కుంటే ఎంతో ఎంతో మంచిది. ప్రస్తుతానికి అందరికీ దీని గురించి ఎంతో కొంత అవగాహన ఉంది.

నవతెలంగాణ : లేటు వయసులో పెండ్లీలు చేసుకున్న దంపతులకు సకాలంలో సంతానం కలగక పోవడానికి గల కారణాలు ?

డా.పద్మజ : ప్రస్తుతానికి ఆలస్యంగా పెండ్లీలు చేసుకున్న వారు పలు రకాల సమస్యలు ఎదుర్కొంటున్నారు. పాత కాలంలో 18 నుంచి 22 సంవత్సరాల లోపు పెండ్లీలు చేసుకోవడం వల్ల వెంటనే వారికి సంతానం కలిగేది. పుట్టిన పిల్లలు సహితం ఆరోగ్యంగా ఉండేవారు. ప్రస్తుతానికి జీవితంలో స్థిరపడేంత వరకు పెండ్లీలు చేసుకోవడం లేదు. సహజంగా 22 నుంచి 28 సంవత్సరాల మధ్య వయస్సులో అత్యధికంగా సంతానం కలిగే అవకా శం ఉంది. ఇక 28 నుంచి 33 సంవత్సరాల తరువాత రాను రాను సంతాన అవకాశాలు తగ్గుతూ వస్తాయి. ఇక 36 సంవత్సరాల తరువాత ఇంకా సంతానం కలిగే అవకాశాలు అరుదుగా ఉంటాయి. దీనికి గల కారణాల విషయానికి వచ్చేసరికి " ఎగ్స్ ఫీక్స్" సంఖ్యలో ఉండి వయస్సు పెరుగుతున్న రీత్యా వాటి సంఖ్య తగ్గుతూ వస్తుంది. 45 -48 సంవత్సరాలు వచ్చే సరికి నేలసరి (పీరియడ్స్) ఆగి పోయె ఛాన్స్ ఎక్కువగా ఉంటుంది. అందువలన ఆలస్యం గా పెండ్లీలు చేసుకున్న దంపతులకు తప్పనిసరిగా వైద్య అవసరం ఎంతైనా ఉంది. ఇక పురుషుల్లో 40 -45 సంవత్సరాలు దాటితే వీర్య కణాల తగ్గుతుంది.

కొంత మంది గర్భిణులకు 6 లేక 7 నెలలకు ముందే డెలివరీ కావడానికి గల కారణాలు ? కొన్ని సమయాల్లో ఇలా పుట్టిన శిశువులు మరణిస్తున్నారు.

డా.పద్మజ: నెలలు పూర్తిస్థాయిలో నిండక ముందే డెలివరీకి గల కారణాల్లో మొద టిది గర్భాశయంలో లోపాలు. గర్భాశయం చిన్న గా ఉండటం, తగిన సైజు లో లేకపోవడంతో పాటుగా దాని ఆకారం తేడాగా ఉండటం, గర్భాశయం లోపల అడ్డుగోడలు ఉండటం. రెండోది.. గర్భాశయం ముఖ ద్వారం వదులుగా ఉండటం.. దీని వలన నెలలు నిండక ముందే గర్భిణులు ప్రసవించటానికి అవకాశాలు ఉంటాయి. గర్భాశయంలో కవలలు లేక ముగ్గురు ఉన్నపుడు కూడా త్వరగా డెలివరీ అవుతారు. ఇక ఇతర కారణాలు ఇన్ఫెక్షన్స్, అధిక పనిభారం, దూర ప్రయాణాలు కొంత కారణం అని చెప్పాలి. నెలలు నిండక మునుపు 28 వారాల తరువాత జన్మించిన శిశువులను బతికించే అవకాశాలు ఉన్నాయి. కానీ అంత కన్నా తక్కువగా ఉంటే చెప్పలేం. 28 వారాల తరువాత అయితే 60 శాతం శిశువు లు బ్రతికేందుకు అవకాశం ఉంది. 32 వారాలు దాటితే 80 శాతం అవకాశం ఉంది. ఇక పుట్టిన ప్రతీ శిశువు బరువు, అవయవాల అభివృద్ధిని బట్టి బతికే అవకాశాలు ఉంటాయి.

మేనరికం పెండ్లీల వల్ల లోపాలు ఉన్న శిశువులు పుడుతున్నారు.. వాటి కారణాలు ? ముందే నివారించేందుకు ఉన్న వైద్య సదుపాయాలు..

డా.పద్మజ : నివారణకు దంపతులు గర్భధారణకు ముందే ఇద్దరి జన్యు పరీక్షలు చేసి వాటిలో ఉన్న లోపాలకు తగ్గ నివారణ ఉపాయాలు సూచిస్తారు. మేనరికపు పెండ్లీలు చేసుకోవడం అంత ఉత్తమం కాదు.

డా.పద్మజ పెర్టిలిటి సంతాన సాఫల్య కేంద్రం ద్వారా ఎంత మంది అమ్మతనము పొందారు ?

డా.పద్మజ : మా వద్దకు వచ్చే దంపతులకు 60 నుండి 70 శాతం వరకు సంతానం కలుగుతుంది.

గైనకాలజిస్టు వృత్తిలో నాడు నేడు ఉన్న తేడాలు. ప్రస్తుతం ఉన్న టెక్నాలజీ ద్వారా గర్భిణులకు ఎంత వరకు సులభతరమైన వైద్యం అందుబాటులో ఉన్నది ?

డా.పద్మజ : 1997 సంవత్సరంలో భువనగిరిలో మా ఆస్పత్రిని ప్రారంభించాము. నేడు హబ్సిగూడాలో కూడా మా వైద్యశాలకు ఎంతో మంది గర్భిణులు, మహిళలు వస్తున్నారు. ఇక స్కాన్, రక్త పరీక్షల విషయానికి వస్తే, పాత కాలంలో అవిలేక పోవడంతో ప్రతీ ప్రసవం తల్లికి బిడ్డకు జీవన్మరణ సమస్యలా ఉండేది. ప్రసవాల సమయంలో అధిక రక్తస్రావం అయితే దాని నివారణకు అవసరమైన మందులు లేక పోవడం మత్తిచ్చే (ఎనస్తీషియా) సౌకర్యాలు లేక పోవడం, ఫిడ్స్ వస్తే ఎలా చేయాలి లాంటి సమస్యలు ఉండేవి. ప్రస్తుతానికి మాత్రం ఇంజక్షన్స్ లభ్యత అధికంగా ఉండటంతో ప్రసవం ముందు తరువాత అధిక రక్తస్రావాన్ని అరికట్టేందుకు వీలు అవుతుంది. నేటి అధునాతనమైన టెక్నాలజీతో గైనకాలజీస్టుల సేవలు సులభతరం అయ్యాయి.

భార్య లేక భర్త అధిక బరువు వల్ల సకాలంలో పిల్లలు పుట్టకపోవడానికి ఎంత వరకు కారణం అవుతుంది ?

డా.పద్మజ : ప్రస్తుతానికి ఊబకాయం సమస్యగా మారింది. దీని వల్ల మహిళల్లో అండాల నాణ్యత తగ్గి పోవడ తో గర్భ ధారణ జరగటానికి అధిక సమయం పడుతుంది. గర్భధారణ జరిగిన కానీ ఒక వేళ గర్భస్రావం (అబార్షన్), అయ్యే అవకాశాలు అధికంగా ఉంటాయి. గర్భధారణతో పాటుగా అధిక చక్కర, బీపీ, వచ్చే ఛాన్స్ అధిక బరువు వల్ల అవుతుంది. ఇలాంటి మహిళల్లో సాధారణ ప్రసవాల కన్నా ఆపరేషన్స్ జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఇక మగవారిలో వీర్య కణాల సంఖ్య తగ్గి పోవడంతో పాటుగా వాటి కదలికలు తగ్గిపోవడంతో గర్భ ధారణ ఆలస్యం అవుతుంది.

ప్రస్తుతానికి సహజ ప్రసవాలు తగ్గి ఆపరేషన్స్ సంఖ్య రెట్టింపు కావడానికి గల కారణాలు ?

డా.పద్మజ : పూర్వకాలంలో ఎలాంటి వైద్యసేవలు అందుబాటులో లేక గత్యంతరం లేక భరించే వారు.కానీ నేడు తల్లికి బిడ్డకి సమస్యలు రావద్దు ఎందుకంటే ఒక్కరు లేదా ఇద్దరికే జన్మనిస్తారు కాబట్టి ఇక తల్లికి బిడ్డకి ఇబ్బంది లేకుండా ఆరోగ్యంగా ప్రసవం కావాలి అన్న పరిస్థితిలో అటు కుటుంబ పెద్దలు ఇటు గర్భిణులు ఆపరేషన్స్ వైపు మొగ్గు చూపుతున్నారు. కొందరు నొప్పులు భరించటానికి ఇబ్బంది పడుతూ ఆపరేషన్ దిశగా అడుగులు వేస్తున్నారు. ప్రస్తుతానికి శారీరక శ్రమ లేకుండా సున్నితంగా పెరగడం వల్ల డెలివరిలు అయ్యే పెల్విస్ సరిగ్గా అభివృద్ధి చెందటం లేదు. అందుకే సహజ ప్రసవానికి ఇబ్బంది అవుతున్నది. ప్రధానంగా అమ్మాయిలు సహజ ప్రసవానికి మానసికంగా సిద్ధంగా లేరు. పుట్టే పిల్లలు కూడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆరోగ్యంగా ఉండటానికి వైద్యులపై సిజేరియన్స్‌కి ఒత్తిడిని తెస్తున్నారు అనారోగ్య సమస్యల వల్ల కూడా ఇలా సిజేరియన్ వైపు అడుగులు వేస్తున్నారు. నా వద్దకు వచ్చే ప్రత్యేకం అయినవి కేసులు కాబట్టి (రిస్క్), కాబట్టి 70 శాతం నుండి 80 శాతం వరకు ఆపరేషన్స్ చేయాల్సి వస్తుంది.

ఆరోగ్యకరమైన శిశువులు కలగాలంటే గర్భం దాల్చిన నాటి నుంచి ఒక మహిళ ఎలాంటి ఆరోగ్యపరమైన జాగ్రత్తలు పాటించాలి..?

డా.పద్మజ : గర్భిణులు పౌష్టికాహారం తీసుకుంటే పుట్టబోయే పిల్లలు తల్లి ఆరోగ్యంగా ఉంటారు. ఇక గర్భదారణకు ముందే "ప్రీ నేటర్ కేర్" లో అవసరమైన పరీక్షలు చేయించు కోవాలి. థైరాయిడ్, విటమిన్ బీ 12, విటమిన్ డీ ఏ స్థాయిలో ఉన్నాయి, రూబెల్లా లాంటి ఇన్ఫెక్షన్స్ ఉన్నాయా అని ముందుగానే తెలుసుకుని తరువాత గర్భధారణకు వెళ్లాలి. దీని వలన చాలా వరకు సంతాన సమస్యలు తగ్గించుకోవచ్చు. గర్భధారణ జరిగిన తరువాత ప్రతినెలా వైద్యుల సలహాలు అవసరం అయితే స్కానింగ్ చేయించుకోవాలి. 7 నెలల తరువాత నెలకు రెండుసార్లు, అవసరమైనప్పుడు అల్ట్రాసౌండ్ స్కానింగ్ చేయించుకోవాలని సూచించారు. ఇంకా అవసరం అయితే ఇతర నిపుణుల సలహాలు, సూచనలు తీసుకుంటే డెలివరీ సవ్యంగా జరిగే అవకాశాలు ఉన్నాయి.

ఒక సీనియర్ వైద్యురాలుగా అద్దె గర్భం పై మీ అభిప్రాయం ?

డా.పద్మజ : దీనిపై నేను 10 సంవత్సరాలు వర్క్ చేశాను. దీనిని కేవలము 1 శాతం మాత్రమే సెలబ్రిటీలు దుర్వినియోగం చేస్తున్నారు. కానీ 99% మంది ఎవరైతే సంతానం కోసం అన్ని రకాలుగా ట్రీట్మెంట్ తీసుకొని తరువాత కూడా సఫలం కాని వారు 5 నుండి 10 సార్లు ఐవీఎఫ్ చేసుకొని సఫలం కానీ వారు, ఇక తల్లికి గర్భాశయ సమస్యలు ఉన్నవారికి ఈ సరోగసి విధానం ఎంతో శ్రేయస్కారం. ఇది మన సంసతికి ఎలాంటి విరుద్ధంగా అనటానికి వీలులేదు. అద్దె గర్భం ఇచ్చిన వారు తీసుకునే వారు సంతోషంగా సరోగసి పద్ధతికి ఒప్పుకుంటున్నారు. ఇక్కడ ఎవరిని నిర్బంధించాల్సిన అవసరం లేదు. నేడు కొత్తగా " అల్ట్రూస్టిక్ " సరోగసి అనే నూతన పద్ధతి వచ్చింది. ఈ పద్ధతిలో మన దగ్గరి వారు మనకు సహాయం చేయాల్సి ఉంది. దీని వల్ల మనవాళ్లు నిర్బంధంగా ఫీల్ అవుతారు. సరోగసి అత్యంత అవసరమైన విషయం. గర్భాశయం ద్వారా పిల్లలు కనలేని వారికి ఇది మంచి పద్ధతి .

నూతనంగా గైనకాలజిస్టు వృత్తి లోకి వచ్చే వారికి మీరిచ్చే సలహాలు ?

డా.పద్మజ : ఇది నిబద్ధతతో, ఇష్టంతో చేసే వత్తి అధిక సమయం కేటాయించాలి. మనం తీసుకున్న, చేసిన కేసుకు న్యాయం చేకూర్చాలి.

మీ సుదీర్ఘమైన అనుభవం లో మీరూ ఎదుర్కొన్న అతి క్లిష్టమైన కేసులు ఏమైనా

డా.పద్మజ : చాలా వరకు ఉన్నాయి. ఈ వత్తి రీత్యా అవి సహజం

మూలకణాలు భద్రపరిచడం వల్ల పుట్టబోయే పిల్లలకు భవిష్యత్తులో వచ్చే రోగాలు నయం చేయడానికి ఎంత వరకు ఉపయోగపడుతాయి. ఇది సామాన్యుడికి ఎప్పుడు అందుబాటులో వస్తుంది ?

డా.పద్మజ : మూల కణాల (స్టెమ్ సెల్స్) పై ఇంకా పరిశోధనలు జరుగుతున్నాయి. బోన్ మ్యారో ట్రాన్స్ ప్లాంటేషన్‌కు, పుట్టకతో వచ్చే కంటి చూపునకు సంబంధించిన సమస్యలకు మూల కణ టెక్నాలజీ ఉపయోగ పడుతుంది. భవిష్యత్తులో మూలకణాల వినియోగం విస్తతంగా అయ్యే అవకాశాలు ఉన్నాయి. సామాన్యులకు అందుబాటులోకి రావడానికి సమయం పడుతుంది.

అండాలు, వీర్యలు నిల్వ చేసే సౌకర్యం మీ ఆస్పత్రిలో ఉందా ? ఉంటే వీటిని అవసరం అయిన వారికి దేని ఆధారంగా ఇస్తారు.?

డా.పద్మజ : ఈ సౌకర్యం ఆలస్యంగా పెండ్లీలు అయిన వారికి ఉపయోగ పడుతుంది. 28 నుంచి 32 వయస్సు గల మహిళల్లో అండాలు నాణ్యతతో పాటు యాక్టివ్‌గా ఉంటాయి.కానీ ఆ వయస్సులోనే సంతానం వద్దు అనుకునే వారి అండాలు స్టోర్ చేసి అవసరం అయినప్పుడు వాడుకుంటున్నారు. అలాగే పురుషులలో కూడా కొన్ని రకాల చికిత్స ల తరువాత వీర్య కణాల నాణ్యత తగ్గుతుంది. అలా అనుకున్నప్పుడు చికిత్స కు ముందే వీర్య కణాలు భద్రపరుచు కోవచ్చు.

పుట్టబోయే పిల్లలకు తల్లిదండ్రుల నుంచి వంశపారంపర్యంగా జబ్బులు వస్తాయా ? రాకుండా ఉండాలంటే ముందస్తుగా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి ?

డా.పద్మజ : బీపీ,షుగర్ లాంటివి పిల్లలకు రాకుండా ఉండాలంటే జీవన విధానంలో మార్పులు చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. దాంతో వీటిని కొంత వరకు నివారించేందుకు అవకాశం ఉంది.

గర్భిణులు ఆరోగ్యానికి మీరు ఇచ్చే సలహాలు సూచనలు ?

డా.పద్మజ : జీవన విధానాన్ని నిర్లక్ష్యం చేయరాదు. జంక్ ఫుడ్స్ కు దూరంగా ఉండాలి. ఇంటి ఆహారం తీసుకోవాలి. మంచి ఆహారం, గాలి,నిద్రతో పాటుగా వ్యాయామం అవసరం ఎంతైనా ఉంది. స్వచ్ఛమైన పాలు, కూరగాయలు భుజించాలి. ఇక ప్లాస్టిక్ గ్లాస్, ప్లేట్స్ కు దూరంగా ఉండాలి. పేపర్ ప్లేట్స్, గ్లాస్‌లు కూడా వాడకూడదు. ఆర్గానిక్ ఫుడ్ తీసుకుంటే మంచిది. మన జీవ గడియారాన్ని ఆటంక పరిచే పనులు చేయవద్దు

కవల పిల్లలు పుట్టడానికి గల కారణాలు ?

డా.పద్మజ : అండం, వీర్యం,కణం కలిసేప్పుడు బేబీ ఏర్పడే సమయంలో అండాలు రెండుగా చీలిపోయి కవలలుగా ఏర్పడతారు.ఇది సహజం గా జరిగే పద్ధతి .ఇక ఐవీఎఫ్, టెస్ట్ ట్యూబ్ బేబీ పద్ధతిలో చికిత్స తీసుకునే సమయంలో కవలలు పుట్టడానికి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఎందుకంటే మనం ఏ పద్ధతిలో " ఎంబ్రియోస్ " లోపల ప్రవేశ పెట్టడం వలన ఆ సమయంలో కవలలు పుట్టే అవకాశం ఉంది. కొందరు దంపతులు కవల పిల్లలు కావాలని వస్తున్నారు.కానీ కవలల వల్ల అనేక సమస్యలు ఉన్నాయి.మన దేశంలో ఐవీఎఫ్‌లో కూడా ఒక బేబీని ఎంబ్రీయెస్‌లో పెట్టితే బాగుంటుందని అభిప్రాయం కూడా వస్తుంది. దీని వల్ల అనేక ఆర్థిక పరమైన, ఆరోగ్య పరమైన ఇబ్బందులు ఉండవు. ఒక బేబీ పద్ధతి మంచిది.





తెలుగు సంవత్సరాది ఉగాది

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

హిందూ, తెలుగు సాంప్రదాయాల ప్రకారం తెలుగు సంవత్సరాది మొదట పండుగ ఉగాది. (ఉ) అంటే నక్షత్రం (గ) అంటే గమనం, (ది) దైనందిన జీవనం. ఉగాది రోజు నుండి తెలుగు సంవత్సరం ప్రారంభమవుతుంది. కాబట్టి తెలుగు వారి మొదటి పండుగ ఇది. ఇల్లు, వాకిలి, శుభ్రపరచుకోవడం తలంటి స్నానాలు, కొత్త బట్టలు ధరించడం జరుగుతుంది. ఈ రోజున కొత్త పనులు ప్రారంభిస్తారు.

ఉగాదికి కొన్ని ప్రత్యేకతలు ఉన్నాయి

వసంత రుతు ఆగమనం ప్రారంభమైన రోజు. ఈ రోజున షడ్రుచులు కలిపిన పచ్చడిని తయారు చేసి తింటారు. షడ్రుచులు కల ఈ పచ్చడిని తీపి, పులుపు, ఉప్పు, కారం, చేదు, వగరు అనే రుచులు గల బెల్లం చింతపండు, ఉప్పు, కారం, వేప పువ్వు మామిడికాయలు తగిన మోతాదులో మన రుచికి తగినట్టుగా కలిపి తయారుచేస్తారు. అలాగే తెలుగువారు ఉగాది పండుగ నాడు పంచాంగ శ్రవణం జరుపుట ఆచారంగా వస్తుంది. ఆ సంవత్సరంలో మనం తీసు కునే నిర్ణయాలను జాగ్రత్తగా ఆలోచించి తీసుకోవడానికి అవ కాశం ఉంటుంది. అదేవిధంగా సాయంకాలం కవులు ఒకచోట చేరి సమ్మేళనం నిర్వహిస్తారు. ఇందులో కవితలు, పద్యాలు పాడుకోవడం జరుగుతుంది. సమస్త మానవాళికి శుభకృతునామ ఉగాది సందర్భంగా శుభాకాంక్షలు.



మీ... అల్వాల వనజ అశోక్
ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత
కుత్బుల్లాపూర్ ట్రస్మా అధ్యక్షురాలు,
అశోక్ మెమోరియల్ చాణిక్య హైస్కూల్ చైర్మెన్, కరస్పాండెంట్.

ఇతర రాష్ట్రాల్లోనూ ఉగాది..

నవతెలంగాణ-నాగోల్

తెలుగువారికి మొదటి పండగ ఉగాది. వసంతమాసంలో వచ్చే ఈ పండగనే నూతన సంవత్సర దినంగా పాటిస్తూ నూతన పనులను ప్రారంభించడం తెలుగు వారికి పరిపాటి. అయితే ఒక్క తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా మనదేశంలోని ఇతర రాష్ట్రాల్లో కూడా వివిధ పేర్లతో ఈ పండగను జరుపుకుంటారు. మహారాష్ట్రలో గుడి పాడ్వాగా, తమిళనాడులో పుత్తాండుగా, కేరళలో విషుగా, పంజాబ్‌లో వైశాఖిగా, బెంగాల్‌లో పోయ్ లా బైశాఖ్‌గా, అసోంలో బాహుగా ఉగాది పండుగ వేడుకలు జరుపు కుంటారు. కర్నాటకలో మాత్రం ఉగాది పేరుతోనే ఈ పండుగ జరుపుకుంటారు.

ఉగాది రోజు వేకువజామునే నిద్రలేచి మహిళలు ఇల్లు, వాకిళ్లు శుభ్రపరచుకుంటారు. తలంటు స్నానాలు చేసి నూతన వస్త్రాలను ధరించి ఇంటి గుమ్మాలను మామిడి ఆకుల పచ్చ తోరణాలతో అలంకరించుకుంటారు. ఉగాది రోజు షడ్రుచులతో కలిపిన పచ్చడిని తయారు చేసుకుంటారు. అలాగూ పిండి వంటల్లో ప్రధానంగా భక్షాలను, మామిడికాయ పప్పు, పులిహోర సాం బార్‌లను తయారు చేసుకుంటారు వీటిని తయారు చేసుకుంటారు. కుటుంబ సభ్యులతో కలిసి ఇంట్లో ప్రత్యేక పూజలు నిర్వహించి బంధుమిత్రులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసుకుంటారు. అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి భోజనాలు చేస్తారు. అలాగే దేవాలయాలకు వెళ్లి దర్శించుకుని పూజలు నిర్వహిస్తారు. అనంతరం పంచాంగ శ్రవణంలో పాల్గొంటారు. ఈ రోజున కవులు కవి సమ్మేళనం నిర్వహించుకుంటారు.

2023 సైనిక్ స్కూల్స్ ఫలితాలలో రేయాన్ అత్యదిక సీట్లతో విజయ దుందుబి

నవతెలంగాణ-ఎల్.బి.నగర్. దేశవ్యాప్తంగా విడుదలైన ఆల్ ఇండియా సైనిక్ స్కూల్స్ 2023 పలితాలలో 281 టాప్ మార్క్స్‌తో పాటు 225 ఆపైన మార్కులు 63 విద్యార్థులు సాదించారు. అద్దుల్ రెహ్మాన్ హా.టి.నె.4201070303 ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుండి 1వ ర్యాంక్ (మొదటి ర్యాంకు) కె. రోహన్ హా.టి. నె. 4201070303 తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ లలో 4వ ర్యాంక్ మరియు నక్షత్ర రెడ్డి హా.టి.నె.4201080496 ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుండి 6వ ర్యాంక్ భవన తేజ సాయి హా.టి.నె.4201100171 ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుండి 8వ ర్యాంక్ అదేవిధంగా ఇతర రాష్ట్రాలైన మహారాష్ట్ర నుండి జ్యోశిత రెడ్డి హా.టి.నె. 120110584 (1వ ర్యా ంక్), పుదుచ్చేరి నుండి అశ్వాద్ధామ హా.టి.నె. 420111204 1వ ర్యాంక్ (మొదటి ర్యాంకు) సాధించారు మరియు 9వ ఎంట్రన్స్ లో లక్షిత్ రెడ్డి హా.టి.నె.4201027093 ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుండి 3వ ర్యాంక్ సాధించారు. ఎంపికైన విద్యార్థులను ఛైర్మన్ జి. జనార్ధన్ రెడ్డి గారు అభినందించి సన్మానించారు. తాను మాట్లాడుతూ గత 23 సం॥ ల నుండి కొన్ని వేల మంది విద్యార్థులను R.I.M.C., R.M.S. మరియు సైనిక్ స్కూల్స్‌కు ఎంపిక చేశామని వారందరు ఉన్నత స్థాయిలో ఉన్నారని వారి ఉన్నతిలో మా పాత్ర ఉన్నందుకు గర్వంగా ఉందని అన్నారు. డైరెక్టర్ ఉమారెడ్డి మాట్లాడుతూ 2023 R.M.S.కు 4 విద్యార్థులు ప్రతిష్టాత్మకమైన R.I.M.C.,కి ఎకైక సీటు తెలంగాణ నుండి సాదించామని ఎంపికైన విద్యార్థి సాయితేజస్‌ను అభినందించి మిగితా విద్యార్థులకు ఆదర్శమని కొనియాడారు. హాజరైన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు వారి సంతోషాన్ని హర్షాతిరేకలతో తెలిపారు.



Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

25న చైతన్య పాఠశాలలో ఉగాది కవి సమ్మేళనం



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

తెలుగు సంవత్సరాది ఉగాది పర్వదినం పురస్కరించుకొని ఈనెల 25న శనివారం చైతన్య కళానికేతన్ సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో "ఉగాది కవి సమ్మేళనం" జగద్గిరిగుట్ట డివిజన్ మగ్దూంనగర్ లోని చైతన్య హై స్కూల్ ఆడిటోరియంలో నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు, కవి, గాయకులు, శివరాత్రి యాదగిరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కవి సమ్మేళనం మధ్యాహ్నం రెండు గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి పలువురు కవులు, మేధావులు, ప్రజా ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. పరిసర ప్రాంతాల కవులు ఈ ఉగాది కవి సమ్మేళనం కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఉగాది శుభాకాంక్షలు తెలిపిన చైర్‌పర్సన్ మర్రి దీపిక నర్సింహారెడ్డి



నవతెలంగాణ-మేడ్చల్

మేడ్చల్ మున్సిపల్ చైర్‌పర్సన్ మర్రి దీపిక నర్సింహారెడ్డి మున్సిపల్ ప్రజలకు శోభకృత్ నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలను తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగువారికి ఉగాది పండుగ ఎంతో ప్రత్యేకమైనదని అన్నారు. సాధారణంగా తెలుగు నెల అయినటువంటి చైత్రమాసంలో ఈ పండుగ వస్తుంది కాబట్టి ఉగాదిని తొలి పండుగగా పేర్కొంటామని తెలిపారు. ఉగాది పండుగ షడ్రుచుల సమ్మేళనమని, ఈ షడ్రుచులలోని ఒక్కో రుచి, ఒక్కో పదార్థం ఒక్కో భావానికి ప్రతీకని అన్నారు. మన సంస్కృతి, సాంప్రదాయాలకు నిదర్శనమైన ఉగాది పండుగ పట్టణ ప్రజలందరి జీవితాల్లో ఆనందం ఐశ్వర్యాలను తీసుకురావాలని కోరుకున్నారు. మామిడి ముక్కలలోని వగరు వంటి రుచులు కొత్త సవాళ్లకు, కారం మనల్ని సహనం కోల్పేయేటట్టు చేసే పరిస్థితులకు ప్రతీకలని పేర్కొన్నారు.

ఉద్యోగుల అభివృద్ధే సీఎం కేసీఆర్ లక్ష్యం

రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి

నవతెలంగాణ-మేడ్చల్

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల అభివృద్ధే లక్ష్యంగా సీఎం కేసీఆర్ పనిచేస్తున్నారని కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. మంగళవారం గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఉద్యోగులకు(సెర్ప్) జీవో నంబర్ 11ద్వారా జీతాలు పెంచినందుకు ఉద్యోగులతో కలిసి మేడ్చల్ ఎంపీడీవో కార్యాలయంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ సకల జనుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు.కార్యక్రమంలో డీసీఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్ రెడ్డి, ఎంపీపీ రజిత రాజమల్లారెడ్డి, జెడ్పీటీసీ శైలజ విజయానంద రెడ్డి, వైస్ ఎంపీపీ గోపని వెంకటేష్, ఎంపిడివో పద్మావతి, పీఎస్‌సీఎస్ చైర్మెన్‌లు రణదీప్ రెడ్డి, సురేష్ రెడ్డి, మాజీ సర్పంచ్ జగన్ రెడ్డి,సెర్ప్ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంఘాలకు రుణాలు మంజూరు

రైతు సహకార సొసైటీల ద్వారా మహిళా సంఘాలకు





రుణాలు మంజూరు చేస్తున్నట్టుగా కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి తెలిపారు. మంగళవారం మేడ్చల్ ఎంపీడీవో కార్యాలయంలో మహిళా సమాఖ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతు సొసైటీల ద్వారా ప్రథమంగా మహిళా సంఘాలకు రుణాలు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. మహిళలు ఆర్థికంగా వృద్ధి చెందాలని ఉద్దేశంతో వారికి వ్యక్తిగత రుణాలు, గృహ రుణాలు,మర్టిగేజ్ రుణాలు ఇవ్వనున్నట్లుగా తెలియజేశారు. ఈ సమావేశంలో డీసీఎంఎస్ చైర్మన్ మనోహర్ రెడ్డి,వైస్ చైర్మన్ మధుకర్ రెడ్డి,జిల్లా మార్కెట్ కమిటీ చైర్మెన్ భాస్కర్ యాదవ్, ఎంపీపీ రజిత రాజమల్లారెడ్డి, జెడ్పీటీసీ శైలజ విజయానంద రెడ్డి, పీఏసీఎస్ చైర్మెన్‌లు రణదీప్ రెడ్డి, సురేష్ రెడ్డి, ఎంపీడీవో పద్మావతి, మండల కోఆప్షన్ సభ్యురాలు రుక్సనా యూనిస్ పాషా, అధికారులు, డ్వాక్రా సంఘాల మహిళలు పాల్గొన్నారు.

మసీదులు, ఆలయాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేయాలి

కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

మసీదులు, ఆలయాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అధికారులకు సూచించారు రంజాన్, శ్రీరామనవమి వేడుకలను పురస్కరించుకొని మంగళవారం జీహెచ్ఎంసీ కూకట్ పల్లి జోనల్ కార్యాలయంలో అధికారులతో, ముస్లిం సోదరులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ముస్లిం మైనార్టీలకు రంజాన్ మాసం మొదలవడంతో పాటు హిందువులకు ప్రధానమైన శ్రీరామ నవమి వేడుకలు కూడా రానున్నాయనీ అన్నీ విభాగాల అధికారులు అప్రమత్తంగా ఉంటూ సమస్యలను పరిష్కరించి అవసరమైన సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. పండుగలను ప్రజలంతా సోదర భావంతో కలిసిమెలిసి జరుపుకోవాలన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలోని అన్ని డివిజన్లలో మసీదులు, ఆలయాల వద్ద పరిశుభ్రత, తాగునీటి సదుపాయం, విద్యుత్ దీపాలు, ట్రాఫిక్ సమస్యలు వంటివి సత్వరం పరిష్కరించాలని సూచించారు. అన్ని విభాగాల ప్రభుత్వ అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి మసీదులు, ఆలయాల కమిటీ ప్రతినిధులను అడిగి సమస్యలు తెలుసుకొని పరిష్కారించాలని ఆదేశించారు. హైదరాబాద్ మహా నగరం అన్ని మతాలకు కులాలకు సాంప్రదాయాలకు, సంస్కృతులకు సమ ప్రాధాన్యం ఇస్తుందనీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ మమత, ఏసీపీలు చంద్రశేఖర్, గంగారామ్, జలమండలి అధికారి వెంకటేశ్వర్లు, ఉప కమిషనర్లు రవికుమార్, రవీందర్‌లతో పాటు వివిధ విభాగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డుతో పాటు 16 మంది ప్రాణాలు కాపాడిన ఎస్సై

మానవత్వాన్ని చాటుకున్న సీఐ





నవతెలంగాణ- బంజారాహిల్స్

మనిషికి సమయస్ఫూర్తితో పాటు ధైర్య సాహసాలు కూడా అవసరమన్న నిజాన్ని తుడి చెయ్యగలమా!.. ఇక్కడో ఎస్సై తన ప్రాణాలకు తెగించి ఒకటి కాదు రెండు కాదు ఏకంగా పదహారు మంది ప్రాణాలను కాపాడి రియల్ హీరో అనిపించుకున్నారు. మంగళ వారం ప్రగతి భవన్ ముట్టడికి ఏబీవీపీ కార్యకర్తలు ప్రయత్నించారు. ఈ ప్రయత్నాన్ని అడ్డుకుని వారిని అరెస్ట్ చేసిన పోలీసులు 16 మందిని డీసీఎంలో ఖైరతాబాద్ వైపు తరలిస్తుండగా వాహనం నడుపుతున్న హోం గార్డు రమేష్‌కు ఫిట్స్ వచ్చింది. దాంతో ఒక్కసారిగా డీసీఎం అదుపుతప్పి డివైడర్ పైకి దూసుకెళ్లింది. ఈ క్రమంలో డీసీఎంలో ఉన్న బంజారాహిల్స్ ఎస్సై కరుణాకర్ రెడ్డి వెంటనే అప్రమత్తమయ్యారు. కిందకు దూకి ప్రాణాలకు తెగించి వాహనాన్ని కంట్రోల్ చేసి 16 మంది ప్రాణాలు కాపాడారు. ఈ క్రమంలో ఆయనకు, మరో కానిస్టేబుల్ సాయి కుమార్‌కు గాయాలయ్యాయి. ఎస్సై సాహసంతో 16 మంది ఏబీవీపీ కార్యకర్తలు ప్రమాదం నుంచి బయటపడగా గాయపడిన ఎస్సై కరుణాకర్‌ను, రమేష్‌ను స్థానిక ఆస్పత్రికి తరలించారు. ఇదిలా ఉండగా ముట్టడికి వచ్చిన ఏబీవీపీ విద్యార్థి ఒకరు సొమసిల్లి పడిపోవడంతో పంజాగుట్ట ఇన్‌స్పెక్టర్ హరిశ్చంద్రారెడ్డి ఏకంగా భుజాలపై ఎత్తుకొని స్థానికంగా ఉన్న ఆస్పత్రికి తరలించారు. ఇలా విధి నిర్వహణలో ఉన్న పోలీసులు మానవత్వం చాటుకొని ధైర్య సాహసాలతో ప్రాణాలు కాపాడడంతో నగర ప్రజలు వారిని అభినందిస్తూ సామాజిక మాధ్యమాలలో శభాష్ పోలీస్ అంటూ పోస్టులు పెడుతున్నారు. ఏది ఏమైనా వెస్ట్ జోన్ పరిధిలోని పోలీసు అధికారులు ప్రత్యేక భద్రత బలగంలో పనిచేస్తూ వారి మానవత్వాన్ని చాటుకుని ధైర్య సాహసాలతో ప్రాణాలు కాపాడడం గొప్ప విషయమని ఖైరతాబాద్‌వాసులు చర్చించుకుంటున్నారు.

నీటి వనరులను సంరక్షించడం మన బాధ్యత

బాలాజీనగర్ డివిజన్ కార్పొరేటర్ పగుడాల శిరీష బాబురావు



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

నీటి వనరులను సంరక్షించడం మన బాధ్యత అని బాలాజీనగర్ డివిజన్ కార్పొరేటర్ పగుడాల శిరీష బాబురావు అన్నారు. వరల్డ్ వాటర్ డే సందర్భంగా మంగళవారం హెచ్.ఎం.డబ్ల్యు.ఎస్ అండ్ ఎస్.బి సహకారంతో వాటర్ ఎయిడ్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో వివేక్ నగర్ కమ్యూనిటీ హాల్‌లో జరిగిన జల సంరక్షణ (నీటి పొదుపు) అవగాహన సదస్సుకి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మహిళలు వేసే మొదటి అడుగు, కుటుంబం మొత్తంలో గొప్ప మార్పు సాధ్యమని ఆమె తెలిపారు. మనం చేసే పొదుపు, రానున్న తరానికి నీటి కొరత లేకుండా చేస్తుందన్నారు. ఒకప్పటి తెలంగాణ నీటి కోసం ఎన్నో అగచాట్లు పడ్డదని, కరువు రాజ్యంగా నిలిచిన తెలంగాణకు నీటి వనరులను అందించి, సస్యశ్యామలం చేసిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌దేనన్నారు. నీటిని పొదుపుగా వాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు ప్రకాష్, మహిళా నాయకులు శోభ, సావిత్రి, లలిత, వాటర్ ఎయిడ్ ఇండియా కో-ఆర్డినేటర్ ఎం.ఎస్.బి.రాజు, ఫెసిలిటేటర్ వాహిద్‌అలీ, జ్యోతి, సాయికిరణ్, గౌసియా, మహిళలు, అసోషియేషన్ సభ్యులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా విద్యాశాఖ అధికారిని సన్మానించిన మేడ్చల్ జిల్లా ట్రస్మ ప్రతినిధుల బృందం



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

విద్యా విధానంలో వస్తున్న మార్పుల కనుగుణంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా స్థాయిలో విశిష్ట సేవలు అందిస్తున్నందుకు గాను జిల్లా విద్యాశాఖ అధికారిని ఐ.విజయ కుమారికి జాతీయస్థాయిలో అరుదైన గౌరవం దక్కింది. (జాతీయ ఇన్నోవేషన్ ఎడ్యుకేషనల్ అడ్మినిస్ట్రేషన్ 2023)కు ఎంపిక కావడంతో మంగళవారం మేడ్చల్ జిల్లా ట్రస్మ ప్రతినిధుల బృందం జిల్లా అధ్యక్షులు శివరాత్రి యాదగిరి ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో వివిధ మండలాలకు చెందిన ట్రస్మ ప్రతినిధులు ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందచేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తనకు ఇంతటి అరుదైన పురస్కారం లభించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి జే.నాగరాజు, కోశాధికారి ఎండి. అజార్ ఖాన్, కుత్బుల్లాపూర్ మండల ట్రస్మ అధ్యక్షురాలు అల్వాల వనజ అశోక్ ,ఉప్పల్ మండల ట్రస్మ అధ్యక్షులు జోషి ,బాచుపల్లి మండల ట్రస్మ అధ్యక్షులు సాంబశివరావు, గండి మైసమ్మ ట్రస్మ అధ్యక్షులు ప్రవీణ్‌లతోపాటు పలు మండలాల అధ్యక్ష ,కార్యదర్శులు, కోశాధికారులు, పలు పాఠశాలల కరస్పాండెంట్‌లు పాల్గొని జిల్లా విద్యాశాఖ అధికారిని సన్మానించారు.

వీధి కుక్కలను బ్లూ క్రాస్ సొసైటీకి అప్పగించిన కమిషనర్



నవతెలంగాణ-దుండిగల్

కుతుబుల్లాపూర్ నియోజక వర్గం దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని గాగిల్లాపూర్ తాండ, దుండిగల్ తాండ-1,2 లలో మున్సిపల్ కమిషనర్ కే.సత్యనారాయణరావు, వీధి కుక్కల నుంచి చిన్నపిల్లలు, మున్సిపల్ ప్రజలకు హాని కలుగకుండా నివారణ చర్యలలో భాగంగా మంగళవారం బ్లూ క్రాస్ సొసైటీ వారి భాగస్వామ్యంలో 20 కుక్కలను అప్పగించడం జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వీధికుక్కల నివారణ చర్యలలో భాగంగా బ్లూ క్రాస్ సొసైటీ వారితో ఒప్పందం చేసుకోవడం జరిగినది అని, వారు వీధి కుక్కలను తీసుకొని వెళ్లి పిల్లలు పుట్టకుండా స్టెరిలైజేషన్ ఆపరేషన్, యాంటి రేబీస్ టీకా వేసి వదిలిపెట్టడం జరుగుతుందని వివరించారు. ఎండాకాలంలో కుక్కలు డీ హైడ్రైషన్ వలన కుక్కలు వింతగా ప్రవర్తిస్తాయి, కావున వాటకి కావలసిన తాగు నీటిని, ఆహారంను పిల్లలు తిరగని ప్రదేశాలలో అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జవాన్ సి.ఎల్లయ్య బ్లూ క్రాస్ సొసైటీ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష

- ప్రజలకు ఇబ్బందులు లేకుండా పనులు వేగవంతంగా పూర్తి చేయాలి
- చేపట్టే పనులకు వ్యయ ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు ఎమ్మెల్యే ఆదేశం



నవతెలంగాణ - కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని జీహెచ్ఎంసీ జంట సర్కిళ్ల పరిధిలో ఉన్న ఎనిమిది డివిజన్లలో చేపట్టబోయేది వివిధ అభివృద్ధి పనులు మరియు జరుగుతున్న పనులపై మంగళవారం ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ జీహెచ్ఎంసి, ఇంజినీరింగ్, వాటర్ వర్క్స్, ఎలక్ట్రిసిటీ, టౌన్ ప్లానింగ్, లా అండ్ ఆర్డర్ విభాగాల అధికారులతో కలిసి పేట్‌బషీరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయా డివిజన్లో చేపడుతున్న సీసీ రోడ్లు, మంచినీటి పైప్ లైన్లు, భూగర్భ డ్రైనేజ్, శ్మశాన వాటికలు, వర్షపునీట నాలాల నిర్మాణ పనులను ఎమ్మెల్యే అధికారులను అడిగి తెలుసుకున్నారు. వీటిని వేగంగా పూర్తిచేయాలని సూచించారు. ఇటీవలే కురిసిన వర్షాలకు ముంపు ప్రాంతంలో వరద నీటితో ప్రజల కు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని, అటువంటి ప్రాంతాలను గుర్తించి చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే అధికారులకు ఆదేశించారు. అదేవిధంగా "ప్రగతి యాత్ర"లో ప్రతిరోజు పర్యటిస్తున్న నేపథ్యంలో తన దృష్టికి ప్రజలు తీసుకొస్తున్న సమస్యలపై అధికారులు ప్రత్యేక దృష్టివహించి ప్రతిపాదనలు సిద్ధం చేసి తన దృష్టికి తీసుకురావాలని, అందుకు అవసరమయ్యే నిధులు పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లి మంజూరు చేసేలా కృషి చేస్తానని అన్నారు. ఈ సమావేశంలో డీసీలు ప్రశాంతి, మంగతాయారు, ఈఈలు కృష్ణ చైతన్య, గోవర్ధన్‌గౌడ్, డీఈఈలు శిరీష, రూపదేవి, పాపమ్మ, భానుచందర్, డీజీఎంలు విష్ణు ప్రసాద్, అప్పలనాయుడు, రాజేష్, టౌన్‌ప్లానింగ్ డీసీపీ సాంబయ్య మరియు ఏఈలు, మేనేజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సీఎంఆర్ ఇంటర్నేషనల్ ది స్కూల్‌లో ముందస్తు ఉగాది వేడుకలు



నవతెలంగాణ - కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, షాపూర్ నగర్‌లోని సీఎంఆర్ ఇంటర్నేషనల్ ది స్కూల్‌లో మంగళవారం ముందస్తుగా ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్కూల్ ఆవరణను ఆకుపచ్చని మామిడి తోనాలతో అందంగా ముస్తాబు చేశారు. ఉపాధ్యాయుల సహాయం తో విద్యార్థులు ఉగాది పచ్చడి తయారు చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ నీరాప్రసాద్ మాట్లాడుతూ... విద్యార్థులకు ఉగాది పండుగ సంప్రదాయాలు,మన సంస్కృతి విశిష్టత గురించి, వివరించారు. విద్యార్థులకు పండుగలపై అవగాహన కల్పించాలని ఉద్దేశంతో ఉగాది వేడుకలు నిర్వహించినట్లు తెలిపారు. పండుగను సంతోషంగా జరుపుకోవాలని విద్యార్థులకు సూచించారు. ముందస్తుగా విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు తెలుగు నూతన సంవత్సర శ్రీ శుభకృత్ నామ సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొని విజయవంతం చేశారు.

భగత్ సింగ్ వర్ధంతి బహిరంగ సభను జయప్రదం చేయాలి

సీపీఐ, ఏఐవై ఎఫ్, ఏఐఎస్ఎఫ్ నాయకుల పిలుపు



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

భారత దేశ యువకిశోరాలు భగత్‌సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్‌ల 92వ వర్ధంతి సందర్భంగా మార్చ్ 23న జగద్గిరిగుట్ట డివిజన్ పరిధి మగ్దూంనగర్, భగత్‌సింగ్ మార్గ్‌లో కార్యాలయం వద్ద బహిరంగ సభ సాయంత్రం 6 గంటలకు నిర్వహిస్తున్నామని దీనికి యువకులు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి ఉమా మహేష్ పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం ఆయనతో పాటు (ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్,) అఖిలభారత యువజన సమాఖ్య కార్యదర్శి వెంకటేష్, అఖిల భారత విద్యార్థి సమాఖ్య కార్యదర్శి శివ యువజన కార్యకర్తలతో కలిసి జగద్గిరిగుట్ట సీపీఐ కార్యాలయంలో బహిరంగ సభ పోస్టర్ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో యువజన సంఘం నాయకులు సోము, అరుణ్, మొహమ్మద్ వాజీద్, ఖాజా పాషా, మహబూబ్ పాషా, సుధకార్లు పాల్గొన్నారు.

ఉగాది, శ్రీరామనవమి పండుగల వేడుకలకు హాజరు కావాలని మేయర్‌కు వినతి

నవతెలంగాణ-దుండిగల్

కుతుబుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ కోలన్ నీలా గోపాల్ రెడ్డిని, సీనియర్ నాయకులు కోలన్ గోపాల్ రెడ్డిని మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసిన ఆలయ ప్రధాన అర్చకులు రాము, శ్రీ అభయాంజనేయ స్వామి దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇటీవల వరుస పండుగలు 22వ తేదీ ఉగాది, ఈనెల 30వ తేదీ శ్రీరామనవమిల వేడుకలకు హాజరు కావాలని ఆలయ అర్చకులు రాము ఆహ్వానించారు.



షడ్రుచుల పండుగ ఉగాది

- శోభకృత్ నామ సంవత్సరం
- సంస్కృతి, సాంప్రదాయల ఆలవాలం
- నేడు ఉగాది

నవతెలంగాణ-సిటీబ్యూరో


ఉగాది అంటే తెలుగు వారి మొదటి పండుగ. చైత్ర శుద్ధ పాడ్యమి నాడు వచ్చే ఈ పర్వదినానికి ఎంతో ప్రాముఖ్యత ఉంది. ఉగాది రోజు నుంచే తెలుగు సంవత్సరం మొదలవుతుంది. ఇందుకే తొలి పండుగగా తెలుగు నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహిస్తారు. ఉగాది రోజున కొత్త పనులు ప్రారంభించడం ఆనావాయితీ. ఇందుకు ఉగాది పర్వదినం షడ్రుచుల విశిష్టతకు ఖ్యాతి పొందింది. ఉగాదిని ముందు యుగాదిగా పిలిచేది. ఇది సంస్కృతపద వికృతి రూపం. ఉగాది అంటే మొదటి సంవత్సరంలో మొదటి రుతువు వసంతరుతువులో మొదటిమాసంలో మొదటి తిథి అయిన పాడ్యమినాడు ఉగాది పండుగ ప్రత్యేకత. చైత్రమాసంలో శుక్లపక్షంలో సూర్యోదయ సమయానికి పాడ్యమి తిథి ఉన్న రోజును యుగాదియే ఉగాదిగా రూపాంతరం చెందింది. అందుకే ప్రతిఏటా చైత్రశుద్ధ పాడ్యమి రోజున వస్తుంది. ప్రతీ పల్లె, పట్నంలలోని ఆలయాలు, కూడళ్లలో పంచాంగశ్రవణం, కవులు కవితా గానం చేయడం ప్రత్యేకత.

ఉగాది పచ్చడి.. ప్రాముఖ్యత..

ఉగాది పచ్చడి తినే పదార్థం. షడ్రుచుల సమ్మేళనమే ఉగాది పచ్చడి. ఇందులో తీపి, పులుపు, కారం, ఉప్పు, వగరు, చేదు అనే ఆరు రుచులు కలిసిన ఉగాది పచ్చడి తయారుచేసి తీర్థప్రసాదంగా స్వీకరిస్తారు. ఏడాదంతా ఎదురయ్యే మంచి చెడులను కష్ట సుఖాలను సంయమనంతో స్వీకరించాలనే సందేశాన్ని ఉగాది పచ్చడి ఇస్తుంది. ఉగాది పచ్చడి కోసం చెరకు, అరటిపండ్లు, మామిడి కాయలు, వేపపువ్వు, చింతపండు, జామకాయలు, బెల్లంను వినియోగిస్తారు. రుతు మార్పు కారణంగా వచ్చే వాత, కఫ, పిత్త దోషాలను హరించే ఔషధంగా ఉగాది పచ్చడి తినే ఆచారం ఉంది. ఉగాది పచ్చడిని శాస్త్రీయంగా తయారు చేసే పద్ధతిలో ఉప్పు, వేపపువ్వు, చింతపండు, బెల్లం, పచ్చిమిరపకాయలు, మామిడి చిగుళ్లు, అశోక చిగుళ్లువేసి చేసేది. ఉగాది భావాన్ని తెలిపేది ఉగాది పచ్చడి. షడ్రుచుల సమ్మేళనంగా చేసే ఈ పచ్చడి జీవితంలో జరిగే వివిధ అనుభవాలకు ప్రతీకగా నిలుస్తుంది. పచ్చడిలో ఉండే ఒక్కొక్క పదార్థం ఒక్కొక్క భావానికి, అనుభవానికి ప్రతీకగా వస్తుంది. బెల్లం తీపి ఆనందానికి, ఉప్పు జీవితంలో ఉత్సాహం, రుచికి సంకేతమవుతుంది. వేప పువ్వు చేదు బాధకలిగించే అనుభవం, చింతపండు పులుపు నేర్పుగా వ్యవహరించాల్సిన పరిస్థితులకు అద్దం పడుతుంది. పచ్చిమామిడి వగరు కొత్త సవాళ్లకు ఆనవాళ్లుగా నిలుస్తుంది. మిరపపొడి కారం సహనం కోల్పేయేట్టు చేసే పరిస్థితులకు మూలమైంది.

ఉగాది పంచాంగ శ్రవణం.. కవి సమ్మేళనం..

ఉగాది నాడు పంచాంగ శ్రవణం, కవి సమ్మేళనాలు నిర్వహిస్తుంటారు. పంచాంగం అంటే ఐదు అంగములు అని అర్థం. తిథి, వారం, నక్షత్రం, యోగం, కరణం అనేవి ఐదు అంగాలు. 15 తిథులు, 7వారాలు, 27నక్షత్రములు, 27యోగములు, 11కరణములు ఉన్నాయి. వీటన్నింటిని తెలిపేదే పంచాంగం. పంచాంగశ్రవణంలో ప్రధానంగా ఆ సంవత్సర ఫలితాలను వివరించడమే కాకుండా నవనాయకులను తెలుసుకుని వారి ద్వారా ఫలాలను అంచనా వేస్తారు. సంవత్సరంలో ఏ ఏ గ్రహాలకు ఏ అధికారం లభిస్తుందో తెలుసుకుంటారు. నిత్యవ్యవహారాల కోసం ఆంగ్ల క్యాలెండర్‌ను ఉపయోగిస్తున్నా శుభకార్యాలు, పూజలు, పునస్కారాలు, పీతృదేవతారాధన, తదితర విషయాలకు పంచాంగం వాడుతున్నారు. ఈ పంచాంగం ఉగాది రోజున ప్రారంభమై మళ్లీ వచ్చే ఉగాది వరకు చూస్తుంటారు. గతంలో వేదపండితుల వద్దనే ఉండే పంచాంగం ఇపుడు అందరికీ అందుబాటులోకి వచ్చాయి. ఇప్పటికీ సంవత్సర ఫలాలు వేదపండితులే తెలియజేస్తారు. ఉగాదికి సాహితీవేత్తలు ప్రత్యేకంగా కవి సమ్మేళనం నిర్వహిస్తారు. కొత్త, పాత కవులు నవభావన, పాత ఒరవళ్లు కలిపి కొత్త పద్యాలు, కవితలు తయారు చేసి చదువుతారు. సామాజిక జీవనం, రాజకీయం, వాణిజ్యం ఇలా అన్ని విషయాలను ప్రస్తావిస్తారు. కవులు తమ కవితలలో నానా రుచి సమ్మేళనంగా నిర్వహిస్తారు. ఈ సమ్మేళనాన్నే ఉగాది కవి సమ్మేళనంగా పిలుస్తారు.



యుగాలకు ఆది 'ఉగాది'

- ఇది కాలక్రమంగా ఉగాదిగా పిలవబడింది
- కాలగమనంలో మార్పులు అనివార్యం
- శారదనగర్ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి కెఎల్ఎన్.రావు



నవతెలంగాణ-వనస్థలిపురం

యుగాది అంటే యుగాలన్నిటికీ ఆది లేక మొదలు అని అర్థం. ఇది కాలక్రమంగ ఉగాదిగా పిలవబడటం జరుగుతోంది. అసలు ప్రభవ నామంతో మొదలిడి అక్షయ నామ సంవత్సరంతో ముగుస్తుందని శారదనగర్ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి కేఎల్ఎన్ రావు అన్నారు. నవతెలంగాణ ప్రతినిధితో ఆయన మాట్లాడుతూ ఈనాటి ఉగాది శోభకృత్ నామంతో ఆరంభం అవుతుంది. ఇది శుభకృత్ నామ ఉగాదికి వారసత్వంగా వస్తున్నది. అసలు శ్రీరామచంద్ర ప్రభువు మొదటగా ప్రభవ నామ సంవత్సరంలో జన్మించడం జరిగింది. ఉగాది దినచర్య అభ్యంగన స్నానంతో మొదలు పెట్టి షడ్రుచుల ఉగాది పచ్చడి భగవంతునికి నివేదించి, ఆ ప్రసాద స్వీకరణ చేయడంతో, తదనంతరం నూతన వస్త్ర ధారణ చేసి, మృష్టాన్న భోజనం చేసి సమీపంలో జరిగే దేవాలయాలు లేక ఇతర వేదికలపై జరిగే పంచాంగం శ్రవణం చేయడంతో ముగుస్తుంది. తిథి, వారం, నక్షత్రం, యోగం కరణం అనే పంచ లక్షణాలు మానవ జీవితంలోనే కాక సృష్టిలో ప్రభావం చూపుతాయి.

ఈ షడ్రుచులు వరుసగా... **తీపి** : కొత్త బెల్లం, **వగరు** : మామిడి పిందెలు, **పులుపు** : కొత్త చింతపండు, **చేదు** : వేప పువ్వు, **ఉప్పదనం** : ఉప్పు, **కటువు** : కారం. నిజానికి ఉప్పు, కారం వాడటం జరగకూడనిది. దానికి బదులుగా చెఱుకు ముక్కలు, అరటిపళ్ళు వినియోగించే అవకాశం ఎక్కువ. శాస్త్రం కూడ లవణం, కారం వాడకం నిషేధమని సూచిస్తోంది. మన దేశంలో మూడు రకాలైన యుగాదులు వ్యవహారంలో వున్నా కూడ దక్షిణాది రాష్ట్రాల్లోని తెలుగు, కన్నడ, మహారాష్ట్ర ప్రజలు చాంద్రమానాన్ని, తమిళ ప్రజలు సౌరమానాన్ని బట్టి యుగాదులు జరుపుకోవడం ఆనవాయితీ. మూడవది బార్హస్పత్య యుగాది. మనం చాంద్రమానంతో చిత్తా నక్షత్రంతో కలిసిన పాడ్యమి రోజున నిర్వహించే సంప్రదాయం పాటించాలి.

కాల గమనంలో మార్పులు అనివార్యం

కాల గమనంలో మార్పులు అనివార్యం అనిపిస్తోంది. మనం చూస్తూ వుండే ఉగాదికి మామిడి కాయలు లభిస్తున్నాయి. వేపచెట్టు పూత అయిపోవడం, చెరకు పంట దిగుబడి అయిపోయింది. అందుకేనేమో ప్రజల జీవితాలలో, ఋతువుల ధర్మంలో కూడ పెనుమార్పులు కనపడుతున్నాయి. ప్రస్తుతం పులుపు చోటులో వలపు, ఉప్పు స్థానంలో ముప్పు, కారం ప్రదేశంలో వికారాలు, తీపి జాగాలో ప్రజలలో మధుమేహం, వగరు బదులుగా పొగరు, చేదుకు మారుగా మద్యం రావటం చూస్తూ వున్నాము కదా. ఇక ప్రజల జీవితాలలో మార్పు రావాలి. మనం మన సనాతన భారతీయ సంస్కృతికి విలువలకు ఎప్పుడయితే తిలోదకాలిచ్చినామో అప్పుడే ఈ విషమ సంస్కృతి వెల్లివిరియడం మొదలైంది. కరోనాను పారద్రోలి శుభాలనిచ్చిన శుభకృత్ స్థానంలో మరింత శోభనిచ్చే శోభకృత్‌ని ఆహ్వానించడం మన బాధ్యత, ధర్మం కూడ. ఈ సందర్భంగా కేఎల్ఎన్ రావు అందరికీ నూతన తెలుగు ఉగాది శుభాకాంక్షలుతెలియజేశారు.

పేదలను ఆదుకుంటున్న ఉప్పల ఫౌండేషన్





అయినేని భగవంతరావు

చదవాలనే తపన ఉన్నప్పటికీ ఆర్థిక స్థోమత అడ్డు వచ్చి చదవలేని నిరుపేదలకు, ఆడబిడ్డ పెండ్లికి ఆర్థిక వనరులను సమకూర్చుకుంటున్న పేద తల్లిదండ్రులకు తోచిన సహాయ సహకారాలు అందించి ఆదుకోవడంలో ఉప్పల ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మెన్, ఉప్పల ఫౌండేషన్ చైర్మన్ ఉప్పల శ్రీనివాస గుప్తా ముందుంటున్నారు. గడచిన 24 ఏండ్లుగా ఉప్పల ఫౌండేషన్ ద్వారా ఎన్నో సామాజిక సేవలో పాలు పంచుకుంటూ ముందుకు వెళుతున్నారు. ఇప్పటికే వేల మంది ఆడబిడ్డలకు మంగళసూత్రం, మెట్టెలు, గాజులు, చీరలను బియ్యం బస్తాలను కూడా అందించి ఆదుకున్నారు. ఇవే కాకుండా ఫౌండేషన్ ద్వారా వికలాంగులకు చక్రాల కుర్చీలు, చేతి కర్రలు, అనాథ పిల్లలకు నిత్యావసర వస్తువులు, దుస్తులు, చదువు కోసం కావాల్సిన ఫీజులు, నోట్ పుస్తకాలు పంపిణీ చేసి ఆదుకుంటున్నారు. అత్యవసర రోగులకు సకాలంలో వైద్యం అందించేందుకు ఆస్పత్రికి తరలించడానికి ఎల్బీనగర్ నియోజకవర్గంలోని వనస్థలిపురం ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ కు రూ.25 లక్షల వ్యయంతో అంబులెన్స్‌ని కూడా అందించారు. కరోనా కష్టకాలంలో లక్షల మంది పేదలు ఒకవైపు ఉపాధి లేక, మరోవైపు తినడానికి తిండి లేక అల్లాడుతున్న తరుణంలో బియ్యం, కిరాణా సరుకులు, మెడికల్ కిట్లను అందించి భరోసా ఇచ్చారు. లక్షలాదిమందికి బిర్యానీ తయారు చేసి నగర పరిసరాలు, మురికివాడలు, రైల్వేస్టేషన్లు, బస్టాండ్లు, రోడ్లపై ఉండే యాచకులకు పంపిణీ చేసి వారి ఆకలిని తీర్చారు. వైశ్య జాతిలో పుట్టిన పిల్లలు ఆర్థికంగా వెనుకబడిపోతూ ఉన్నత చదువులు చదవలేక చదువుకు దూరమవుతున్న వారికి కూడా ఆర్థిక సహాయం చేసి ఎంతో మందిని ఉన్నత స్థాయికి చేర్చారు.

వాసవీ మాత ఆలయాల నిర్మాణాల కోసం అహర్నిశలు శ్రమిస్తూ ఉత్తమ సేవలందిస్తూ ప్రజాసేవలో ముందుంటున్నారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మెన్ పదవిని చేపట్టిన రెండేండ్ల కాలంలో పర్యాటక అభివృద్ధికి ఎంతో కృషి చేశారు. దీంతో ఆ శాఖకు అవార్డులు కూడా తెచ్చి పెట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాల్లో ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీని బలోపేతం చేస్తూ సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ దృష్టిని ఆకట్టుకోగలిగారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ నుంచి ఏదైనా పిలుపు వస్తే చాలు ఆ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయడానికి పని చేస్తారు. పార్టీ ఆదేశాలకు శిరసా వహిస్తూ క్రమశిక్షణ గల నేతగా ఎదుగుతున్నారు. శ్రీనివాస గుప్తా చేస్తున్న సామాజిక సేవలకు గుర్తింపుగా ఇంటర్నేషనల్ సేవా పురస్కారంతోపాటు విశ్వగురు వరల్డ్ రికార్డ్ ఆధ్వర్యంలో కరోనా వారియర్ ఇంటర్నేషనల్ అవార్డును కూడా ప్రకటించారు.

ఉగాది సందర్భంగా నవతెలంగాణతో ఉప్పల శ్రీనివాస గుప్త మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్ర ప్రజలంతా సుఖసంతోషాలతో మెలగాలన్నారు. తాను వైశ్య కులంలో పుట్టినా పేదరికం గురించి తెలుసుననీ, పేదలకు తాను సంపాదించిన దానిలో ఎంతో కొంత సహాయ సహకారాలు అందించి ఆదుకోవాలనే తపనతోనే ఈ ఉప్పల్ ఫౌండేషన్ స్థాపించినట్టు తెలిపారు. తమ వద్దకు సహాయం కోసం వచ్చిన వారికి లేదనకుండా ఎంతో మందికి సహాయం అందించి ఆదుకుంటున్నట్టు తెలిపారు. ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ ఆధ్వర్యంలో వైశ్య విద్యార్థులకు ఐఏఎస్, ఐపీఎస్ చదువుతున్న వారికి రూ.లక్ష చొప్పున ఉచితంగా విరాళంగా ఇస్తున్నామనీ, ఇప్పటివరకు 25 మందికి అందించినట్టు తెలిపారు. రాష్ట్ర అభివృద్ధితో పాటు సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో దేశ అభివృద్ధిని కూడా కోరుకుంటూ బీఆర్ఎస్‌కు సంపూర్ణ మద్దతునివ్వాలని కోరారు.



వినియోగదారుడి భవిష్యత్తే లక్ష్యం : రియల్ హెూమ్ హరిహరన్ డెవలపర్స్ ఎండీ, సీఈఓ







నవతెలంగాణ-నాగోల్

మమ్మల్ని నమ్మి పెట్టుబడి పెట్టుకున్న ప్రతి వినియోగదారుడూ ఒక్క రూపాయి కూడా నష్టపోకుండా వారి భవిష్యత్తే తమ లక్ష్యం అంటూ రియల్ ఎస్టేట్ వ్యాపారంలో ముందుకెళ్తూ రాణిస్తున్నామని రియల్ హెూమ్ హరిహరన్ డెవలపర్స్ మేనేజింగ్ డైరెక్టర్ మైసా శ్రీనివాస్, సీఈఓ సుద్దాల చంద్రమౌళి యాదవ్ తెలిపారు. ఉగాది పండుగ సందర్భంగా నాగోలులోని వారి కార్యాలయంలో నవతెలంగాణతో మాట్లాడారు. ముందుగా వారు వినియోగదారులకు, అసోసియేట్స్‌కు, బంధుమిత్రులకు, సిబ్బందికి, రియల్ హెూమ్ హరిహరన్ ఇన్ఫ్రా డెవలపర్స్ తరఫున ఎండీ మైసా శ్రీనివాస్, సీఈఓ సుద్దాల చంద్రమౌళి యాదవు ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. రియల్ ఎస్టేట్ రంగంలోకి వెళ్లాలనే ఉద్దేశంతో 2019 జూన్ 19 తమ సంస్థను స్థాపించామని తెలిపారు. ఇప్పటివరకు ఎక్కడా చిన్న మచ్చ లేకుండా అంచలంచలుగా విస్తరిస్తూ అనేకమంది అసోసియేట్స్, సిబ్బందితో ముందుకు వెళ్తున్నామన్నారు. మమ్ములను నమ్మి వినియోగదారులు పెట్టిన పెట్టుబడులకు ఎక్కడా నష్టపోకుండా మెరుగైన సేవలు అందిస్తూ మంచి గుర్తింపు తెచ్చుకుంటున్నామని తెలిపారు. గడిచిన మూడున్నరేండ్లుగా ఎన్నో ప్రాజెక్టులను చేపట్టి ఎలాంటి న్యాయపరమైన ఇబ్బందులు తలెత్తకుండా హెచ్ఎండీఏ, వైటీడీఏ, డీటీసీపీ, హుడా, జీహెచ్ఎంసీ తోపాటు రెరా ఆమోదం పొందిన ప్రాజెక్టులను చేపట్టి విజయవంతం చేశామని వివరించారు. ప్రస్తుతం విజయవాడ హైవే బుర్రలగూడ దగ్గర హెచ్ఎండీఏ లేఅవుట్ 32 ఎకరాలు కమర్షియల్ జోన్‌గా చేపట్టినట్టు తెలిపారు. ఈ ప్రాజెక్టు ఇప్పటికే 80 శాతం పూర్తి దశలో ఉందనీ, సామాన్య ప్రజలకు అనుకూలమైన ధరలతో అందుబాటులో ఉంటున్నట్టు వారు పేర్కొన్నారు. ఆదిభట్లలో విల్లాస్ అపార్ట్మెంట్‌లు పూర్తి దశలో ఉన్నాయనీ, వరంగల్ హైవేలో కీసర, ఘట్కేసర్, బీబీనగర్, భువనగిరి పరిధిలో హెచ్ఎండీఏ లేఅవుట్ ప్రాజెక్టులు కొనసాగుతున్నాయని తెలిపారు. యాదగిరిగుట్ట ఆలయానికి నాలుగు కిలోమీటర్ల పరిధిలో సైదాపూర్ మెయిన్ రోడ్డులో శ్రీ దత్త పేరిట ఐదెకరాల్లో వైటీడీఏ అనుమతితో ప్రాజెక్టు సాగుతున్నదని తెలిపారు.

ప్రస్తుతం మార్కెట్ విధానం వల్ల తక్కువ పెట్టుబడిలో జీవిత కాలం రాబడి తరహాలో ఐకాన్ అనే కంపెనీతో ఒప్పందం కుదుర్చుకుని యాదగిరిగుట్టలో నాలుగెకరాల 31 గుంటల్లో స్టూడియో షూట్స్ గదులను, ట్రిప్లెక్స్ విల్లాస్‌లను వైటీడీఏ, రెరా ఆమోదంతో అన్ని అనుమతులను కలిగిన వెంచర్‌ను చేపట్టినట్టు చెప్పారు.

స్టూడియో షూస్ గదులను తక్షణం రిజిస్ట్రేషన్ చేసుకుంటే 500 స్క్వేర్ ఫీట్స్, 1050 స్క్వేర్ ఫీట్స్ గదులు అందుబాటులో ఉన్నాయన్నారు. 500 స్క్వేర్ ఫీట్స్‌కు రూ.24 లక్షలు, 1,050 స్క్వేర్ ఫీట్స్ రూ.38 లక్షల చొప్పున కొనుగోలు చేసుకుని రిజిస్ట్రేషన్ చేసుకుంటే 500 స్క్వేర్ ఫీట్స్‌కు ప్రతినెలా రూ.10వేలు, 1,050 స్క్వేర్ ఫీట్ స్టూడియో షూట్స్ గదులకు రూ.16వేల చొప్పున అద్దెలు ప్రస్తుతం వస్తున్నాయని తెలిపారు. నిర్మాణ పనులు పూర్తి అయిన తర్వాత ప్రముఖంగా ఉన్న హెూటల్ వారు తీసుకుని జీవితాంతం అద్దెలు చెల్లిస్తారని వారు తెలిపారు. ఇలా తక్కువ పెట్టుబడి తో జీవితాంతం రాబడి వచ్చే విధంగా తమ వ్యాపారాలను కొనసాగిస్తున్నామనీ, యాదగిరిగుట్టలో 150 గజాల్లో విల్లాస్ ట్రిపుల్ ఎక్స్ భవనాలను నిర్మిస్తున్నట్టు దీనికిగాను ప్రతి నెలా రూ.30 వేల చొప్పున అద్దెలు వచ్చే విధంగా ఉంటుందన్నారు. హైదరాబాద్‌లోని కమర్షియల్ బిల్డింగ్స్‌లో పెట్టే పద్ధతుల కొనసాగుతాయని తెలిపారు. నాగోల్ మెట్రో స్టేషన్ వద్ద 4,300 స్క్వేర్ యాడ్‌లో జీ ప్లస్ ఆర్ అంతస్తుల కమర్షియల్ బిల్డింగ్ నిర్మాణం చేపట్టినట్టు తెలిపారు. ఒక ఫ్లోర్ 6వేల స్క్వేర్ ఫీట్లు ఉంటుందనీ, ఒక స్క్వేర్ ఫీట్ కు రూ.12వేల చొప్పున ప్రస్తుతం మార్కెట్ ధరను బట్టి నిర్ణయించామన్నారు. ఆసక్తి కలవారు ఈ 6వేల స్క్వేర్ ఫీట్‌లో మినిమం 200 స్క్వేర్ ఫీట్ నుంచి ఏ ఫ్లోర్ లో అయినా కొనుగోలు చేసుకుని రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చునని వివరించారు. దీంతో కూడా జీవితకాలం స్క్వేర్ ఫీట్ కు రూ.50 చొప్పున అద్దె రూపంలో రాబడి ఉంటుందని తెలిపారు. తక్కువ పెట్టుబడులు పెట్టి జీవితాంతం అద్దెల రూపంలో రాబడిని పొందే వ్యాపార విధానం ప్రస్తుత తరుణంలో ముందంజలో ఉందని పేర్కొన్నారు. నమ్మకమైన కంపెనీలో పెట్టుబడులు పెట్టి జీవితకాలం ఒక పెన్షన్ మాదిరిగా రాబడిని పొందేలా చూసుకోవాలని వారు వినియోగదారులకు సూచించారు.





Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

బిజినెస్

భారత ఐటీ పరిశ్రమపై విదేశీ బ్యాంక్‌ల ప్రభావం



ముంబయి : విదేశీ బ్యాంక్‌లు ఒక్కొక్కటిగా దివాళా తీయడం లేదా వాటి ఆర్థిక పరిస్థితి తీవ్ర ఒత్తిడిలోకి జారుకోవడంతో ఆ ప్రభావం భారత ఐటీ పరిశ్రమపై పడొచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. నాస్కామ్ గణంకాల ప్రకారం.. భారత ఐటీ పరిశ్రమకు బ్యాంకింగ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ అండ్ ఇన్సూరెన్స్ (బీఎఫ్ఎస్ఐ) రంగం అతిపెద్ద ఖాతాదారుగా ఉంది. 2022-23లో ఈ విభాగం నుంచే 41 శాతం రెవెన్యూ సమకూరింది. ప్రస్తుత పరిణామాలు ఐటీ పరిశ్రమ ఆదాయాన్ని దెబ్బతీయడంతో పాటుగా.. ఆయా కంపెనీలు విదేశీ బ్యాంక్‌ల్లో పెట్టిన పెట్టుబడులు ఐటీ పరిశ్రమను ఇప్పుడు ఆందోళన కలిగిస్తున్నాయి. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్), ఇన్ఫోసిస్, విప్రో, హెచ్‌సీఎల్ టెక్నలాజీస్, ఎంఫాసిస్, ఎల్‌టిఐమైండ్‌ట్రీ తదితర భారత ఐటీ కంపెనీలు కొన్ని అనిశ్చిత్తిలోని గ్లోబల్ బ్యాంక్‌లకు నిధులను అందించాయి.

సిలికాన్ వ్యాలీ బ్యాంక్, క్రెడిట్ సుస్సె, యుబిఎస్‌ల్లో టీసీఎస్ నగదు ఉంది. ఎస్‌వీబీ ఇప్పటికే దివాళా తీసినట్లు నోటీసులు ఇచ్చింది. దీంతో టీసీఎస్, ఇన్ఫోసిస్ కంపెనీల తమ మార్చి త్రైమాసికం ఫలితాల్లో ప్రొవిజన్స్ చేయాల్సి రావొచ్చని నిపుణులు భావిస్తున్నారు. ఐటి పరిశ్రమ మధ్య, స్వల్ప కాలానికి పెను సవాలేనని పేర్కొంటున్నారు. వచ్చే త్రైమాసికంలో ఐటి కంపెనీలపై మరింత ఒత్తిడి ఉండొచ్చని ఎఐఐఆర్ సీఈఓ పరీక్ జైన్ పేర్కొన్నారు. అమెరికాలో ఇటీవల చోటు చేసుకున్న సిలికాన్ వ్యాలీ బ్యాంక్ (ఎస్‌వీబీ) సంక్షోభం ప్రపంచ వ్యాప్తంగా దిగ్గజ బ్యాంక్‌లను, ఐటీ కంపెనీలను కలవరానికి గురి చేస్తున్న విషయం తెలిసిందే.

మాంద్యంలోనూ ప్రీమియం ఫోన్లకు డిమాండ్

- సామ్‌సంగ్ హెడ్ వెల్లడి



గుర్గావ్ : ఆర్థిక మాంద్యంలోనూ ప్రీమియం ఫోన్లకు డిమాండ్ పెరుగుతోందని సామ్‌సంగ్ ఎలక్ట్రానిక్స్ మొబైల్ ఎక్స్‌పీరియన్స్ బిజినెస్ హెడ్ టిఎం రోహ్ పేర్కొన్నారు. మందగమనంలోనూ భారత్‌లో ప్రీమియం స్మార్ట్‌ఫోన్ మార్కెట్ వృద్ధి చెందుతుందన్నారు.

5జి స్మార్ట్‌ఫోన్లకు పెరుగుతున్న ఆదరణ వృద్ధికి దారితీస్తుందన్నారు. 2023లో 5జి స్మార్ట్‌ఫోన్ మార్కెట్ 60 శాతానికి పైగా, ప్రీమియం స్మార్ట్‌ఫోన్ మార్కెట్ 30 శాతం పైనా వృద్ధిని చవి చూడనుందని అంచనా వేశారు. దేశంలో 24 గంటల్లోనే ప్రీమియం గెలాక్సీ ఎస్23 సిరీస్ కోసం 1.40 లక్షల బుకింగ్స్ వచ్చాయన్నారు. ఇది గతేడాది గెలాక్సీ ఎస్22 సిరీస్ కొరకు అందిపుచ్చుకున్న ప్రీ బుకింగ్స్ కన్నా రెండింతలు ఎక్కువన్నారు. 2026 నాటికి దేశంలో స్మార్ట్‌ఫోన్ వినియోగదారులు 100 కోట్లకు చేరుకోవచ్చన్నారు.

దుర్వాసనరహిత మార్టిన్ స్మార్ట్ ఆవిష్కరణ


హైదరాబాద్ : నివాసాల్లో ఉపయోగించే కీటకనాశిని ఉత్పత్తుల సంస్థ రెకిట్ తన బ్రాండ్ మార్టిన్‌లో కొత్తగా దుర్వాసనరహిత మార్టిన్ స్మార్ట్‌ను ఆవిష్కరించినట్లు ప్రకటించింది. దోమల వల్ల ఏటా మలేరియా, డెంగీ వంటి వ్యాధుల కేసుల సంఖ్య పెరుగుతోందని రెకిట్ హైజీన్ దక్షిణాసియా రీజినల్ మార్కెటింగ్ డైరెక్టర్ సౌరభ్ జైన్ తెలిపారు. దోమల నివారణకు మార్టిన్ స్మార్ట్ మెరుగ్గా పని చేస్తుందన్నారు. దీన్ని గురుగావ్‌లోని మార్టిన్ అడ్వాన్స్ డ్ రీసెర్చ్ ల్యాబ్‌లో పరీక్షించామన్నారు. శాస్త్రీయంగా నిరూపించ బడిందన్నారు. 2030 నాటికి దేశాన్ని మలేరియారహితంగా చేయాలనే తమ లక్ష్యానికి మరో అడుగు దగ్గర పడిందన్నారు.

కియా నుంచి కొత్తతరం వాహనాలు

హైదరాబాద్: కియా ఇండియా కొత్తగా బీఎస్6 ఫేస్2 నిబంధనలతో నూతన వాహనాలను ఆవిష్కరించినట్లు ప్రకటించింది. సెల్టోస్, సోనెట్, కరెన్స్ వాహనాల్లో అదనపు ఫీచర్లతో పాటుగా బిఎస్6 ఫేస్2 సాంకేతికను అందుబాటులోకి తెచ్చినట్లు పేర్కొంది. నూతన ఆర్‌డిఈ అనుకూల వాహనాల ధరలను రూ.7.79 లక్షల నుంచి రూ.10.89 లక్షలుగా నిర్ణయించింది. 2025 నాటికి భారత్‌లో విద్యుత్ వాహనాలకు ప్రధాన కేంద్రంగా మారనుందని.. తాము కూడా ఇవి6 కార్లను తీసుకురానున్నా మని కియా ఇండియా ఎండీ, సీఈఓ టయి జిన్ పార్క్ పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా ప్రస్తుతం ఆర్‌డిఈ నిబంధనలతో వాహనాలను అందుబాటులోకి తెస్తున్నామన్నారు.

హర్ష మందర్ ఎన్‌జీఓపై సీబీఐ విచారణ

- కేంద్రం ఆదేశం



న్యూఢిల్లీ: ప్రముఖ రచయిత, కాలమిస్ట్, కార్యకర్త హర్ష్ మందర్ నడుపుతున్న ఎన్‌జీఓపై కేంద్రం మంగళవారం సీబీఐ విచారణకు ఆదేశించింది. హర్ష మందర్‌కు చెందిన ఎన్‌జీఓ 'అమన్ బిరాదారి' విదేశీ నిధుల నిబంధనలను ఉల్లంఘించిందని కేంద్రం ఆరోపించింది. విదేశీ విరాళాల నియంత్రణ చట్టం కింద రిజిస్టర్ చేయకుండా అమన్ బిరాదారి సంస్థ విదేశీ సంస్థలైన ఆక్స్‌ఫామ్, యాక్షన్ ఎయిడ్ నుంచి రూ.2 కోట్ల విలువైన విరాళాలను పొందినట్లు కేంద్రం ఆరోపించింది. 2002 గుజరాత్ మారణహోమం అనంతరం స్థాపించిన ఈ సంస్థ మతోన్మాద దాడులకు వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్నది. దీంతో ఈ సంస్థపై హోం మంత్రి అమిత్‌షా విచారణకు ఆదేశించినట్లు తెలుస్తున్నది.

అంతర్జాతీయస్థాయిలో ప్రతిభ చాటేందుకు సహకరిస్తాం

- క్రీడా శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చాటేందుకు ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తుందని రాష్ట్ర క్రీడా శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తా నియా చెప్పారు. మంగళవారం హైదరాబాద్ లోని బీఆర్‌కేఆర్ భవన్‌లో నిర్వహించిన కార్య క్రమంలో 25 మీటర్ల గన్ షూటింగ్‌లో జాతీయ స్థాయిలో రాపిడ్ ఈవెంట్, స్టాడర్డ్ ఈవెంట్‌లో వెండి పతకం సాధించిన కె తనిష్క్‌ను, ఖేలో ఇండియా తరపున ఢిల్లీలో పాల్గొని షార్ట్ గన్ స్కేట్‌లో ఏషియన్ వెండి పతకం సాధించిన రష్మీ రాథోడ్‌ను ఆయన శాలువాతో ఘనంగా సత్కరించారు. తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో జాతీయ క్రీడా పోటీల్లో పాల్గొని పథకాలను సాధించడం పట్ల ఆయన క్రీడా కారులను అభినందించారు.



కేసీఆర్‌కు జై కొడుతున్న "మహా"జనం

- బీఆర్ఎస్ అధినేత రాకకై మరాఠీల ఎదురు చూపులు
- పీయూసీ చైర్మన్, ఎమ్మెల్యే జీవన్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అభివృద్ధి, సంక్షేమంలో అగ్రగామిగా నిలిచి దేశానికి దిక్సూచిగా మారిన తెలంగాణ మోడల్‌ను సంపూర్ణంగా అర్థం చేసుకున్న మహారాష్ట్ర ప్రజలు ముఖ్యమంత్రి కేసీఆర్‌కు జై కొడుతున్నారని పీయూసీ చైర్మన్, ఆర్మూర్ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డి అన్నారు. మహారాష్ట్ర లోని కాందార్ లోహలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేసీఆర్ రాక కోసం మరాఠీలు ఎదురు చూస్తున్నారని చెప్పారు. కాందార్ లోహ సభ ద్వారా తెలంగాణ మోడల్ ఆవిష్కృతమవుతుందని ఆయన పేర్కొన్నారు. "అనితర సాధ్యమైన అభివృద్ధి, ప్రజా సంక్షేమమే తెలంగాణ మోడల్. కేసీఆర్‌ది దేశానికి అన్నం పెట్టే మోడల్.మోడీది అన్నం పెట్టిన వారికే సున్నం పెట్టే మోడల్. కేసీఆర్ అంటే ఒక నమ్మకం.. మోడీ అంటే ఒక అమ్మకం. కేసీఆర్‌ది ఇండియా యిజం. మోడీది ఈడీయిజం.బీజేపీ ఒక సెల్లర్ పార్టీ.కిసాన్ కిల్లర్ పార్టీ. బీఆర్ఎస్‌ది రాజనీతి. బీజేపీది దమన నీతి. కాందార్ లోహ సభ సక్సెస్‌తో మోడీ దిమ్మతిరుగుతుంది..." అని జీవన్ రెడ్డి హెచ్చరించారు. అందరికీ అన్నం పెట్టే కేసీఆర్ మోడల్ కావాలా ?.దేశ ప్రజలకు సున్నం పెడుతున్న మోడీ గోల్ మాల్ మోడల్ కావాలో? దేశ ప్రజలు చర్చించి తేల్చుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

పంట నష్టపోయిన ప్రతి రైతునూ ఆదుకుంటాం



రైతును ఓదార్చుతున్న రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు బోయిన్పల్లి వినోద్ కుమార్

- నష్టాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తాం :రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు బోయిన్‌పల్లి వినోద్‌కుమార్

నవతెలంగాణ-చొప్పదండి

రెండు, మూడ్రోజులుగా కురుస్తున్న వడగండ్ల వానతో పంట నష్టపోయిన ప్రతి ఒక్క రైతునూ ఆదుకుంటామని, ఎవరూ అధైర్య పడొద్దని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు బోయిన్‌పలి వినోద్‌కుమార్ అన్నారు. కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గంలోని చొప్పదండి మండలం మంగళపల్లె, రామడుగు మండలం వెంకట్రావుపల్లి, రామచంద్రపూర్, దత్తోజిపేట, లక్ష్మీపూర్ గ్రామాల్లో దెబ్బతిన్న వరి, మొక్కజొన్న, కర్బూజ, ఇతర పంటలను కలెక్టర్ ఆర్‌వి కర్ణన్, ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, అధికారులతో కలిసి మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లాలో వడగండ్ల వాన పడటంతో పెద్దఎత్తున నష్టం వాటిల్లిందన్నారు. దాదాపు 21 వేల ఎకరాల్లో వివిధ రకాల పంటలు నష్టపోయిన రైతులను ఆదుకునే దిశగా చర్యలు వేగవంతం చేస్తునట్టు చెప్పారు. పంట నష్టం నివేదికను తక్షణమే సిద్ధం చేసి అందజేయాలని వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులను ఆదేశించామన్నారు. నివేదిక అందిన వెంటనే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ప్రభుత్వం తరపున ప్రతి రైతునూ ఆదుకుంటామని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ భరోసా కల్పించారు. వారి వెంట జడ్పీ సీఈవో ప్రియాంక, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వాసిరెడ్డి శ్రీధర్, తహసీల్దార్ అంబటి రజిత, ఎంపీడీవో స్వరూప, ఎంపీపీ చిలుక రవీందర్, జడ్పీటీసీ మాచర్ల సౌజన్య, మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ, సింగిల్ విండో చైర్మెన్ వెల్మ మల్లారెడ్డి, సర్పంచ్ వెల్మ నాగిరెడ్డి తదితరులు ఉన్నారు.

పంట నష్టంపై కేంద్రం సహాయం సున్న

బీజేపీ, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ఎంత ఇచ్చారో ఆత్మవిమర్శ చేసుకోవాలి

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1.11 లక్షల ఎకరాల్లో పంట నష్టం:పంట నష్టపరిహారం చెక్కుల పంపిణీలో మంత్రి ఎర్రబెల్లి
- రాష్ట్రంలో మొదటిసారిగా పంటనష్టపరిహారం చెక్కుల పంపిణీ

నవతెలంగాణ-నర్సంపేట

పంట నష్టంపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఏమాత్రం సహాయం చేయడం లేదని, రైతులను ఆదుకోవడంలో సీఎం కేసీఆర్ ఘనుడని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. మంగళవారం వరంగల్‌లోని ఆయన క్యాంప్ కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్‌లో ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన 2022 పంట నష్టపరిహారం చెక్కుల పంపిణీ ప్రక్రియను మంత్రి ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా గతేడాది నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వడం నర్సంపేట నియోజకవర్గం నుంచే ప్రారంభం కావడం సంతోషంగా ఉందన్నారు. ఆపదలో ఉన్న రైతులకు భరోసానివ్వడంలో తెలంగాణ ప్రభుత్వం ముందు వరుసలో ఉందన్నారు. గతేడాది ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా వడగండ్ల వానకు రైతులు తీవ్రంగా నష్టపోయారని, దాన్ని అంచనాలను రూపొందించి రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి నివేదించినా.. ఇప్పటివరకు నయా పైసా సహాయం చేసిందిలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఏడాదీ వడగండ్ల వర్షాలు కురిసి పంటలు దెబ్బతిని రైతులు భారీగా నష్టాన్ని చవిచూశారని ఆందోళన వ్యక్తం చేశారు. 1,11,235 ఎకరాల్లో వివిధ పంటలు దెబ్బతిన్నాయని వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు ప్రాథమిక అంచనాలు వేశారని తెలిపారు. దాదాపు 71వేల మంది రైతులు నష్టపోయారని తెలిపారు. నర్సంపేట నియోజకవర్గంలో అధికంగా పంటలు దెబ్బతిన్నాయన్నారు. ఇంతటి నష్టాన్ని ఎవరూ పూడ్చలేరని, ప్రభుత్వ నిబంధనల మేరకు నష్టపరిహారం అందిస్తుందని తెలిపారు. నష్ట పరిహారంపై కాంగ్రెస్, బీజేపీలు రాజకీయాలు చేస్తున్నాయని, సమీప ఛత్తీస్‌గడ్‌లో కాంగ్రెస్, కర్నాటకలో బీజేపీ ప్రభుత్వాలు రైతులకు నష్టపరిహారం ఇవ్వలేదని గుర్తించాలన్నారు. ముందుగా అక్కడ పరిహారం చెల్లించి మాట్లాడాలని హితవు పలికారు. గతేడాది జరిగిన నష్టంపై ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ప్రత్యేక చొరవతో ప్రభుత్వం నుంచి జిల్లాలో రూ.13.86 కోట్ల నష్టపరిహారం విడుదలైందని, 15 రోజుల్లోపు 17 వేల మంది రైతులకు చెక్కులను అందజేయనున్నారని తెలిపారు.



వరి, మిర్చి, పత్తి పంటలపై హెక్టార్‌కు రూ.13,500, మొక్కజొన్నకు రూ.8,333 పరిహారం అందిస్తున్నామన్నారు. ఎమ్మెల్యే అడిగిన వెంటనే నర్సంపేటకు రోడ్లు, వివిధ అభివృద్ధి పనులకు రూ.200 కోట్లు మంజూరు చేశామ న్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, జెడ్పీ వైఎస్ చైర్మెన్ ఆకుల శ్రీనివాస్, ఓడీసీఎంఎస్ చైర్మెన్ గుగులోత్ రామస్వామి నాయక్, ఆర్ఎస్ఎస్ రాష్ట్ర డైరెక్టర్ రాయిడి రవీందర్ రెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి ఉషాదయాల్, ఉద్యానవన శాఖ జిల్లా అధికారి శ్రీనివాసరావు, ఏడీఏ అవినాష్ వర్మ, ఉద్యానవన డివిజన్ అధికారి జ్యోతి, ఎంపీపీ, జెడ్పీటీసీ, పీఏసీఎస్ చైరెన్లు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు గవర్నర్, సీఎం ఉగాది శుభాకాంక్షలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర ప్రజలకు గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావు శోభకృత్ నామ ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు సీఎం కేసీఆర్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వ్యవసాయ సంవత్సరంగా పరిగణించే ఈ ఉగాది రైతులు, ప్రజలకు అన్ని రంగాల్లో శు భాలను చేకూర్చాలని ఆకాంక్షించారు. సాగునీరు, తాగునీరు, పచ్చని పంటలతో రాష్ట్రంలో నిత్య వసంతం నెలకొన్నదని పేర్కొన్నారు. వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేయడం ద్వారా దాని అనుబంధ రంగాలు, వృత్తులు బలపడి తెలంగాణ గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పరిపుష్టమైందని వివరించారు. రాష్ట్రం సాధించిన ప్రగతి దేశానికే ఆదర్శంగా నిలిచిందని తెలిపారు. శోభకృత్ నామ సంవత్సరంలో రాష్ట్రంతోపాటు భారతదేశం మరింత గొప్పగా అభివృద్ధి సాధించాలని కోరారు. ఉగాది సందర్భంగా అన్ని వర్గాల ప్రజల్లో శాంతి, సౌభ్రాతృత్వం, సామరస్యం, ఆరోగ్యం, ఆనందం ఉండాలని గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలకు మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, పి సబితా ఇంద్రారెడ్డి, టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్, రాష్ట్ర పోలీసు హౌజింగ్ కార్పొరేషన్ చైర్మెన్ కోలేటి దామోదర్ ఉగాది శుభాకాంక్షలు తెలిపారు.

31న 12 మందికి తెలుగు వర్సిటీ ప్రతిభా పురస్కారాలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఏటా వివిధ రంగాల్లో విశేషమైన కృషిచేసిన 12 మంది ప్రముఖులను ప్రతిభా పురస్కారాలతో సత్కరిస్తున్నది. ఈనెల 31వ తేదీన మధ్యాహ్నం మూడు గంటలకు హైదరాబాద్‌లోని తమ వర్సిటీలో నిర్వహించే ప్రత్యేక ఉత్సవంలో ఈ పురస్కారాలను ప్రదానం చేస్తామని విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ భట్టు రమేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాదికి సంబంధించి ప్రతిభా పురస్కారాలను వివిధ ప్రక్రియల్లో ప్రకటించామని పేర్కొన్నారు. డాక్టర్ వై రామకృష్ణారావు (కవిత), డాక్టర్ లింగంపల్లి రామచంద్ర (విమర్శ), సాజిద్ బిన్ అమర్ (చిత్రలేఖనం), ఎంవి రమణారెడ్డి (శిల్పం), డాక్టర్ వేదాంతం రామలింగశాస్త్రి (నృత్యం), ధూళిపాళ శ్రీనివాస్ (సంగీతం), దామెర్ల సాయిబాబ (పత్రికారంగం), బబ్బెళ్లపాటి శ్రీగోపాలకృష్ణసాయి (నాటకం), కిన్నెర బ్రహ్మయ్య (జానపద కళారంగం), డాక్టర్ చిర్రావూరి శివరామకృష్ణశర్మ (అవధానం), డాక్టర్ బండ సరోజన (ఉత్తమ రచయిత్రి), విహారి (నవల/కథ) పురస్కారాలకు ఎంపికయ్యారని వివరించారు. ఒక్కొక్కరికీ రూ.20,116 నగదు అందజేసి సత్కరిస్తామని తెలిపారు.

వర్షాల కారణంగా దెబ్బతిన్న విద్యుత్‌లైన్లను పునరుద్ధరించండి

- టీఎస్ఎస్‌పీడీసీఎల్ సీఎండీ జి రఘుమారెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో కురుస్తున్న అకాల వర్షాల కారణంగా దెబ్బతిన్న విద్యుత్ లైన్లను పునరుద్ధరించాలని టీఎస్ఎస్‌పీడీసీఎల్ సీఎండీ జి రఘుమారెడ్డి అధికారులను ఆదేశించారు. ఈనెల 16 నుంచి 19వ తేదీ వరకు రాష్ట్రంలో కురిసిన అకాల వర్షాల కారణంగా జరిగిన నష్టాలపై వివిధ శాఖల అధికారులతో మంగళవారం ఆయన సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం ఒక ప్రకటన విడుదల చేశారు. డిస్కాం పరిధిలో సంభవించిన బ్రేక్‌డౌన్‌ల మీద ఇంజినీర్లతో చర్చించారు. వీలైనంత తొందరగా బ్రేక్‌డౌన్‌కు సంబంధించిన పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. విద్యుత్ వినియోగదారులకు అసౌకర్యం లేకుండా చూడాలని కోరారు. విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని సూచించారు. జీహెచ్ఎంసీ పరిధిలో రూ.1,448 కోట్ల నెలవారీ డిమాండ్‌కుగాను 99 శాతం వసూళ్ల అయ్యాయని వివరించారు. అందులోనూ సౌత్ సర్కిల్‌లో రూ.119 కోట్ల రెవెన్యూ డిమాండ్‌కుగాను రూ.118 కోట్లు వసూళ్లయ్యాయని పేర్కొన్నారు. డిస్కాం సాంకేతిక, వ్యాపార నష్టాలను మరింతగా తగ్గించేందుకు క్షేత్రస్థాయి తనిఖీలను ముమ్మరం చేయాలని ఆదేశించారు. అవసరమైన చోట విజిలెన్స్ తనిఖీలు చేపట్టాలని సూచించారు. ఉగాది, రంజాన్ ఉపవాసాల సమయంలో సిబ్బంది అప్రమత్తగా ఉండాలనీ, అంతరాయాలు లేకుండా విద్యుత్ సరఫరా అయ్యేటట్టు చూడాలని కోరారు.

24,25 తేదీల్లో ఇంటర్-కాలేజీ మేనేజ్‌మెంట్ ఫెస్ట్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా (ఆస్కి), సెంటర్ ఫర్ మేనేజ్‌మెంట్ స్టడీస్ (పీజీడీఎం), కేంద్రం పిన్నాకిల్ 23 సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 24,25 తేదీల్లో బంజారాహిల్స్‌లోని కాలేజ్ పార్క్ క్యాంపస్‌లో ఇంటర్ - కాలేజ్ మేనేజ్‌మెంట్ ఫెస్ట్‌ను నిర్వహిస్తున్నాయి. మరుపురాని అనుభూతిని అందించే ఈ ఉత్తేజకరమైన కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరా యి. డిగ్రీ, పీజీ విద్యార్థులు బుధవారంలోగా పిన్నాకిల్23 కోసం పేర్లు నమోదు చేసుకోవాలని సూచించింది. ఆస్కి, పీజీడీఎం వెబ్‌సైట్ https://ascipgdm.inను సందర్శించాలని కోరింది. మరిన్ని వివరాల కోసం 8341288816, 8885398849, 9032705403 నెంబర్లను సంప్రదిం చాలని సూచించింది. రెండురోజులపాటు నిర్వహించే ఈ ఫెస్ట్‌లో ఉప సంఘ టనలు, పోటీలు, వినోద కార్యక్రమాలుంటాయని తెలిపింది. డీజే బృందంతో సాంస్కృతిక కార్యక్రమం ఉంటుందని వివరించింది. అద్భుతమైన బహుమ తులు, కూపన్లు, సర్టిఫికెట్లు గెలుచుకునే అవకాశముందని పేర్కొంది. బెస్ట్ మేనేజర్ ప్రైజ్, ట్రోఫీ, ఆకర్షణీయమైన నగదు బహుమతిని పొందొచ్చని సూ చించింది. ఇండియా విజన్-2047 పేరుతో సెమినార్‌ను నిర్వహిస్తున్నట్టు ప్రకటించింది. భారతదేశం స్వాతంత్ర్యం పొంది వందేండ్లకు చేరుకుంటున్న సందర్భంగా యువత ఆశలు, ఆకాంక్షలను చర్చిస్తున్నట్టు వివరించింది.

ఈ-కుబేర్‌లో పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలి

- ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ధర్నాలకు టీయుఎంహెచ్ఇయూ మద్దతు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఈ-కుబేర్‌లో ఉన్న పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలనే డిమాండ్‌పై ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఈ నెల 24న నిర్వహించ తలపెట్టిన ధర్నాలకు తెలంగాణ యునైటెడ్ మెడికల్, హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ (టీయుఎంహెచ్ఇయూ) సంపూర్ణ మద్దతు తెలిపింది. ఈ మేరకు మంగళవారం యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.యాదానాయక్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు,కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలు, పీఆర్సీ ఏరియర్స్ బిల్లులు, ప్రావిడెంట్ ఫండ్‌లోన్లు, సరెండర్ లీవులు, ఫిక్స్ టూర్ అలవెన్సులు, మెడికల్ రియంబర్స్‌మెంట్ బిల్లులు ఈ కుబేర్‌లో నెలల తరబడి పెండింగ్‌లో ఉంటున్నాయని తెలిపారు. దీంతో వారు ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ధర్నాలో వైద్య ఆరోగ్య రంగంలో పనిచేస్తున్న ఉద్యోగులందరూ పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి పెండింగ్ బిల్లులన్నింటిని చెల్లించాలని యాదానాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఉపాధి పనులకు 25 లోగా ఎఫ్‌టీవో పూర్తి చేయాలి

- పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి సుల్తానియా

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉపాధి హామీ చట్టంలో భాగంగా మెటీరి యల్ కాంపొనెంట్ కింద చేపట్టిన పనులకు సంబంధించి ఈనెల 25లోగా ఫండ్ ట్రాన్స్ ఫర్ ఆర్డర్ (ఎఫ్‌టీవో) జనరేషన్‌ను విధిగా పూర్తి చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా అదనపు కలెక్టర్లను ఆదేశించారు. మంగళవారం అన్ని జిల్లాల అదనపు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లు, డీఆర్డీవోలు, అదనపు డీఆర్డీవోలు, పంచాయతీరాజ్ ఈఈలతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సుల్తానియా మాట్లాడుతూ మెటీరియల్ కాంపొనెంట్‌లో అనుసంధానమై ఉన్న సీసీ రోడ్లతోపాటు మన ఊరు-మనబడి, క్రీడా ప్రాంగణాలు, పల్లె ప్రకృతి వనాలు, ఎవెన్యూ ప్లాంటేషన్ తదితర పనులకు సంబంధించి ఎఫ్‌టీవో జనరేషన్ ఈనెల 25లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. నిజామాబాద్, నిర్మల్, మహబూబాబాద్, మెదక్, ఖమ్మం, వికారాబాద్ జిల్లాలు ఎఫ్‌టీవో జనరేషన్‌లో వెనుకబడి ఉన్నాయని చెప్పారు. వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయా జిల్లాల అదనపు కలెక్టర్లను కోరారు. ఎఫ్‌టీవో జనరేషన్ విషయంలో రూ.కోటి మిగిలి ఉండొద్దని సూచించారు. ఆలస్యం చేస్తే ఆయా జిల్లాలు నష్టపోయే అవకాశముందని అన్నారు. నల్లగొండ, మేడ్చల్, జనగామ జిల్లాలు ఎఫ్‌టీవో జనరేషన్ సకాలంలో చేపట్టడం పట్ల ఆయన అభినందించారు. ఎట్టిపరిస్థితుల్లోనూ ఈనెల 25లోగా పూర్తికావాలనీ, జాప్యం చేస్తే చివరి క్షణంలో సర్వర్లపై ఒత్తిడి పెరిగి పని కష్ట సాధ్యమవుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఇంజినీర్ ఇన్ చీఫ్ సంజీవరావు, స్పెషల్ కమిషనర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కొల్లాపూర్ బెనిషాన్‌పై 'వైరస్'



- పడిపోయిన మామిడి దిగుబడి.. కౌలు రైతుల్లో దిగులు
- సాగులో నష్టపోతున్న రైతులు
- ఆర్థిక సహాయం అందక రైతన్న విలవిల

నవతెలంగాణ-మహబూబ్‌నగర్ ప్రాంతీయ ప్రతినిధి

మామిడి చెట్లను ఈసారి వైరస్ కప్పేసింది. పూత, పింద లేక చెట్లు వడలిపోయాయి. ఉన్న కాయలకూ తెగులే కనిపిస్తోంది. ఈ సాగులో ఉన్న కౌలు రైతన్న కూనరిల్లుతున్నాడు. పత్తి మొదలుకొని వేరుశనగ, కందుల దాకా కౌలు రైతులు వివిధ రకాల పంటలను సాగు చేస్తున్నారు. మామిడి సాగులో ఎకరాకు 150,000 చెల్లిస్తుంటే మిగతా పంటలకు 20 వేలు కౌలు చెల్లిస్తున్నారు. కొల్లాపూర్ బెనిశాన్ దేశంలోనే పేరు ప్రఖ్యాతులు ఉన్నాయి. ఈ ఎడాది మామిడి సాగుకు వైరస్ ప్రభావంతోపాటు అతి ఉష్ణోగ్రతల వల్ల పూత కాత లేదు.

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రధానంగా మామిడి తోటలు కొల్లాపూర్, కల్వకుర్తి, పెద్దకొత్తపల్లి, వీపనగండ్ల, చిన్నంబావి, పెంట్లవెల్లి, మండల పరిధిలో అధికంగా ఉన్నాయి. 20వేల మంది కౌలు రైతులున్నారు. వీరి మామిడితోపాటు బత్తాయి, జామ పంటలు సైతం సాగు చేశారు. అత్యధికంగా వీపనగండ్ల మండల పరిధిలో మామిడి తోటలు ఉన్నాయి. చలికాలం ప్రారంభ దశలో ఉష్ణోగ్రతలు తగ్గకపోవడం వల్ల మామిడి పూతపై భారీ దెబ్బ తగిలింది. వచ్చిన పూత వైరస్ ప్రభావం చేత నేలరాలింది. ఆకులు సైతం నల్లగా మారిపోతు న్నాయి. వీపనగండ్ల మండల పరిధిలో మాసం వెంకటయ్యకు ఆరు ఎకరాల్లో బేనిషాన్ మామిడి తోట. గత ఏడాది బాగా దిగుబడి వచ్చింది. ఈసారి దిగుబడి 90 శాతం తగ్గింది. మరో రైతు మాసయ్య మామిడి తోటదీ ఇదే పరిస్థితి. గత ఏడాది ఐదు లక్షలు వచ్చాయని, ఈసారి ఐదు వేలు అయినా వచ్చే అవకాశాలు లేవని రైతులు తెలిపారు. కల్వకోలు లక్ష్మయ్యకు మామిడి తోట ఉంది. సీజన్లో పూత రాలిపోయింది. కాతా నిలువలేదు. ఇప్పుడు ఆకు సైతం నల్లగా మారిపోతుందన్నారు.

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 70 వేల ఎకరాల్లో మామిడి తోటలున్నాయి. ఇందులో 55 వేల ఎకరాలు దిగుబడి ఇస్తుండగా.. మరో 25 వేల ఎకరాలు కాత దశలో ఉన్నాయి. మామిడి తోటలను 20 వేల కుటుంబాలు కౌలు తీసుకొని జీవిస్తున్నాయి. ఎకరాకు లక్షన్నరకు పైగా కౌలు చెల్లించారు. ఇప్పుడు కౌలు తీరే దారి లేక అప్పులు చెల్లించలేక రోడ్డున పడ్డారు. మిగతా పంటల మాదిరిగా కౌలు రైతులకు ప్రభుత్వం నుంచి నష్టపరిహారం వచ్చే పరిస్థితులు లేవు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి మామి డి సాగులో నష్టపోయిన కౌలు రైతులకు ఆర్థిక సహా యం అందించాలని ప్రజాసంఘాల నేతలు కోరారు.

కౌలు రైతులను ఆదుకోవాలి

ఈసారి వాతావరణం అనుకూలించకపోవడం వల్ల మామిడి పూత రాలి కౌలు రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఎకరాకు లక్షన్నరకు పైగా పెట్టుబడి పెట్టగా.. కౌలు రైతులకు ఈ ఏడాది 5 వేలు రావడం లేదు. మిగతా పంటల మాదిరిగా కౌలు రైతులకు నష్టపరిహారం చెల్లించాలి. వ్యవసాయ అధికారులు పంట నష్టాన్ని పరిశీలించి అంచనాలు తయారు చేసి పరిహారం అందించాలి.

- బాల్ రెడ్డి- రైతు సంఘం నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షులు

ఫోన్ల ధ్వంసం ఆరోపణలకు కవిత ఖండన

- ఈడీ దర్యాప్తు అధికారి జోగేంద్రకు లేఖ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఈడీకి దొరకకుండా తాను ఫోన్లను ధ్వంసం చేశానంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తీవ్రంగా తప్పుపట్టారు. ఈ మేరకు మంగళవారం ఈడీ దర్యాప్తు అధికారి జోగేంద్రకు ఆమె లేఖ రాశారు. దురుద్దేశ పూర్వకంగా వ్యవహరిస్తున్నప్పటికీ కూడా తాను గతంలో వాడిన ఫోన్లను సమర్పిస్తున్నట్టు తెలిపారు. ఒక మహిళ ఫోన్ స్వాధీనం చేసుకోవడం గోప్యతకు భంగం కలి గించడం కాదా ? అంటూ ప్రశ్నించారు. 'దుర్బుద్ధితో వ్యవహరిస్తున్న దర్యాప్తు సంస్థ నేను ఫోన్లను ధ్వంసం చేశానని పేర్కొంది, నన్ను కనీసం అడగ కుండానే ఎందుకు దర్యాప్తు సంస్థ ఈ ఆరోపణలు చేసింది ?. నన్ను తొలి సారిగా ప్రస్తుత మార్చి నెలలో విచారణ కోసం ఈడీ పిలిచింది. కానీ గతేడాది నవంబరులోనే ఫోన్లు ధ్వంసం చేశానంటూ ఈడీ ఆరోపించడం అంటే దురు ద్దేశపూర్వకంగా తప్పుడు ఆరోపణలు చేయడమే. దాంతో పాటు ఈ విష యంపై లీకులు ఇవ్వడం వల్ల నన్ను రాజకీయ ప్రత్యర్థులు ప్రజల్లో నిందిస్తు న్నారు. తద్వారా నా ప్రతిష్టకు తీవ్ర భంగం కలగడమే కాకుండా నా పరువు ను, మా పార్టీ ప్రతిష్టను ప్రజల్లో తగ్గించేందుకు ప్రయత్నించారు.